www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

కేదార్‌నాథ్‌లో కూలిన హెలికాప్టర్



ఏడుగురి దుర్మరణం

తిరుపతి విమానంలో పొగలు

హైదరాబాద్ నుంచి బయలుదేరే సమయంలో స్పైస్‌జెట్‌లో గుర్తింపు

అక్కడే నిలిపివేసి సాంకేతిక సిబ్బంది మరమ్మతులు

అర్ధరాత్రి 12 గంటలకు టేకాఫ్

2

సోమవారం | 16-6-2025 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 61 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, బహళ పక్షం తిథి: పంచమి మ.3:32 తదుపరి షష్ఠి, నక్షత్రం: ధనిష్ఠ రా.1:14 తదుపరి శతభిషం, వర్జ్యం: లేదు, దుర్ముహూర్తం: మ.12:42-1:34, మ.3:18-4:10, అమృతఘడియలు: మ.2:43-4:20, రాహుకాలం: ఉ. 7:30-9:00, సూర్యోదయం: 5:44, సూర్యాస్తమయం: 6:47 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

యుద్ధ బీభత్సం



ఇజ్రాయెల్‌పైకి దూసుకెళ్తున్న ఇరాన్ క్షిపణులు



టెహ్రాన్‌లో పేలిన కారు బాంబులు

మరింత విస్తరిస్తున్న ఇరాన్-ఇజ్రాయెల్ పోరు

- టెహ్రాన్‌లో కారు బాంబులు.. ఆరుగురు అణు శాస్త్రవేత్తల మృతి
- పశ్చిమాసియాకు బ్రిటన్ సేనల తరలింపు
- మా బేస్‌లపై దాడి చేస్తే ఇరాన్‌కు మూల్యం తప్పదు: ట్రంప్
- తాజాగా మరో ఇంధన కేంద్రంపై ఇజ్రాయెల్ దాడులు
- ఇరాన్‌లోని అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల ప్రాంగణంపైనా..
- టెహ్రాన్‌లో రక్షణ శాఖ ఆఫీసు, పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ధ్వంసం
- ఇజ్రాయెల్‌పైకి ఎయిర్‌డిఫెన్స్ కన్నుగప్పే హాజ్‌ఖాసీం క్షిపణులు
- అందుకే ఆ క్షిపణుల స్థావరాలపై దాడులు: నెతన్యాహు
- ఇజ్రాయెల్ 'వైజ్‌మన్ ఇన్‌స్టిట్యూట్'పై ఇరాన్ క్షిపణులు
- అతిపెద్ద సైంటిఫిక్ కమ్యూనిటీకి ఆ సంస్థ ఆవాసం
- 80 లక్ష్యాలపై ఇజ్రాయెల్ దాడి.. 128 మంది మృతి
- టెల్‌అవీవ్ శివార్లలో బీభత్సం.. 10 మంది దుర్మరణం

టెల్‌అవీవ్/టెహ్రాన్/దుబాయ్, జూన్ 15: ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం ముదురుతుండడంతో పశ్చిమాసియా భగ్గుమంటోంది. ఇజ్రాయెల్‌కు మద్దతుగా బ్రిటన్ తన సేనలను పశ్చిమాసియాకు తరలిస్తుండగా.. ఇరాక్‌లోని తమ సైనిక బేస్‌లపై దాడులు చేస్తే, ఇరాన్ మూల్యం చెల్లించుకోక తప్పదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. భారత్-పాకిస్థాన్ మాదిరిగా ఇరాన్-ఇజ్రాయెల్ చర్చలు జరిపి, యుద్ధాన్ని ఆపాలని పిలుపునిచ్చారు. అటు ఇరాన్‌కు పాకిస్థాన్, తుర్కియే మద్దతిస్తుండగా.. మరికొన్ని ఇస్లామిక్ దేశాలు అండగా నిలవాలని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ

మిగతా 2వ పేజీలో...

150 డాలర్లకు చమురు!

- ఇరాన్-ఇజ్రాయెల్ పోరుతో ఇప్పటికే 5 నెలల గరిష్ఠానికి
- ఇప్పుడు చమురు, సహజ వాయు క్షేత్రాలపైనా దాడులు
- హోర్ముజ్ జలసంధిని మూసే దిశగా ఇరాన్ యోచన
- ఈ పరిణామాలతో ధరాభారం మరింత పెరిగే ముప్పు
- మన ఆర్థికవ్యవస్థపై తీవ్ర ప్రభావం.. ద్రవ్యోల్బణం పైపైకి!



ఉండవల్లి క్యాంప్ కార్యాలయంలో కేంద్ర మంత్రి గోయల్‌తో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

పొగాకు రైతులను ఆదుకోండి!

- బర్లీ పొగాకు కోసం 150 కోట్లు వెచ్చించండి
- 300 కోట్లతో మేం పొగాకు కొంటున్నాం
- పామాయిల్ సుంకంలో పాత విధానమే మేలు
- ఆక్వా టారీఫ్‌ల భారంపై అమెరికాతో చర్చించాలి
- మామిడి గుజ్జుపై జీఎస్టీ 5 శాతానికి తగ్గించాలి
- కేంద్ర మంత్రి గోయల్‌ను కోరిన చంద్రబాబు

అమరావతి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిశీలించి, వాటి పరిష్కారానికి చొరవ చూపాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను సీఎం చంద్రబాబు కోరారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి గోయల్ ఆదివారం ఉండవల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో చంద్రబాబుతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వివిధ వాణిజ్య పంటలు, ఆక్వా రైతుల కష్టాలపై చర్చించారు. హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోళ్లు, క్రూడ్ పామాయిల్‌పై

మిగతా 11వ పేజీలో...

పొగాకు అదనపు సాగు వద్దు

దాంతో రైతులకు ఇబ్బందులే: గోయల్

విశాఖ భూములపై రాజకీయ గద్దలు



మాజీ సైనికులు, సామాన్యుల అసైన్డ్ భూములపై ఓ దళారీ కన్నేశాడు. హక్కుదారులను చీకటి భ్రమల్లో ఉంచి వారిని లేనిపోని భయభ్రాంతులకు గురిచేసి తాను తప్ప మరెవ్వరూ భూమిని కాపాడలేరని నమ్మించాడు. ఆ తర్వాత వారిని నట్టేట ముంచేశాడు. ఇదే దళారీ రాజకీయ నేత అవతారం కూడా ఎత్తాడు. పెద్దల ఆశీస్సులతో ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రికి స్వాగతం పలికే ప్రొటోకాల్ జాబితాలో అగ్రపథాన ఉండడంతో అధికారయంత్రాంగం కూడా దాసోహమైంది. దీంతో భూములన్నీ సర్వం ఆయన గుప్పిట్లోకి వెళ్లిపోయాయి.

- రామానాయుడి స్టూడియో పక్కనున్న ఐదెకరాల డీ పట్టాపై సెటిల్‌మెంట్
- భూమి విలువ రూ.82 కోట్లపైమాటే
- వైసీపీ మాజీ ఎమ్మెల్యే గుప్పిట్లో ఆ భూమి
- ముందుగానే కాంపౌండ్‌వాల్ నిర్మాణం
- ఆ ఫైలును ప్రాసెస్ చేస్తున్న అధికారులు
- రెవెన్యూ అధికారులకు మౌఖిక ఆదేశాలు
- సౌభాగ్యరాయపురంలోని 38 ఎకరాలపై మార్చి మొదటి వారంలో ఒప్పందం
- షెల్ కంపెనీల ద్వారా డబ్బు పంపిన నేత
- ఆ తర్వాత అర్ధరాత్రి అడ్వాన్సులు
- భూ దళారి అవతారమెత్తిన నేతకు పెద్దల ఆశీస్సులు


(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గతంలో వైసీపీలో పనిచేసి ఇటీవల టీడీపీలో చేరిన ఓ భూదళారీ ఊసరవెల్లిగా మారి విశాఖ, దాని చుట్టుపక్కల ఉన్న విలువైన భూములను మింగేసిన కథ ఇది. రెవెన్యూ పెద్దల ఆశీస్సులతో ఇప్పటికే ఎండాడలోని మాజీ సైనికుల భూములను సెటిల్ చేసిన ఆ దళారీ నేత ఇప్పుడు మరికొన్ని భూములపై కన్నేశాడు. వాటి విలువ తెలిస్తే మతిపోవాల్సిందే. కనీసం రూ.230 కోట్ల పైమాటే మరి. పెద్దల ఆశీస్సులతో ఆయన చేపట్టిన భూ దందాలు ఇబ్బడిముబ్బడిగా వెలుగు చూస్తున్నాయి. అందులోదే రామానాయుడి స్టూడియో సమీపంలోని మరో ఐదు ఎకరాల డీ పట్టా భూమి.

నెల్లూరు వైసీపీ నేత హడావుడి

నెల్లూరుకు చెందిన ఓ వైసీపీ కీలక నేత విశాఖలోని చినగదిలి మండలంలో రామానాయుడి స్టూడియో పక్కనే ఐదు ఎకరాల విలువైన భూమిపై కన్నేశారు. అది ఒక మాజీ

మిగతా 11వ పేజీలో...



ఇనుప వంతెన కూలి నలుగురి మృతి

30 మందికి గాయాలు.. పుణెలో ఘటన

- మృతులకు రూ.5 లక్షల చొప్పున పరిహారం
- పాత వంతెన పైకి ఎక్కువ మంది చేరుకోవడంతోనే ప్రమాదం

2

రెండు దశల్లో జమిలి!

2029లో 16 రాష్ట్రాలతో కలిపి లోక్‌సభ ఎన్నికలు

2034 నాటికి మిగతా రాష్ట్రాలకూ

తెలంగాణకు మొదటి విడతలో..!


- 'ఒకే దేశం-ఒకటే ఎన్నిక'పై రాష్ట్రాల్లో జేపీసీ పర్యటన
- రాజకీయ పార్టీలతోపాటు ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంకుల అభిప్రాయాలనూ స్వీకరిస్తున్న కమిటీ
- సుప్రీంకోర్టు మాజీ సీజేఐల అభిప్రాయాలూ సేకరణ



(హైదరాబాద్-ఆంధ్రజ్యోతి)

'ఒకే దేశం-ఒకటే ఎన్నిక' విధానాన్ని దేశవ్యాప్తంగా ఒకే దశలో కాకుండా.. రెండు దశల్లో కొలిక్కి తేవాలని కేంద్రం భావిస్తోంది. దాదాపు సగం రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను 2029 పార్లమెంటు ఎన్నికలతోపాటు నిర్వహించాలని.. అనంతరం మరో ఐదేళ్లకు 2034లో జరిగే పార్లమెంటు ఎన్నికల నాటికి మిగతా సగం రాష్ట్రాలకు కూడా కలిపి నిర్వహించాలని యోచిస్తోంది. జమిలి ఎన్నికల వ్యవహారం ఒకేసారి తేలేది కాదని అంచనాకు వచ్చింది. పార్లమెంటు ఎన్నికలు గత ఏడాదే జరుగగా.. వాటితోపాటు కేవలం నాలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీలకు మాత్రమే జరిగాయి. మిగిలిన రాష్ట్రాలన్నింటిలోనూ ఎన్నికలు కొంత ముందు, లేదంటే కొంత తర్వాత జరిగాయి. కొన్ని రాష్ట్రాల్లోనైతే ఏకంగా మూడేళ్ల ముందు కూడా జరిగాయి. బిహార్, అసోం,

మిగతా 3వ పేజీలో...



2

మన ముంగిట్లోనే విదేశీ విద్య

- దేశంలో క్యాంపస్‌ల ఏర్పాటుకు యూజీసీ గ్రీన్ సిగ్నల్
- 5 విదేశీ సంస్థలకు లెటర్ ఆఫ్ ఇంటెంట్ జారీ
- వచ్చే ఏడాది డిసెంబరు నుంచి అడ్మిషన్లు!

పెళ్లయిన ఆమెకు మళ్లీ పెళ్లి!

పెళ్లికుమారుడికి బ్రోకర్ల టోకరా

రూ.3.50 లక్షలు లాగేశారు

- ఒక కొడుకు ఉన్న ఆమెకు డబ్బాశ చూపి మూడు ముళ్లు వేయించిన వైనం
- బెజవాడలో ముగ్గురి అరెస్టు.. ఒకరు పరార్

3

ఖతర్ పోలీసుల అదుపులో తెలుగు పాస్టర్లు

3

దోహాలో అనుమతి లేకుండా క్రైస్తవ మత ప్రచారం

ఇవేం కోతలు బాబోయ్!



- రాష్ట్రంలో విచిత్ర వాతావరణం
- తీవ్రమైన ఉక్కపోత.. జనం ఉక్కిరిబిక్కిరి
- అదే సమయంలో కరెంట్ కోతలు
- పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి
- కోతలు కావు.. అంతరాయమేనంటున్న డిస్కమ్‌లు

అమరావతి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విచిత్రమైన వాతావరణం ఓవైపు.. కరెంటు కోతలు మరోవైపు.. వెరసి జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వాతావరణ పరిస్థితులు గమనిస్తే.. ఆకాశంలో మబ్బులుంటాయి.. వాతావరణం చల్లగా ఉంటుందేమోనని ఆశిస్తే.. భరించలేనంత ఉక్కబోత ఉంటోంది. ఒళ్లంతా చెమటలు పడుతున్నాయి. సరిగ్గా ఇలాంటి వాతావరణంలోనే కరెంటు పోతోంది. ఎక్కడో లైన్ ప్రోబ్లమ్ ఏమో అనుకుంటే, రాత్రి సమయంలోనూ ఇదే పరిస్థితి. అర్ధరాత్రి వేళ సరిగ్గా కునుకుపడుతున్న సమయంలోనూ కరెంటు పోతోంది. దీంతో జనంలో అసహనం పెరుగుతోంది. ఏదైనా సాంకేతిక లోపమేమో, విద్యుత్తు డిమాండ్ పెరిగిపోవడమోనని ఆరా తీస్తే.. అందుకు భిన్నంగా, రోజుకు 242 మిలియన్ యూనిట్ల డిమాండ్ కాస్తా క్రమంగా పడిపోతోందని డిస్కమ్‌లు చెబుతున్నాయి. విద్యుత్తు ఉత్పత్తి, డిమాండ్, కొనుగోలు వివరాలు తెలుసుకుందామంటే ఆంధ్రప్రదేశ్ పవర్ కోఆర్డినేషన్ కమిటీ (ఏపీపీసీసీ) అందుబాటులోకి రావడంలేదు. విద్యుత్తు గ్రిడ్ సరఫరా పరిస్థితిపై ఆరా తీస్తే లోడ్ రిలీఫ్ ఎక్కడా ఎక్కువగా లేదని, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ముమ్మడివరం, కొత్తపేటల్లో ట్రాన్స్‌మిషన్ టవర్లను మార్పుచేయాల్సి వస్తున్న సమయంలోనే విద్యుత్తు అంతరాయం ఉంటుందే తప్ప.. ప్రత్యేకంగా కరెంటు కోతలు లేవని డిస్కమ్‌లు చెబుతున్నాయి.

విద్యుత్తు డిమాండ్.. కొనుగోళ్లు

రాష్ట్రంలో విద్యుత్తు డిమాండ్ ఆదివారంనాడు 215.549 మిలియన్ యూనిట్లుగా ఉందని ఇంధన సంస్థలు చెబుతున్నాయి. ఇందులో ఏపీ జెన్కో థర్మల్ యూనిట్ల నుంచి 88.185 మిలియన్ యూనిట్లు, ఏపీజెన్కో హైడల్ నుంచి 4.565 మిలియన్ యూనిట్లు, ఏపీజెన్కో సోలార్ నుంచి 1.510, సెంట్రల్ జనరేషన్

మిగతా 12వ పేజీలో...



పంచాయతీ నిధులు హాంఫట్

100కు పైగా సంపన్న మేజర్ పంచాయతీల్లో ఐదేళ్లుగా దోపిడీ

- వైసీపీకి చెందిన సర్పంచ్‌లు ఉన్న పలు పంచాయతీలు, వైసీపీ నేతల గుప్పిట్లో ఉన్న మరికొన్ని రిజర్వుడ్ పంచాయతీల్లో ఐదేళ్లపాటు యథేచ్ఛగా నిధులను స్వాహా చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పన్నులు, సొంత వనరుల ద్వారా రూ.కోటికి పైగా ఆదాయం వచ్చే 100కు పైగా మేజర్ పంచాయతీల్లో భారీ స్కామ్‌కు తెరదీశారు. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు అంతా కలిసి రూ.వందల కోట్ల నిధులు మాయం చేసినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని చోట్ల అక్రమాలు జరిగినట్టుగా ఆడిట్‌లో వెల్లడైంది.
- మేజర్ పంచాయతీల్లో పారిశుధ్యం పనులను అడ్డం పెట్టుకుని భారీగా నిధులు దండుకున్నారు. నిర్మాణ పనుల్లో ఏఈఈలను వాడుకుని ఎంబుక్‌ల్లో రికార్డు చేయకుండానే స్వాహా చేశారని చెప్తున్నారు. మీటింగ్‌లు పెట్టకుండానే అజెండాలో లేని పనులు చేసినట్లు రికార్డులు సృష్టించి మరీ దోచుకున్నారు.

కోట్లలో అక్రమాలు

కొన్నిచోట్ల చేపట్టిన ఆడిట్‌లో వెల్లడి

వైసీపీ సర్పంచ్‌లు, కార్యదర్శులు, అధికారులు.. అంతా కలసి దోపిడీ

నిజాయితీ ఆడిట్ అధికారులను బదిలీ చేయిస్తున్న వైనం

పట్టణ ప్రాంతాల సమీపంలో కార్యదర్శుల పోస్టులకు గిరాకీ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ హయాం అంతా కేంద్రం ఇచ్చిన ఆర్థిక సంఘం నిధులు రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిందని ఆరోపిస్తూ సర్పంచ్‌లు నిరసనలకు దిగగా.. మరోవైపు ఆదాయార్జన గల గ్రామ పంచాయతీల్లో నిధులు ఏమయ్యాయో తెలియని పరిస్థితి. రాష్ట్రవ్యాప్తంగా పలు గ్రామ పంచాయతీల్లో విచిత్ర పరిస్థితులు నెలకొన్నాయి. పట్టణ ప్రాంతాలకు సమీపంలో ఉన్న మేజర్ పంచాయతీలు, మున్సిపాలిటీల్లోకి విలీనం చేయడంతో కోర్టుల ఆదేశాలతో దశాబ్దాలుగా కార్యదర్శుల ఏలుబడిలో పాలకవర్గాలు లేకుండా ఉన్న పంచాయతీలు, సహజ వనరులున్న, నగరాల పక్కన రియల్ ఎస్టేట్ వ్యాపారాలు బాగా జరుగుతున్న పంచాయతీల్లో నిధులు మాయమైనట్టు ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 100కు పైగా మేజర్ పంచాయతీల్లో అక్రమాలు జరిగినట్టు తెలుస్తోంది. వైసీపీ హయాంలో అవినీతిని ప్రశ్నించేందుకు సాహసించని టీడీపీ కార్యకర్తలు కూటమి సర్కార్ వచ్చిన తర్వాత ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, అధికారులపై ఫిర్యాదులు చేశారు. డీపీఓలు, డీఎల్‌పీఓలు మేజర్ పంచాయతీల్లో జరిగిన స్కామ్‌లపై విచారణ జరిపి పంచాయతీరాజ్ కమిషనరేట్‌కు నివేదిక అందించారు. అయితే

మిగతా 11వ పేజీలో...

దటీజ్ మొస్సాద్!

ఇరాన్‌లోనే డ్రోన్ల పరిశ్రమ

డబుల్ ఏజెంట్లతో అనుమతులు

(సెంట్రల్ డెస్క్)



రక్షణ శిబిరాల్లో ఇజ్రాయెల్ పౌరులు

ఇరాన్‌పై శుక్రవారం ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఉపయోగించిన డ్రోన్లు ఎక్కడివి? రష్యాలోకి ఉక్రెయిన్ ట్రక్కుల ద్వారా పంపినట్లుగా ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్ ఆపరేషన్‌ను నిర్వహించిందా? రోడ్డు మార్గంలో తరలిస్తే.. ఏ దేశం నుంచి పంపింది? ప్రపంచవ్యాప్తంగా ఈ అంశాలపై చర్చలు జోరందుకున్నాయి. అయితే, ఈ వ్యూహం ఇప్పటిది కాదు! ఐదేళ్ల క్రితమే మొస్సాద్ ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో పాగా వేసింది..! అక్కడే డ్రోన్ల తయారీ పరిశ్రమను ఏర్పాటు చేసింది. మొస్సాద్ నిర్వహించిన 'ఆపరేషన్ డ్రోన్స్'పై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

డబుల్ ఏజెంట్ల సాయంతో..

మొస్సాద్ అధికారులు ఇరాన్ వ్యూహాలను తెలుసుకునేందుకు పలువురు ఇరానీయులను ఏజెంట్లుగా నియమించుకుంది. వీరినే డబుల్ ఏజెంట్లు అంటారు. వేర్వేరు ప్రాంతాల్లో కుటీర పరిశ్రమల ఏర్పాటుకు ఇరాన్ ప్రభుత్వం నుంచి ఐదేళ్ల క్రితం ఈ ఏజెంట్ల ద్వారా అనుమతులు తీసుకుంది. అంతేకాదు.. విడిభాగాలను ఒకేచోట కాకుండా.. ఆయా పరిశ్రమల్లో తయారు చేసేలా ఏర్పాట్లు చేసింది. టెహ్రాన్‌లోని ఇస్లామ్ షహర్ అనే పారిశ్రామిక వాడలో మరో కర్మాగారాన్ని స్థాపించి, అక్కడ అసెంబ్లింగ్ చేసింది. గత ఏడాది లెబనాన్‌లో హిజ్బుల్లా నేతలే లక్ష్యంగా మొస్సాద్ భారీ ఎత్తున పేజర్ బాంబులు, వాకీటాకీ బాంబులను పేల్చిన విషయం తెలిసిందే..! అప్పటికే టెహ్రాన్‌లో మొస్సాద్ ఏజెంట్లు తమ లక్ష్యాన్ని పూర్తిచేశారు. డ్రోన్లను అసెంబ్లింగ్ చేసి.. అంతర్గతంగా పరీక్షలు నిర్వహించారు. సూసైడ్ డ్రోన్లు సవ్యంగా పనిచేసేలా.. ప్రోగ్రామింగ్ చేశారు. పేలుడు పదార్థాలను కూడా సాధారణ ట్రక్కుల్లో ముడిపదార్థాల మాటున ఇస్లాం షహర్‌కు తెప్పించారు. అన్నీ సిద్ధమయ్యాక.. ఇజ్రాయెల్ ప్రభుత్వ ఆదేశాల కోసం ఇంతకాలం ఎదురుచూశారు. ఇజ్రాయెల్ సర్కారు నుంచి ఆదేశాలు వచ్చిందే తడవుగా.. ఇరాన్ అణు స్థావరాలకు సమీపంలో సూసైడ్ డ్రోన్లను తీసుకెళ్లి తమ పనిని పూర్తిచేశారు. అయితే, ఇజ్రాయెల్ దాడులు జరిపాక ఇరాన్ మేల్కొంది. ఇస్లామ్ షహర్‌లోని కర్మాగారంలో డ్రోన్లను అసెంబుల్ చేసినట్లు ఆదివారం ఉదయం గుర్తించినట్లు ఇరాన్ వార్తాసంస్థ 'ఇరాన్ ఖబర్' వెల్లడించింది.



ఇరాన్ ఫైటర్ జెట్‌ను పేల్చేసిన ఇజ్రాయెల్

యుద్ధ బీభత్సం



ఇరాన్ క్షిపణి దాడులతో శిథిలాలుగా మారిన ఇజ్రాయెల్‌లోని బ్యాట్‌యామ్ నగర భవనాలు

(మొదటి పేజీ తరువాయి)

పిలుపునిచ్చారు. ఇలా ఇరాన్-ఇజ్రాయెల్‌కు వేర్వేరు దేశాల మద్దతు పెరుగుతుండడంతో.. ఉద్రిక్తతలు మరింత విస్తరించే ప్రమాదాలున్నాయి.

మూడో రోజూ ఇరాన్‌కు నష్టాలు

మొదటి రోజు ఇరాన్ క్షిపణి కేంద్రాలు, అణు స్థావరాలు, మిలటరీ అధికారులనే లక్ష్యంగా చేసుకుని క్షిపణి, డ్రోన్ దాడులు చేయగా.. శనివారం నుంచి ఆర్థిక మూలాలపై విరుచుకుపడుతోంది. బుషెహర్‌లోని అతిపెద్ద న్యాచురల్ గ్యాస్ క్షేత్రం(సౌత్ పార్స్), చమురు శుద్ధి కేంద్రంపై శనివారం రాత్రి దాడులు జరపగా.. ఆదివారం కూడా అక్కడ మంటలు ఎగిసిపడుతున్నాయి. టెహ్రాన్ సమీపంలోని మరో ఇంధన కేంద్రంపై ఆదివారం ఉదయం దాడి జరిగింది. ఈ చమురు క్షేత్రాలు సైన్యం కోసం పనిచేస్తుండడం వల్లే.. తాము వాటిని టార్గెట్‌గా చేసుకున్నామని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రకటించారు. టెహ్రాన్ సమీపంలోని షిరాజ్‌లో ఉన్న అతిపెద్ద ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల పారిశ్రామిక ప్రాంతంపైనా ఇజ్రాయెల్ బాలిస్టిక్ క్షిపణులతో విరుచుకుపడింది. ఇక్కడ ఇరాన్ సైన్యం భారీగా ఆయుధాలను నిల్వచేసినట్లు ఇజ్రాయెల్ చెబుతోంది. ఇరాన్‌లోని మషాద్(ఇజ్రాయెల్ నుంచి 2,300 కిలోమీటర్ల దూరం)లో ఉన్న వైమానిక స్థావరంలో నిలిపి ఉన్న ఫైటర్ జెట్ల రీఫ్యూయలింగ్ విమానాన్ని ఆదివారం సాయంత్రం బాలిస్టిక్ క్షిపణితో కూల్చివేసినట్లు వివరించింది. టెహ్రాన్‌లోని రక్షణశాఖ కార్యాలయాన్ని కూడా ధ్వంసం చేసినట్లు తెలిపింది. ఈ దాడుల్లో ఐఆర్‌జీసీ ఇంటెలిజెన్స్ డైరెక్టరేట్ చీఫ్ మహమ్మద్ కజేమీ, డిప్యూటీ చీఫ్ హసన్ మొహఖ్ చనిపోయినట్లు ఇజ్రాయెల్ ప్రధానిని ఉటంకిస్తూ ఫాక్స్‌న్యూస్ ఓ కథనాన్ని ప్రసారం చేసింది. "ఇక ఇప్పట్లో ఇరాన్ అణుశుద్ధి కార్యక్రమాలు జరపలేదు. ఆ విధంగా అక్కడి అణుస్థావరాలను నాశనం చేశాం. ఖమేనీతో సహా.. మా టార్గెట్ పరిధిలో ఉన్నారు" అని ఐడీఎఫ్‌కు చెందిన ఓ సీనియర్ అధికారిని ఉటంకిస్తూ 'వాల్ స్ట్రీట్ జర్నల్' ఓ కథనాన్ని ప్రచురించింది. శనివారం సాయంత్రం నుంచి ఇజ్రాయెల్ దాడులు ముమ్మరమయ్యాయి. గడిచిన మూడు రోజుల్లో ఇరాన్ వ్యాప్తంగా 406 మరణాలు నమోదవ్వగా.. 654 మంది క్షతగాత్రులైనట్లు మానవహక్కుల సంస్థలు ప్రకటించాయి. ఆదివారం ఒక్కరోజే 128 మంది మృతిచెందినట్లు తెలిపాయి.

పేలిన కారు బాంబులు

ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్ లెబనాన్‌లో హిజ్బుల్లా నేతలనే లక్ష్యంగా చేసుకుని పేజర్, వాకీటాకీ బాంబులను పేల్చిన విషయం తెలిసిందే..! శనివారం సాయంత్రం ఇరాన్‌లోనూ అలాంటి దాడులే చేసింది. ఏకకాలంలో పలు కారు బాంబులను పేల్చి, ఆరుగురు అణు శాస్త్రవేత్తలను మట్టుబెట్టినట్లు ఇజ్రాయెల్ మీడియా.. ఐదు కారుబాంబులు నమోదైనట్లు ఇరాన్ వార్తాసంస్థలు పేర్కొన్నాయి. తాజా మరణాలతో.. మొత్తం 14 మంది అణు శాస్త్రవేత్తలు కన్నుమూసిన విషయాన్ని రాయిటర్స్, అరబ్ మీడియా నిర్ధారించాయి. తాజా దాడుల్లో అణుశాస్త్రవేత్త అలీ బకావీ, ఆయన కుటుంబం కూడా మృతి చెంది ఉంటారని ఇరాన్ అధికారిక వార్తాసంస్థ ఐఆర్ఎన్ఏ తెలిపింది.

ఇజ్రాయెల్‌లో 10 మంది మృతి

ఇరాన్ తొలిసారి తన అమ్ముల పొదిలోని భీకర అస్త్రాన్ని ఇజ్రాయెల్‌పై ప్రయోగించింది. 'హజ్ ఖాసీం' బాలిస్టిక్ మిసైల్ కారణంగా టెల్‌అవీవ్ శివార్లలోని పలు పట్టణాలు రూపురేఖలను కోల్పోయాయి. హజ్ ఖాసీంను గగనతల రక్షణ వ్యవస్థలు గుర్తించలేవని ఇరాన్ విదేశాంగ శాఖ అధికారి అబ్బాస్ అరాగ్చి వెల్లడించారు. ఈ క్షిపణి దాడులతో టెల్‌అవీవ్ శివార్లలోని బ్యాట్‌యామ్, గుష్‌డాన్, షెఫెలా, తామ్రా పట్టణాల్లో భారీ ఆస్తినష్టం సంభవించగా.. ఆదివారం ఒక్కరోజే నలుగురు చిన్నారులు సహా.. 10 మంది మృతిచెందారు. ఇజ్రాయెల్ తమ న్యూక్లియర్ సైంటిస్టులను మట్టుబెట్టిన నేపథ్యంలో ఇరాన్ ప్రతీకార దాడికి దిగింది. ఇజ్రాయెల్‌లోని అతిపెద్ద సైంటిఫిక్ కమ్యూనిటీ (శాస్త్రవేత్తలు, పరిశోధనలకు ఆవాసం) అయిన వైజ్‌బన్ ఇన్‌స్టిట్యూట్‌పై డ్రోన్ దాడులు జరిగాయి. అప్పటికే శాస్త్రవేత్తలు, వారి కుటుంబాలు బంకర్లలో ఉండడం వల్ల ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని స్థానిక అధికారులు తెలిపారు. "ఇరాన్ వద్ద ఇలాంటి(హజ్‌ఖాసీం) క్షిపణులు వేలల్లో ఉంటే.. ఈ రోజు ఏం జరిగేదో ఆలోచించండి. అది ఇజ్రాయెల్ అస్తిత్వానికే ముప్పు అందుకే ఇరాన్ క్షిపణి కేంద్రాలను టార్గెట్‌గా చేసుకున్నాం" అని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు బాట్‌యామ్‌లో కూలిన భవనాలను పరిశీలిస్తున్న సందర్భంగా వ్యాఖ్యానించారు. కాగా.. ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థలను దాదాపుగా ధ్వంసం చేశామని, ఇప్పుడు ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు ఆ దేశ గగనతలంలోకి ప్రవేశించగలవని ఐడీఎఫ్ వాయుసేన ప్రకటించింది.

ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరికలు

ఇరాక్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు చేయడంతో ట్రంప్ సీరియస్ అయ్యారు. మరోమారు అమెరికా సైన్యం స్థావరాలపై దాడులు జరిగితే.. ఇరాన్ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని, టెహ్రాన్ రూపురేఖలను కోల్పోతుందని ఆయన హెచ్చరించారు. భారత్-పాకిస్థాన్ మాదిరిగా.. ఇజ్రాయెల్-ఇరాన్ కూడా శాంతి చర్చలు జరిపి, యుద్ధాన్ని విరమించుకోవాలని సూచించారు.కాగా, అమెరికా, ఇరాన్ మధ్య ఆదివారం జరగాల్సిన అణు చర్చలు రద్దయ్యాయి. ఇజ్రాయెల్ భీకర దాడుల నేపథ్యంలో.. ఆ దేశానికి అమెరికా సహకరిస్తోందని ఇరాన్ ఆరోపిస్తూ.. "ఈ పరిస్థితుల్లో చర్చలకు అర్థం లేదు" అంటూ ఓ ప్రకటన చేసింది. మరోవైపు, ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీని అంతమొందించేందుకు ఇజ్రాయెల్ ప్రణాళిక రూపొందించిందని, తాను ఆ చర్యను అడ్డుకున్నానని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు రాయిటర్స్ ఓ కథనాన్ని ప్రచురించింది. అయితే దీన్ని నెతన్యాహు ఖండించారు.

దాడులను ఆపితే.. మేమూ ఆపుతాం: ఇరాన్

ఇజ్రాయెల్ ముప్పేట దాడులతో ఇరాన్ వెనక్కి తగ్గింది. "ఇజ్రాయెల్ మాపై దాడులను ఆపితే.. మేము కూడా ప్రతీకార దాడులను నిలిపివేస్తాం" అని ఇరాన్ విదేశాంగ శాఖ అధికారి అబ్బాస్ అరాగ్చి వ్యాఖ్యానించారు. ఈ ప్రకటన వచ్చాక కూడా ఇజ్రాయెల్ నుంచి స్పందన లేకపోవడంతో.. ఇరాన్ తన 'ఆపరేషన్ సాధిక్ ప్రామిస్-3'ని ఆదివారం రాత్రి ప్రారంభించింది. ఇజ్రాయెల్‌పైకి బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగిస్తున్న దృశ్యాలను మీడియాకు విడుదల చేసింది. అదే సమయంలో.. అంతర్జాతీయ అణుశక్తి సంస్థ(ఐఏఈఏ)తో ఇకపై ఎలాంటి సమాచారాన్ని పంచుకోబోమని ప్రకటించింది.

లోకం తీరు



సైప్రస్ చేరిన ప్రధాని మోదీ



నికోసియా, న్యూఢిల్లీ జూన్ 15: ప్రధాని మోదీ రెండు రోజుల పర్యటన నిమిత్తం ఆదివారం సైప్రస్ చేరుకున్నారు. సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలీడెస్ స్వయంగా లర్నాకా అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చి మోదీకి స్వాగతం పలకడం విశేషం. రెండు దశాబ్దాల అనంతరం భారత ప్రధాని సైప్రస్ సందర్శనకు రావడం ఇదే ప్రథమం. రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, ఇతర రంగాల్లో సంబంధాలు పుంజుకుంటాయని మోదీ ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. ప్రధాని మోదీది చరిత్రాత్మక పర్యటన అంటూ సైప్రస్ అధ్యక్షుడు నికోస్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఈ పర్యటనతో రెండు దేశాల మధ్య కొత్త అధ్యాయం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. సైప్రస్ నుంచి ప్రధాని మోదీ కెనడాలోని కననాస్కిస్‌కు వెళ్లనున్నారు. అక్కడ జీ-7 శిఖరాగ్ర సదస్సులో పాల్గొననున్నారు. అనంతరం క్రొయేషియా దేశంలో పర్యటించనున్నారు.

ఆసుపత్రిలో చేరిన సోనియా

న్యూఢిల్లీ, జూన్ 15: కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్ పర్సన్ సోనియా గాంధీ ఆసుపత్రిలో చేరారు. ఉదర సంబంధిత సమస్యలతో ఆమె ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆసుపత్రి గ్యాస్ట్రో విభాగంలో చేరారు. ప్రస్తుతానికి ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని, వైద్యబృందం పర్యవేక్షణ కొనసాగుతోందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఈ నెల 9న కూడా సోనియా ఇదే ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అంతకు రెండు రోజుల ముందు ఈ నెల 7న అధిక రక్తపోటు కారణంగా సిమ్లాలోని ఇందిరాగాంధీ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో చేరి వైద్యపరీక్షలు చేయించుకున్నారు.

యుద్ధం ఇలాగే కొనసాగితే..

150 డాలర్లకు చమురు!



టెహ్రాన్‌లోని చమురు నిల్వ కేంద్రంపై ఇజ్రాయెల్ దాడి

ఇరాన్‌లోని అణు, సైనిక స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులతోనే 5 నెలల గరిష్ఠ స్థాయికి ధరలు

న్యూఢిల్లీ, జూన్ 15: ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధంతో ముడి చమురు ధర మళ్లీ సెగలు కక్కుతోంది. శనివారం ఒక్కరోజే బ్రెంట్ రకం పీపా(బ్యారెల్) చమురు ధర 13% పెరిగి 78 డాలర్లకు చేరింది. చమురు ధర గత ఐదు నెలల్లో ఈ స్థాయికి చేరడం ఇదే మొదటిసారి. ప్రస్తుతం 75 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఇజ్రాయెల్ తమపై దాడులు చేస్తున్న నేపథ్యంలో.. పర్షియన్ గల్ఫ్ నుంచి ప్రపంచదేశాలకు చమురు సరఫరాలో కీలకమైన హోర్ముజ్ జలసంధిని మూసేయాలన్న ప్రతిపాదనను ఇరాన్ పరిశీలిస్తోంది. అది జరిగినా.. లేక ఈ ప్రాంతంలో అమెరికాకు మిత్రుడైన సౌదీ అరేబియా చమురు క్షేత్రాలపై ఇరాన్ దాడులకు దిగినా పీపా చమురు ధర 120 నుంచి 150 డాలర్లకు చేరే ప్రమాదం ఉందని రాబో బ్యాంకు ఇంటర్నేషనల్ గ్లోబల్ స్ట్రాటజిస్ట్ మైఖేల్ ఇవిరీ ఇప్పటికే హెచ్చరించారు. ప్రస్తుత ధరతో పోలిస్తే ఇది 103 శాతం ఎక్కువ. యూఎస్ ఎనర్జీ ఇన్ఫర్మేషన్ అడ్మినిస్ట్రేషన్ గణాంకాల ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా రోజుకు సగటున 103 మిలియన్ బ్యారెళ్ల చమురు ఉత్పత్తి అవుతోంది. అందులో ఇరాన్ వాటా (రోజుకు) 32 లక్షల బ్యారెళ్లు. అందులో 15 నుంచి 20 లక్షల బ్యారెళ్లను ప్రపంచంలోని వివిధ దేశాలకు ఎగుమతి చేస్తుంది. అలాగే.. అమెరికా, రష్యా తర్వాత ప్రపంచంలోనే మూడో అతిపెద్ద సహజవాయు ఉత్పత్తిదారు ఇరాన్. రోజుకు సగటున 275 బిలియన్ క్యూబిక్ మీటర్ల సహజవాయువును ఆ దేశం ఉత్పత్తి చేస్తుంది. అంతర్జాతీయ ఉత్పత్తిలో అది దాదాపు 6.5 శాతం. ఇరాన్ ప్రధాన ఆదాయ వనరులు.. ఈ చమురు, సహజవాయు నిక్షేపాలే. అందుకే.. ఇజ్రాయెల్ తాజాగా చమురు, సహజవాయు క్షేత్రాలపై దృష్టి సారించింది. ఇరాన్‌లోని సౌత్ పార్స్ గ్యాస్ ఫీల్డ్‌పై డ్రోన్ దాడి చేసింది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద సహజవాయు రిజర్వు. ఈ దాడితో ఇరాన్ ఆ క్షేత్రంలో సహజవాయు ఉత్పత్తిని పాక్షికంగా నిలిపివేయాల్సి వచ్చింది. ఫలితంగా 12 మిలియన్ క్యూబిక్ మీటర్ల మేర గ్యాస్ ఉత్పత్తి ఆగిపోయింది. ముఖ్యంగా.. ఖార్గ్ ఐలండ్ వంటివాటిపై దాడులు జరిగితే మరింత ప్రభావం ఉంటుంది.

భారత్‌కు దెబ్బే..

ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం వీలైనంత త్వరగా ముగిస్తే సరే.. లేకపోతే మన దేశానికీ తిప్పలు తప్పవు. ఎందుకంటే మన ముడి చమురు అవసరాల్లో 90 శాతం, గ్యాస్ అవసరాల్లో 50 శాతానికి దిగుమతులే దిక్కు. మన చమురు దిగుమతుల్లో ఇరాక్, సౌదీ అరేబియా, కువైట్, యూఏఈల వాటా సగం వరకు ఉంటుంది. ఇరాన్ హోర్ముజ్ జలసంధిని మూసివేస్తే ఈ సరఫరాలకు తీవ్ర విఘాతం తప్పదు. అదే జరిగితే చమురు ధర భగ్గుమని మన ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడే ప్రమాదం ఉంది. పీపా చమురు ధర 2 డాలర్లు పెరిగినా చమురు కంపెనీలు అమ్మే ప్రతి లీటరు పెట్రోల్, డీజిల్‌పై రూ.2 తగ్గుతుందని అంచనా. ఈ నష్టాలు తట్టుకునేందుకు మళ్లీ పెట్రోల్, డీజిల్ ధరలు పెంచక తప్పదు.

తిరుపతి వెళ్లే విమానం ఇంజన్‌లో పొగలు

శంషాబాద్‌లో నాలుగు గంటల పాటు నిలిపివేత

» లోపాన్ని సరిదిద్దిన తర్వాత అర్ధరాత్రి 12గంటలకు టేకాఫ్

శంషాబాద్ రూరల్, జూన్ 15: దేశంలో విమాన, హెలికాప్టర్ ప్రమాదాలు కలవరపెడుతున్న వేళ మరో విమానానికి సాంకేతిక సమస్య తలెత్తింది. హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్లే స్పైస్‌జెట్ విమానం టేకాఫ్‌కు ముందు సాంకేతిక లోపం తలెత్తడంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్లే స్పైస్ జెట్ విమానం ఎస్‌జీ -2138 ఆదివారం రాత్రి 7-30గంటలకు శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి టేకాఫ్ కావాల్సి ఉండగా, విమానం స్టార్ట్ చేయగానే ఇంజన్ భాగం నుంచి పొగలు, కాలిన వాసన రావడాన్ని గమనించిన ఫ్లైట్ సిబ్బంది విమానాన్ని నిలిపివేశారు. దీంతో కొంత మంది తమ ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారు. 60మంది ప్రయాణికులు మరో విమాన సర్వీసు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అయితే, లోపాన్ని సరిదిద్దడంతో ఆదివారం నాలుగున్నర గంటలు ఆలస్యంగా అర్ధరాత్రి 12గంటల సమయంలో అదే విమానం టేకాఫ్ అయింది. మరోవైపు, జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి ఆదివారం హైదరాబాద్ బయలుదేరిన లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్ విమానం గమ్యం చేరకుండానే వెనుదిరిగింది. దీనికి కారణాలు తెలియరాలేదు. ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి బయలుదేరిన కాసేపటికే ఈ విమానం వెనుదిరిగినట్లు శంషాబాద్ విమానాశ్రయం ఏటీసీకి సమాచారం వచ్చింది. ఆదివారం మధ్యాహ్నం 2.15 గంటలకు ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి బయలుదేరిన ఈ విమానం సోమవారం ఉదయం 6 గంటలకు హైదరాబాద్ చేరుకోవాల్సి ఉందని ఫ్లైట్‌వేర్.కామ్ వెబ్‌సైట్ పేర్కొంది. ఇది బోయింగ్ 787-9 డ్రీమ్‌లైనర్ విమానమని ఆ వెబ్‌సైట్ తెలిపింది.

రాఫెల్ జెట్లు కూలలేదు.. పాక్ ప్రకటన అబద్ధం

» 'దసో' సీఈవో ప్రకటన

న్యూఢిల్లీ, జూన్ 15: భారత వైమానిక దళానికి చెందిన మూడు రాఫెల్ జెట్లను కూల్చివేశామన్న పాకిస్థాన్ ప్రకటనను దసో ఏవియేషన్ సంస్థ సీఈవో ఎరిక్ ట్రాపియెర్ ఖండించారు. నిర్దిష్ట ఆధారాలు లేకుండా పాక్ ఆ ప్రకటన చేసిందన్నారు. రాఫెల్స్ కూల్చివేత వాస్తవం కాదని స్పష్టం చేశారు. చాలామందిని వాస్తవం దిగ్భ్రాంతికి గురిచేస్తుందని ఎరిక్ వ్యాఖ్యానించారు. ఓ యూరోపియన్ పబ్లికేషన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఫ్రాన్స్‌కు చెందిన దసో సంస్థ రాఫెల్ జెట్లను తయారు చేస్తున్న సంగతి తెలిసిందే. "ఆపరేషన్ సిందూర్ సమయంలో రాఫెల్స్‌ను కోల్పోయినట్టు భారత్ ఇంతవరకు అధికారిక ప్రకటన చేయలేదు. దీంతో అసలు ఏం జరిగిందనేది స్పష్టత లేదు. పాక్ చెబుతున్నట్టు రాఫెల్స్‌ను కూల్చడం పూర్తిగా అవాస్తవం. అయినా, పూర్తి వివరాలు అందితేనే వాస్తవం ఏమిటనేది తెలుస్తుంది. నష్టాలు లేకుండా యుద్ధాలు ఉండవు" అని ఎరిక్ అభిప్రాయపడ్డారు.

విదేశీ వర్సిటీల క్యాంపస్‌లు ఇక ఇండియాలో


» 5 విద్యా సంస్థలకు యూజీసీ లెటర్ ఆఫ్ ఇంట్రెస్ట్ జారీ

న్యూఢిల్లీ, జూన్ 15: ఉన్నత విద్యాభ్యాసం కోసం అమెరికా, ఆస్ట్రేలియా, బ్రిటన్, కెనడా తదితర దేశాలకు వెళుతున్న భారతీయ విద్యార్థులు ఇక విదేశాలకు వెళ్లనక్కర్లేదు. త్వరలో ప్రసిద్ధ విదేశీ యూనివర్సిటీలు భారత్‌లో క్యాంపస్‌లు ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధమైంది. జాతీయ విద్యావిధానం-2020' అంతర్జాతీయకరణలో భాగంగా దేశంలో విదేశీ యూనివర్సిటీల ప్రవేశానికి కేంద్రం అనుమతినిచ్చింది. ఈ మేరకు సదరు విదేశీ యూనివర్సిటీలకు యూజీసీ ఆదివారం ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో అధికారికంగా లెటర్ ఆఫ్ ఇంటరెస్ట్ (ఎల్వోఐ) అందజేసింది. ఈ కార్యక్రమంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, మహారాష్ట్ర సీఎం ఫడణవీస్, యూజీసీ తాత్కాలిక ఛైర్మన్ వినీత్ జోషి పాల్గొన్నారు. ఎల్వోఐ అందుకున్న సంస్థల్లో వెస్ట్రన్ ఆస్ట్రేలియా యూనివర్సిటీ అనుబంధ యూనివర్సిటీ ఆఫ్ యార్క్, యునైటెడ్ కింగ్‌డమ్ (బ్రిటన్)లోని యూనివర్సిటీ ఆఫ్ అబెర్డీన్, ఇల్లినాయిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ - ఐఐటీ (అమెరికా), యూరోపియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ -ఎల్‌ఈడీ (ఇటలీ) ఉన్నాయి. సదరు సంస్థలు క్యాంపస్‌లు ఏర్పాటు చేసుకుని అడ్మిషన్లు ప్రారంభించడానికి 18 నెలల సమయం పడుతుంది.

నదిపై కూలిన ఇనుప వంతెన

నలుగురి మృతి.. 30 మందికి గాయాలు

మహారాష్ట్రలోని పుణెలో ఘటన



పుణె, జూన్ 15: మహారాష్ట్రలోని పుణె సమీపంలో ఇంద్రాయణి నదిపై ఇనుప వంతెన కూలిపోయింది. కుందమాల గ్రామంలో నదిపై నడక దారి కోసం ఏర్పాటు చేసిన ఈ ఇనుప వంతెన ఆదివారం ఒక్కసారిగా కుప్పకూలింది. ఎక్కువ మంది వంతెనపై నిలబడి ఉండగా కూలిపోయిందని అధికారులు తెలిపారు. ఈ ఘటనలో నలుగురు మృతి చెందారని, 30 మంది గాయపడ్డారని పోలీసులు చెప్పారు. 38 మందిని కాపాడామని, కొందరు నదీ ప్రవాహంలో కొట్టుకుపోయారని తెలిపారు. సాయంత్రం 4 గంటల సమయంలో 100 మంది వరకు పర్యాటకులు బ్రిడ్జిపై ఒకే చోట నిల్చొని ఉన్నారన్నారు. కాగా, ఈ పాత ఇనుప వంతెనను కేవలం పాదచారుల కోసమే నిర్మించారని మహారాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ మంత్రి గిరీశ్ మహాజన్ తెలిపారు. ద్విచక్ర వాహనదారులు ఈ వంతెనపై రాకపోకలు సాగించరాదని హెచ్చరిక బోర్డులు కూడా ఉన్నాయన్నారు. ఇలాంటి హెచ్చరికలను ఎవరూ పట్టించుకోవడం లేదని చెప్పారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందించనున్నట్లు తెలిపారు.

ఏవీఎస్ రాజు జీవితం యువతకు స్ఫూర్తి: వెంకయ్య

హైదరాబాద్ సిటీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఎన్‌సీసీ) వ్యవస్థాపకులు అల్లూరి వెంకట సత్యనారాయణ రాజు (ఏవీఎస్ రాజు) జీవితం యువతరానికి స్ఫూర్తిపాఠం అని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. నిర్మాణ రంగంలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పిన ఏవీఎస్ రాజు ఆదర్శనీయుడని కొనియాడారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత, ఎన్‌సీసీ అధినేత ఏవీఎస్ రాజు జీవిత చరిత్రపై వి.పట్టాభిరాం రాసిన 'స్టాండింగ్ టాల్' ఆంగ్ల పుస్తకాన్ని హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో మాజీ కేంద్రమంత్రి అశోక్ గజపతిరాజు ఆవిష్కరించారు. స్టాండింగ్ టాల్‌కు తెలుగు అనువాదం డి.చంద్రశేఖర్ రెడ్డి రాసిన 'శిఖరాయమానుడు' పుస్తకాన్ని వెంకయ్య నాయుడు ఆవిష్కరించి తొలిప్రతిని శాంతా బయోటెక్ వ్యవస్థాపకుడు వరప్రసాద్ రెడ్డికి అందించారు. మాజీ మంత్రి అశోక్ గజపతి రాజు, శాంతా బయోటెక్ వరప్రసాద్ రెడ్డి మాట్లాడారు. ఏవీఎస్ రాజుతో తనకున్న అనుబంధాన్ని వివరిస్తూ ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ పంపిన సందేశాన్ని తెలంగాణ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రచారక్ లింగం శ్రీధర్ చదివి వినిపించారు.

కేదార్‌నాథ్‌లో కూలిన హెలికాప్టర్

» రెండేళ్ల చిన్నారి సహా ఏడుగురి దుర్మరణం

» గాల్లోకి ఎగిరిన కాసేపటికే కూలిన వైనం

రుద్రప్రయాగ్(ఉత్తరాఖండ్), జూన్ 15: ఎయిరిండియా విమాన ప్రమాదం ఘటన నుంచి ఇంకా తేరుకోకముందే మరో ఘోర ప్రమాదం జరిగింది. చార్‌ధామ్ యాత్రికులు ప్రయాణిస్తున్న ఓ ప్రైవేటు హెలికాప్టర్ ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున కూలిపోయింది. ఈ ప్రమాదంలో రెండేళ్ల చిన్నారి సహా ఏడుగురు దుర్మరణం చెందారు. మృతులు మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందినవారు. అధికారుల కథనం ప్రకారం.. ఆర్యన్ ఏవియేషన్ సంస్థకు చెందిన బెల్ 407 హెలికాప్టర్.. ఆరుగురు యాత్రికులు, పైలట్ సహా ఏడుగురితో ఆదివారం ఉదయం 5:10 గంటలకు గుప్తకాశి నుంచి బయలుదేరి 5:18 గంటలకు కేదార్‌నాథ్ చేరుకుంది. అక్కడి నుంచి 5:19 గంటలకు తిరుగు ప్రయాణమైన హెలికాప్టర్ 5:20 నిమిషాలప్పుడు గౌరీకుండ్ సమీపంలోని అడవిలో కూలిపోయింది. దీంతో హెలికాప్టర్‌లో ఉన్న పైలట్ రాజ్‌వీర్ సింగ్ చౌహాన్(39), బద్రీనాథ్, కేదార్‌నాథ్ ఆలయ కమిటీ సభ్యుడు విక్రమ్ సింగ్ రావత్, మహారాష్ట్రకు చెందిన రాజ్‌కుమార్ జైస్వాల్, శ్రద్ధ దంపతులు వారి కుమార్తె కాశీ(2), ఉత్తరప్రదేశ్‌కు చెందిన వినూద్ దేవి(66) తుష్టీ సింగ్(19) మంటల్లో కాలిపోయి అక్కడికక్కడే మరణించారు. రాజస్థాన్‌లోని జైపూర్‌కు చెందిన పైలట్ రాజ్‌వీర్ సింగ్ చౌహాన్ 15 ఏళ్లకు పైగా భారత ఆర్మీలో పని చేశారు. పర్వత ప్రాంతాల్లో హెలికాప్టర్ నడపడంలో ఆయనకు విశేష అనుభవం ఉంది. అయితే, కేదార్‌నాథ్ నుంచి తిరుగు ప్రయాణం అప్పుడు వాతావరణం ఒక్కసారిగా మారిపోయిందని, హెలికాప్టర్‌ను దారి మళ్లించేందుకు పైలట్ ప్రయత్నిస్తుండగానే ప్రమాదం జరిగిందని స్థానిక పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. ఈ ఏడాది చార్‌ధామ్ యాత్ర ఏప్రిల్ 30 నుంచి ప్రారంభమవ్వగా.. ఆ తర్వాత ఈ మార్గంలో జరిగిన ఐదో హెలికాప్టర్ ప్రమాదం ఇది. వరుస ప్రమాదాల నేపథ్యంలో ఉత్తరాఖండ్ ప్రభుత్వం చార్‌ధామ్ మార్గంలో సోమవారం వరకు హెలికాప్టర్ సేవలను నిలిపివేసింది. కాగా, మే 8న గంగోత్రిధామ్ వెళుతున్న ఓ హెలికాప్టర్ ఉత్తరకాశీ జిల్లాలో కూలిపోగా.. ప్రమాదంలో ఆరుగురు మరణించారు. మే 12న జరిగిన ఘటనలో సెర్సీ నుంచి బద్రీనాథ్‌కు యాత్రికులతో వస్తున్న ఓ హెలికాప్టర్‌ను ప్రతికూల వాతావరణం వల్ల ఓ పాఠశాల మైదానంలో పైలట్ అత్యవసరంగా ల్యాండ్ చేశారు. మే 17న జరిగిన ఘటనలో రిషికేశ్ ఎయిమ్స్ ఆస్పత్రి హెలికాప్టర్ అంబులెన్స్.. ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ హెలీప్యాడ్ సమీపంలో కూలిపోయింది. జూన్ 7న కేదార్‌నాథ్ వెళుతున్న ఓ హెలికాప్టర్‌ను సాంకేతిక సమస్యల వల్ల రహదారిపై అత్యవసరంగా ల్యాండ్ చేశారు.

ఎయిరిండియా విమానంలో సాంకేతిక లోపం

ఎయిరిండియాకు చెందిన మరో విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. ఆదివారం ఘజియాబాద్ నుంచి కోల్‌కతా వెళ్లాల్సిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ బోయింగ్ ఐఎక్స్ 1511 విమానంలో ఈ లోపం తలెత్తింది. దీంతో రన్‌వేపైనే గంటసేపు నిలిపివేయాల్సి వచ్చింది. లోపాన్ని సరిచేసి విమానం బయలుదేరేటప్పటికి ఏడు గంటలు ఆలస్యమైంది. విమానం బయలుదేరే ముందు సాంకేతిక సమస్య ఉన్నట్లు సిబ్బంది గుర్తించి అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఇంజనీరింగ్ సిబ్బంది వచ్చి సమస్యను పరిష్కరించేందుకు గంటల్లో సమయం పట్టింది. దీనిపై ఎయిరిండియా వివరణ ఇచ్చింది. టేకాఫ్‌కు కాసేపు ముందు సాంకేతిక సమస్యను గుర్తించామని, ఆలస్యం కారణంగా ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని తెలిపింది. వారి ప్రయాణాన్ని రీషెడ్యూల్ చేసేందుకైనా, టికెట్ సొమ్మును తిరిగి చెల్లించేందుకైనా సిద్ధంగా ఉన్నామని పేర్కొంది.

బాబోయ్ చిరుతలు..



బసవన్న కొండపై చిరుత

- కర్నూలు జిల్లాలో కలకలం
- బంధించే క్రమంలో యువకుడిపై దాడి చేసిన ఓ చిరుత



కోసిగిలోని బసవన్న కొండ సమీపంలో వంకలో పడుకున్న చిరుత పులి

కోసిగి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో ఆదివారం రెండు చిరుతలు కలకలం రేపాయి. కోసిగిలోని పులికనుమ ప్రాజెక్టు సమీపంలోని బసవన్న కొండ దగ్గరలోని ఎర్రవంకలో ఓ చిరుతపులి గాండ్రిస్తూ.. నడవలేని స్థితిలో ఉంది. అది విన్న రైతులు ముందు ఆ చిరుతను చూసి భయపడి గ్రామంలోకి పరుగులు తీశారు. అయితే ఎంత సేపటికీ చిరుత ఉన్న చోట నుంచి ముందుకు కదలకపోవడంతో ఎస్ఐ హనుమంతరెడ్డికి, అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ, డీఎఫ్‌వో శ్యామల, డీఎఫ్‌వో ఫ్లయింగ్ స్క్వాడ్ శ్రీనివాసులు, ఆదోని ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ తేజశ్విని, బీట్ ఆఫీసర్ అనూరాధతో పాటు సిబ్బంది అక్కడ చేరుకున్నారు. అటవీ సిబ్బందితో పాటు యువకులు చిరుతను బంధించే క్రమంలో ఓ యువకుడిపై చిరుత దాడి చేసింది. దీంతో ఆ యువకుడి గాయాలయ్యాయి. చివరకు ఆ చిరుతను బంధించి ఆదోనికి తరలించారు. శ్రీశైలం నుంచి వైద్యులు వచ్చిన తర్వాత పరిశీలిస్తారని, అనంతరం వారి సూచనల మేరకు తిరుపతి జూపార్క్‌లో గానీ, శ్రీశైలం నల్లమల అడవిలో గానీ వదులుతామని అటవీ అధికారులు చెప్పారు. అలాగే మరో చిరుత బసవన్న కొండపై చాలా సేపు అటూ ఇటు తిరిగి కొండలోకి వెళ్లిపోయింది. ఒకే రోజు రెండు చిరుత పులులు కనిపించడంతో ప్రజలు భయాందోళనలో ఉన్నారు.

ఖతర్ పోలీసుల అదుపులో తెలుగు పాస్టర్లు

దోహాలో అనుమతి లేకుండా క్రైస్తవ మతప్రచారం

- దేశం విడిచి వెళ్లడానికి ఇంకా అనుమతించని వైనం

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఖతర్‌లో నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేకుండా మత ప్రచారం నిర్వహిస్తున్నారనే అభియోగంపై పలువురు క్రైస్తవ మతప్రచారకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమచారం మేరకు.. దోహా నగరంలోని తుమమా అనే ప్రాంతంలో మత ప్రచారం చేస్తున్న మొత్తం 11 మందిలో ఐదుగురు తెలుగు పాస్టర్లు ఉన్నారు. అందులో ముగ్గురు సందర్శక వీసాలపై వచ్చి మతప్రచారం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. రెండు వారాలకు పైగా అదుపులో ఉంచి విచారించిన అనంతరం పోలీసులు వీరిని ఇటీవల విడుదల చేసినా, దేశం విడిచి వెళ్లడానికి మాత్రం ఇంకా అనుమతించలేదు. ఖతర్‌లో క్రైస్తవులు ప్రార్థనలు చేసుకోవడానికి బర్వా అనే ప్రాంతంలో ప్రత్యేకంగా సువిశాల కాంపౌండ్ ఉంది. అందులోని చర్చిలకు చట్టబద్ధత ఉంది. ఈ చర్చిల్లో ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొనడానికి భారత్ నుంచి వచ్చేవారికి ప్రత్యేకంగా సందర్శక వీసాలను కూడా ఖతర్ ప్రభుత్వం జారీ చేస్తుంటుంది. కానీ స్థానిక చట్టాలకు విరుద్ధంగా భారతీయులు కొందరు కొన్ని ప్రైవేటు నివాస స్థలాల్లో, విల్లాల్లో, ఎక్కడబడితే అక్కడ చర్చిలు నిర్వహించుకుంటుండగా, వారిలో తెలుగువారు ప్రముఖంగా ఉన్నారు. చట్టబద్ధమైన అనుమతి ఉన్న తెలుగు చర్చిల కంటే, ఇలా అనధికారికంగా ఏర్పాటు చేస్తున్న చర్చిలకు జనం తాకిడి ఎక్కువగా ఉండడంతో పోలీసుల దృష్టికి వెళ్లింది. ఖతర్, ఇతర గల్ఫ్ దేశాల్లో చట్టబద్ధంగా ప్రార్థన సేవలు ఉన్నా, అనుమతి లేకుండా అన్యమత ప్రచారం చేయడం మాత్రం తీవ్ర నేరంగా పరిగణిస్తారు. గతంలో సిక్కులు కూడా ఒక ప్రదేశంలో అనధికారికంగా గురుద్వారా నిర్వహిస్తుండగా నిర్వహకులను పోలీసులు అరెస్ట్ చేసి దాన్ని మూసివేశారు.

పెళ్లయిన ఆమెకు మళ్లీ పెళ్లి

- పెళ్లికుమారుడికి బ్రోకర్ల టోకరా
- విజయవాడలో ముగ్గురి అరెస్టు... ఒకరు పరార్

విజయవాడ, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఆమెను 'అద్దె'కు తెచ్చి ఆయనకు ముడేశారు. అప్పటికే పెళ్లయి ఐదేళ్ల కుమారుడు ఉన్న ఆమెకు డబ్బు ఆశ చూపించి మరో మూడు ముళ్లు వేయించారు. అయితే, 'నన్ను నా పుట్టింటికి పంపండి' అని ఆమె పదేపదే అడుగుతుండటంతో అనుమానం వచ్చి పెళ్లికుమారుడు నిలదీస్తే అసలు గుట్టు బయటపెట్టింది. దీంతో అవాక్కయిన అబ్బాయి కుటుంబం విజయవాడ పోలీసులకు ఫిర్యాదుచేశారు. ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. ఆ వివరాల్లోకి వెళితే.. ఆయన పేరు దుర్గాప్రసాద్. కర్ణాటకలోని రాయచూర్ జిల్లాకు చెందిన ఈయనకు పెళ్లి వయస్సు వచ్చింది. ఏ సంబంధం వచ్చినా కుదరట్లేదు. ఎంతోమంది అమ్మాయిలను చూశాడు. వాళ్లందరూ దుర్గాప్రసాద్‌కు నచ్చినా ఆయన మాత్రం వాళ్లకు నచ్చలేదు. పెళ్లి వయస్సు దాటిపోవడంతో తనకు సంబంధం చూడమని రాయచూర్‌కు చెందిన శ్రీదేవి అనే మహిళకు ఆయన చెప్పారు. ఆమె రాజమహేంద్రవరానికి చెందిన తాయారు అనే పెళ్లిళ్ల బ్రోకర్‌కు విషయం చెప్పింది. విజయవాడకు చెందిన ఆటోడ్రైవర్ మురార్జీ అనే వ్యక్తికి తాయారు విషయం తెలియజేసింది. మురార్జీ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూనే పెళ్లిళ్ల బ్రోకర్‌గా వ్యవహరిస్తున్నాడు. అతడు తనకు పరిచయమున్న విజయవాడ వాంబేకాలనీలోని షాలిని, భవాని అనే మరో ఇద్దరికి చెప్పాడు. వీరంతా కలిసి గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన ఆమని అనే మహిళను ఎంపిక చేశారు. ఆమెకు కొన్నాళ్ల క్రితం వివాహమైంది. భర్త ఎటో పోయాడు. ఐదేళ్ల కుమారుడితో ఆమని ఉంటోంది. డబ్బు ఆశ చూపి ఆమెను పెళ్లికూతురులా తయారుచేశారు. 'కొన్నిరోజులు కాపురం చేసి వచ్చేయ్.. రూ.పది వేలు ఇస్తాం' అని చెప్పి ఆమనిని బ్రోకర్లు ఒప్పించారు. రూ.50 వేలు ఖర్చుల కింద దుర్గాప్రసాద్ నుంచి ఫోన్‌పే చేయించుకున్నారు. ఈనెల1న పెళ్లి చేసి ఆమనిని ఆయన వెంట కర్ణాటకకు పంపించారు. పెళ్లి ఖర్చుల కింద రూ.3 లక్షలు బ్రోకర్లు లాగేశారు. కాపురానికి వెళ్లాక పుట్టింటికి రావడానికి ఆమె ప్రయత్నించింది. ప్రతిసారీ 'నేనూ తోడు వస్తాడు'అనిదుర్గాప్రసాద్ అని అంటుండటంతో ఆమని అసలునిజం చెప్పేసింది. దుర్గాప్రసాద్ విజయవాడకు చేరుకుని మధ్యవర్తులను నిలదీయగా, వారు తమ మోసాన్నిఅంగీకరించారు. దీంతో దుర్గాప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమని సహా ముగ్గురిని పోలీసులు అరెస్టుచేశారు.

రెండు దశల్లో జమిలి!

(మొదటి పేజీ తరువాయి)

గోవా, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, పాండిచ్చేరి, పంజాబ్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల శాసనసభలకు 2021-2022లో ఎన్నికలు జరిగాయి. ఇక ఢిల్లీలో ఈ ఏడాదే ఎన్నికలు జరగగా, బిహార్‌లో వచ్చే సెప్టెంబరు-అక్టోబరులో జరుగనున్నాయి. 2024 లోక్‌సభ ఎన్నికలకు సుమారు ఏడాది ముందుగానీ, ఏడాది తర్వాత గానీ అసెంబ్లీ ఎన్నికలు జరిగిన రాష్ట్రాలను ఒక క్యాటగిరీగా తీసుకోవాలని కేంద్రం యోస్తోంది. అంటే 2028, 29లో ఎన్నికలు జరగాల్సి ఉన్న రాష్ట్రాలను తొలి విడతలో పరిగణనలోకి తీసుకోనున్నారు. 2028లో తెలంగాణతోపాటు మధ్యప్రదేశ్, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, మేఘాలయ, నాగాలాండ్, త్రిపుర, మిజోరం రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. 2029లో అసెంబ్లీ ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్, ఒడిశా, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం, హరియాణా, జార్ఖండ్, మహారాష్ట్ర ఉన్నాయి. ఈ 16 రాష్ట్రాలకు 2029 పార్లమెంటు ఎన్నికలతో కలిపి జమిలి ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయి. మిగతా రాష్ట్రాల్లో వేటినైనా ఈ పరిధిలోకి తీసుకురావచ్చా అనే అంశాన్ని కూడా పరిశీలిస్తారు. అలా లేని వాటన్నింటినీ.. 2034 నాటికి ఒకే దేశం-ఒకే ఎన్నిక పరిధిలోకి తేవాలని యోచిస్తున్నట్లు సమాచారం.

పీఎస్‌యూలు, మాజీ న్యాయమూర్తుల అభిప్రాయాలు కూడా

ఒకే దేశం-ఒకే ఎన్నికకు సంబంధించి 129వ రాజ్యాంగ సవరణ బిల్లును గత ఏడాది డిసెంబరులో పార్లమెంటులో ప్రవేశపెట్టారు. పార్లమెంటు-అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి నిర్వహించడానికి సంబంధించిన అంశాలను ఇందులో పొందుపరిచారు. అంతకుముందు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఏర్పాటైన కమిటీ.. పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు మాత్రమే కాకుండా స్థానిక సంస్థల ఎన్నికలను కూడా ఒకేసారి నిర్వహించాలని సిఫారసు చేసింది. పార్లమెంటు-అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన 100 రోజుల్లోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని సూచించింది. అయితే ప్రస్తుతానికి పార్లమెంటు-అసెంబ్లీ ఎన్నికలు ఏకకాలంలో అనే అంశంపైనే బిల్లును రూపొందించారు. తొలుత ఈ అంకాన్ని పూర్తిచేస్తే.. ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు కూడా ఏకకాలంలో అన్న అంకానికి తెరతీసే అవకాశాలున్నాయి.

రాష్ట్రాల్లో జేపీసీ పర్యటన..

జమిలి ఎన్నికలపై ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) ఆ అంశంపై అభిప్రాయ సేకరణకు అన్ని రాష్ట్రాల్లో పర్యటిస్తోంది. తొలుత ఈ కమిటీలో 31 మందిని నియమించగా.. ఆ తర్వాత కొన్ని చిన్న పార్టీలు తమకు కూడా ప్రాతినిధ్యం కల్పించాలని కోరాయి. ఇందుకు కేంద్రం అంగీకరించడంతో ఆ సంఖ్య 39కి పెరిగింది. ఇందులో బీజేపీ నుంచి అనురాగ్ ఠాకూర్, బన్సూరీ స్వరాజ్, కె.లక్ష్మణ్, సీఎం రమేశ్ తదితరులుండగా.. కాంగ్రెస్ నుంచి ప్రియాంకాగాంధీ, మనీశ్ తివారీ, రణదీప్ సుర్జేవాలా, టీడీపీ-గంటి హరీశ్, జనసేన-వల్లభనేని బాలశౌరి, వైసీపీ-వైవీ సుబ్బారెడ్డి, దేశంలోని పలు ఇతర పార్టీల ఎంపీలు సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ ఇప్పటికే ఐదు రాష్ట్రాల్లో పర్యటించింది. మహారాష్ట్ర, పంజాబ్, హరియాణ తదితర రాష్ట్రాల్లో కేవలం పార్టీల అభిప్రాయాలే కాకుండా.. ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంకుల అభిప్రాయాలను కూడా తీసుకుంటోంది. అనేకసార్లు ఎన్నికలు రావడం వల్ల ఆయా సంస్థలు, బ్యాంకులకు ఏమైనా ఇబ్బందులున్నాయా? వాటి కార్యకలాపాలకు ఆటంకం ఏర్పడుతోందా అన్న విషయాలపైనా అభిప్రాయ సేకరణ చేస్తోంది. అదే సమయంలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తుల అభిప్రాయాలు కూడా సేకరించినట్లు సమాచారం. ఇప్పటికే ఐదుగురు మాజీ సీజేలతో మాట్లాడామని, మరింతమంది అభిప్రాయాలు కూడా తీసుకుంటామని కె.లక్ష్మణ్ తెలిపారు.

తెలంగాణకు లోక్‌సభతో పాటే..

తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికలు.. ఈసారి పార్లమెంటు ఎన్నికలతో కలిసి జమిలిగా వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' విధానంలో భాగంగా తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలను 2029లో పార్లమెంటు ఎన్నికలతో కలిపి నిర్వహించాలనే యోచనలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు రాష్ట్ర అసెంబ్లీకి చాలా దఫాలు పార్లమెంటుతో కలిపే ఎన్నికలు జరిగాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక జరిగిన 2014 ఎన్నికలు కూడా జమిలిగానే నిర్వహించారు. అయితే ఆ తర్వాత 2018లో నాటి కేసీఆర్ ప్రభుత్వం లోక్‌సభతో కాకుండా సుమారు ఐదు నెలల ముందుగానే అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లింది. 2023లోనూ అదే కొనసాగింది.

ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధిని స్వాగతిస్తున్నాం

ఉద్యోగుల సమస్యలను విస్మరించొద్దు

- ఏపీఎన్జీజీవో అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్
- నూతన ప్రధాన కార్యదర్శిగా డీవీ రమణ ఎన్నిక



ఏపీఎన్జీజీవో అధ్యక్షుడు విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి రమణను సత్కరిస్తున్న ఉద్యోగ సంఘ నేతలు

విజయవాడ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను స్వాగతిస్తున్నామని ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ అన్నారు. సంఘం నూతన ప్రధాన కార్యదర్శిగా విజయనగరం జిల్లాకు చెందిన డీవీ రమణ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను విస్మరిస్తోందనే భావన ఉందని, ఉద్యోగ వర్గాలు దీనిపై అసంతృప్తిగా ఉన్నాయన్నారు. రూ.30 వేల కోట్లకుపైగా ఆగిపోయిన ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాల్లో రూ.7,500 కోట్లే ఇచ్చారని పేర్కొన్నారు. పీఆర్సీ కమిటీని తక్షణమే నియమించాలని డిమాండ్ చేశారు. వీలైనంత త్వరలో ఉద్యోగ సంఘాలతో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని విద్యాసాగర్ కోరారు. రమణ మాట్లాడుతూ ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా అందరికీ అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు దస్తగిరి, 13 జిల్లాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ గజిటెడ్ సంఘం అధ్యక్షుడిగా కుమారేశ్వరన్

అమరావతి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ గజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా భీమవరం ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్ఎస్ కుమారేశ్వరన్ ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా శ్రీసత్యసాయి జిల్లా ఏఈఎస్ బి.నర్సింహులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోశాధికారిగా సునీత, ఉపాధ్యక్షులుగా బి.రామ్మోహన్‌రెడ్డి, ఎస్.శ్రీనివాసరావు, బాలయ్య, కార్యనిర్వాహక కార్యదర్శిగా పి.రాజశేఖర్ గౌడ్, సంయుక్త కార్యదర్శులుగా శ్రీధర్‌రావు, జె.రమేష్, అజయ్ సింగ్ ఎన్నికయ్యారు. వి.చంద్రశేఖర్‌రెడ్డి, రేణుక, సుబ్బారావు, గోవింద్ నాయక్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.

నేడు కోస్తా, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు

విశాఖపట్నం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): వాయవ్య బంగాళాఖాతం పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. సోమవారం గుజరాత్, విదర్భ, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలలో పలు ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరిస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఆ తర్వాత మూడు రోజుల్లో పశ్చిమబెంగాల్, ఝార్ఖండ్, బిహార్, ఉత్తరప్రదేశ్ వరకు విస్తరిస్తాయని పేర్కొంది. కాగా.. ఆదివారం కోస్తా, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు కురిశాయి. దక్షిణ కోస్తాలో ఎండ తీవ్రత కొనసాగింది. కావలిలో 37.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు, కోస్తాలో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

'ఆదిత్య' శేషారెడ్డికి కార్ల్ ల్యాండ్ స్టీనర్ అవార్డు



డాక్టర్ ఎస్.శేషారెడ్డికి 'కార్ల్ ల్యాండ్ స్టీనర్' అవార్డు అందిస్తున్న మంత్రి సత్యకుమార్

కాకినాడ రూరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో రెడ్‌క్రాస్ సర్వీసుల్లో అత్యధిక సేవలను అందించిన వారికి గుంటూరులోని భారతీయ విద్యాభవన్‌లో అవార్డుల ను ఆదివారం ప్రదానం చేశారు. తలసీ మియా రోగుల కోసం 2023, 24 సంవత్సరాల్లో ఏపీలో అత్యధికంగా ఒకే విద్యా సంస్థ నుంచి ఆదిత్య డిగ్రీ కళాశాలలు అత్యధిక స్థాయిలో రక్త యూనిట్లు అందజేశాయి. ఈ సందర్భంగా ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎస్.శేషారెడ్డికి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతిష్ఠాత్మకమైన 'కార్ల్ ల్యాండ్ స్టీనర్' అవార్డును రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ అందజేశారు.

కుట్ర బయటికొస్తుందా?

కుంటిమద్ది హెలిప్యాడ్ ఘటనలో తుదిదశకు విచారణ

- హెలికాప్టర్ విండ్ షీల్డ్ దెబ్బతినలేదన్న పైలట్!
- పైలట్, కో-పైలట్ జవాబులపై పోలీసుల అసంతృప్తి
- విచారణకు సహకరించని తోపుదుర్తి
- త్వరలో చార్జిషీటు దాఖలు: సీఐ

ధర్మవరం/చెన్నేకొత్తపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం కుంటిమద్ది హెలిప్యాడ్ వద్ద ఏప్రిల్‌లో జగన్ పర్యటన సమయంలో తలెత్తిన ఘటనలకు సంబంధించిన కేసులో పోలీసుల విచారణ తుది దశకు చేరుకుంది. కుట్రకోణంపై లోతుగా ఆరా తీస్తున్నారు. ఇప్పటికే వైసీపీ రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, పైలట్ అనిల్‌కుమార్, కో-పైలట్ శ్రేయస్ జైన్, 85 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలను ప్రశ్నించారు. రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో హత్యకు గురైన వైసీపీ కార్యకర్త లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు జగన్ ఏప్రిల్ 8న బెంగళూరు నుంచి హెలికాప్టర్‌లో కుంటిమద్దికి వచ్చారు. హెలిప్యాడ్ వద్ద దిగిన వెంటనే వైసీపీ కార్యకర్తలు పోలీసులను పక్కకు తోసివేసి హెలికాప్టర్ వద్దకు దూసుకొచ్చారు. కొందరు దానిపై పిడిగుద్దులు కురిపించినట్లు తెలిసింది. దీంతో హెలికాప్టర్ విండ్‌షీల్డ్ దెబ్బతిందంటూ జగన్‌ను తీసుకెళ్లకుండా పైలట్లు అందులో వెళ్లిపోవడం అప్పట్లో వివాదాస్పదమైంది. దీని వెనుక ఏదో కుట్ర ఉందని, జగన్‌కు హాని తలపెట్టాలని పథకం వేశారని వైసీపీ నేతలు ఆరోపించారు. దీంతో ఈ ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి నిజానిజాలు నిగ్గుతేల్చేందుకు విచారణకు ఆదేశించింది. అయితే కావాలనే శాంతిభద్రతల సమస్య సృష్టించేందుకు తోపుదుర్తి, ఆయన అనుచరులు ప్రయత్నించినట్లు పోలీసులు ఏప్రిల్ 9న కేసు నమోదు చేశారు. వంద మందికిపైగా కార్యకర్తల పేర్లను చేర్చారు. పైలట్, కో-పైలట్‌ను విచారణకు పిలువగా ఏప్రిల్ 16న కో-పైలట్ శ్రేయస్ జైన్ హాజరయ్యారు. ఆ రోజు జరిగిన ఘటనపై కొంతవరకు ఆయన వివరణ ఇచ్చారు. అయితే ప్రధాన పైలట్ అనిల్ మూడుసార్లు గైర్హాజరయ్యారు. జూన్ 10న హాజరై వైసీపీ శ్రేణులు హెలికాప్టర్ వద్దకు దూసుకొచ్చినప్పుడు విండ్‌షీల్డ్ దెబ్బతినలేదని, ఫ్లెక్స్ విండో ఫ్యాన్ పగులిచ్చిందని.. దీంతో జగన్‌కు ఇబ్బంది వస్తుందని భావించి, ఆయన్ను వదిలేసి వెళ్లిపోయామని వెల్లడించారు. అయితే పైలట్, కో-పైలట్ చెప్పిన అంశాలు నమ్మశక్యంగా లేవని పోలీసులు భావిస్తున్నారు. వైసీపీ నేతలు చెప్పమన్నట్లుగా చెప్పారనే అనుమానిస్తున్నారు. ప్రధాన నిందితుడు తోపుదుర్తి కూడా దాగుడుమూతలాడారు. ఎట్టకేలకు మే 12న పోలీసుల ముందు హాజరయ్యారు. 'తెలియదు.. గుర్తులేదు' అని సమాధానాలు దాటవేసినట్లు తెలిసింది. జగన్ పర్యటనకు సంబంధించి తన బాధ్యత ఏమీలేదని అంతా పార్టీ జిల్లా విభాగమే చూసుకుందని చెప్పారు. అవసరమైతే మరోసారి ఆయన్ను విచారణకు పిలవాలని పోలీసులు భావిస్తున్నారు. అయితే 'చలో పేరూరు'తో శాంతిభద్రతలు దెబ్బతీయడానికి ప్రయత్నించిన కేసులో ఆయనపై కేసు నమోదు కావడంతో ఆయన ముంబై వెళ్లిపోయినట్లు సమాచారం. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు నివేదించాక న్యాయ నిపుణులతో చర్చించి తదుపరి చర్యలు తీసుకోవాలని పోలీసులు నిర్ణయించారు. 'ఇప్పటివరకు 85 మందిని విచారించాం. మరికొందరిని విచారించాల్సి ఉంది. త్వరలోనే చార్జిషీటు దాఖలుచేస్తాం' అని రామగిరి సీఐ శ్రీధర్ వెల్లడించారు.

బొమ్మలు: అక్బర్

మొదటిసారి ఏ పుస్తకాన్ని ఇష్టంగా చదవటం గుర్తుంది?

బాల్యంలో మాక్సింగ్ గోర్కీ 'అమ్మ'. అప్పుడంతగా కొరుకుడు పడలేదు కానీ ఆ పుస్తకంతో నాదొక ఎమోషనల్ జర్నీ. యవ్వనంలో బాలగంగాధర్ తిలక్ 'అమృతం కురిసిన రాత్రి' ఇష్టంగా చదువుకున్నాను. ఇంటర్ డిగ్రీ చదివే రోజుల్లో ఆ పుస్తకం లోని కొన్ని వాక్యాలు చదువుకుని నిద్రపోవడం, మళ్ళీ పొద్దున్నే తలగడ కింద నుంచి పుస్తకాన్ని తీసి ఒకట్రెండు వాక్యాలు చదివి గానీ లేవకపోవడం. మతగ్రంథం లెక్కన్నమాట.

మీ పఠనాభిరుచి కాలంతోపాటు ఎలా మారింది?



చిన్నప్పుడు లాంతరు వెలుగులో నాన్న చదివి వినిపించిన పురాణాలు, నవలలు, కథలు, పద్యాలు నన్ను పుస్తక ప్రేమికుడిని చేశాయి. సహజత్వం మీద ఇష్టంతో జానపద కథల వెంట పడ్డాను. స్నేహితుల ప్రభావం ఊహల్లోంచి నేల మీదకొచ్చి పడేలా చేసింది. ప్రపంచాన్ని సరిగా అర్థం చేసుకోవడానికి సైన్స్ అనే

"రక్షణతంత్రంలా కవిత్వాన్ని ఆశ్రయిస్తాను"

మూడో చూపు అవసరాన్ని గుర్తించాను. మహీధర నళినీ మోహన్ నా అభిమాన కలం. యండమూరి – యద్దనపూడి అనే భిన్న ధ్రువాలతో యవ్వనం గడిచిపోయింది. ఆఖర్లో బుచ్చిబాబును చదవడం పెద్ద కుదుపు. వర్తమానంలో అమ్మలేని వెలితిని కవిత్వంతో పూడ్చుకున్నాను. నా దృష్టిలో కవిత్వం సంపూర్ణ ప్రక్రియ. అలా కాల్పనిక రచనలతో మొదలై సైన్స్ మీదుగా కవిత్వం గూటికి చేరుకున్నాను.

ఇటీవల చదివి ఇష్టపడిన పుస్తకం?

సిద్ధార్థ కవిత్వ సంపుటి 'మల్లెల తీర్థం మహాఖననం'.



నిన్ను నువ్వు వదిలించుకోవటం తోటే కవిత్వం మొదలవుతుంది అనే ఆయన వాక్యం నిటారుగా నిలబెడుతుంది. వ్యక్తిగత జీవితంలో, వర్తమాన సమాజంలో ఇప్పుడున్న సంక్లిష్టతకు ఈ కవిత్వంలో కారణం దొరుకుతుంది. భాషాపరమైన స్థానికత కవితా వస్తువుతో కనెక్ట్ చేస్తుంది. బరువైన విషయాలను సైతం పాఠకుడి రోజువారీ అనుభవాలతో సందర్భాలతో జోడించి చెప్పడం వల్ల కవిత్వ సారాంశాన్ని చదువరి తన శక్తి మేర అందుకోగలుగుతాడు.

కవిత్వం పట్ల మీ దృక్పథాన్ని మలిచిన పుస్తకాలేవి?

నగ్నముని 'కొయ్యగుర్రం'తో నాకు కవిత్వం అంతిమ లక్ష్యం తెలిసొచ్చింది. 'I met my future' అనిపించింది. వ్యవస్థ వాస్తవిక పార్శ్వాలన్నింటినీ కవిత్వం అనే సిల్వర్ స్క్రీన్ మీద చూపెట్టిన పుస్తకమది.

మీరు ఎక్కువసార్లు చదువుకున్న కవిత్వ సంపుటి ఏది?

శేషేంద్ర 'ఆధునిక మహాభారతం'. రోజుకొక్క సారైనా గాయపడకుండా గడవని కాలంలో ఇది నా డగౌట్. కొన్నిసార్లు మనం అనుకున్న వాళ్ళే మన నుండి దూరంగా జరిగిపోతారు. మాటలతో ప్రవర్తనతో గాయపరుస్తారు. ఆ నిర్భ్రాంతత కొన్నాళ్ళు కొనసాగుతుంది. ఇలాంటి సమయాల్లో ఒక రక్షణతంత్రంలా కవిత్వాన్ని ఆశ్రయిస్తాను. ఇంకొన్నిసార్లు ఎదురైన అనుభవాలు, కలిసిన వ్యక్తులు, చూసిన విన్న చదివిన సంఘటనలు భయపెడతాయి, బాధపెడతాయి. నిస్సహాయత చుట్టేస్తుంది. అలాంటప్పుడు శేషేంద్ర వాక్యాలు చదువుకుని మామూలు మనిషి అవుతాను. అవి కేవలం రసాత్మక వాక్యాలేనా? ఈ పట్టాల మీదే ప్రపంచం అనే రైలుబండిని అందుకున్నాను.

చదువు ముచ్చట

సాంబమూర్తి లండ

మీరు తరచూ మననం చేసుకునే కవిత్వ పంక్తులు?

శ్రీశ్రీ రాసిన 'ఆః!' కవిత:

"నిప్పులు చిమ్ముకుంటూ నింగికి నే నెగిరిపోతే,
నిబిడాశ్చర్యంతో వీరు..

నెత్తురు క్రక్కుకుంటూ నేలకు నే రాలిపోతే
నిర్ధాక్షిణ్యంగా వీరే.."

అలాగే నా ఒక వాక్యాన్ని కూడా నేను తరచూ మననం చేసుకుంటుంటాను:

"నేను చెట్టుని
ప్రతి తుఫాను తర్వాతా
నా మరణం
వాయిదా పడుతుంటుంది"

ఈ రెంటిలో– ఒకటి డాలు. మరొకటి కత్తిని కాపాడుకునే ఒర.

(సాంబమూర్తి లండ కవి. ఇప్పటిదాకా మూడు కవిత్వ సంపుటాలను వెలువరించారు. అవి: 2020లో 'గాజు రెక్కల తూనీగ', 2022లో 'నాలుగు రెక్కల పిట్ట', 2024లో 'ఆమెకు మిగలని ఆమె'.)


✆ 96427 32008

కల్లోల జీవితంపై అక్షరాల వంతెన

నోట్స్ కొనే డబ్బుల్లేక, ఖాళీ సిగరెట్ పెట్టె మీద టీచర్ చెప్పిన పాఠాలు రాసుకుని, వాటిని దారాలతో కుట్టి, చూరుకు వేలాడదీసి, తీరిక సమయాల్లో చదువుకుని... ఇలాంటి కల్లోల జీవితంలోంచి కమ్యూనిస్టుగా, రచయితగా, అనువాదకుడిగా ఆదర్శవంతమైన జీవితం లోకి ఎదిగారు ఆలూరి భుజంగరావు.

శిక్షించకపోతే చదువు రాదని పిల్లల కండ్లలో మిరియపు గంధం పెట్టడం, తల్లిదండ్రులే తమ పిల్లల్ని కమ్మరి దగ్గరికి తీసుకెళ్లి కాళ్లకు సంకెళ్లు వేయించడం వంటి అమానుష పద్ధతులు పాటించే కాలంలో– మూడోతరగతి వాచకం కొనమని గొడవపెట్టినందుకు కొనలేని దుస్థితిలో తండ్రి చింతబరికతో చావ బాదడంతో భుజంగరావు గారి చదువు అర్ధాంతరంగా ఆగిపోయింది. తర్వాతేముందీ... గోళీలాటలూ, బీడీలు కాల్చడాలూ, ఇంట్లో బియ్యం ఎత్తుకెళ్ళి సినిమాలు చూడ్డం, చిరుతిళ్ళూ, చిల్లర తిరుగుళ్ళూనూ!

తొమ్మిదో ఏట పొట్టకూటి కోసం పాట్లు మొదలయ్యాయి. వృద్ధుడైన తండ్రి వల్ల పూట గడవని స్థితిలో భుజంగరావు అన్నలతో కలిసి మధూకరం (భిక్ష) తెచ్చేవారు. పదేళ్ల వయసులోనే హోటల్ కార్మికుడిగా చేరి 23వ ఏట దాకా గుంటూరు, బెజవాడ, తెనాలి, బాపట్ల, చేబ్రోలు పట్టణాల హోటళ్లలో చాకిరీ చేశారు. తిండీ నిద్రా అక్కడే. తెల్లవారుజామున 4 గంటల నుండి రాత్రి 10 గంటల వరకూ పొగలో సెగలో పని. పొట్టకూటి కోసం అలా పాట్లు పడుతూనే హిందీ, తమిళం, కన్నడం, భాషల్ని నేర్చుకున్నారు. కథలు రాశారు. అవి చదివిన కష్టమర్లు హోటల్లో ఈయన్ని చూసి "ఆ రచయిత ఈయనా!" అని మొహం తిప్పుకుపోయేవారట. ఖాళీ సమయాల్లో పుస్తకాలు చదవడం చూసి యజమానులు కస్సుమనేవారు. నెల జీతంతో పాటు బీడీలకు అర్ధణా దక్షిణ ఇచ్చేవారు. అవి కాల్చుకోడానికి పది నిమిషాల విరామం ఇచ్చేవారు. బీడీలు కాల్చకపోతే అర్ధణాతోపాటు ఆ విరామమూ పోతుందని బీడీలు కాల్చారు.



ఓ పక్క హోటల్లో పని చేస్తూనే, సంగీతం నేర్చుకోవాలన్న ఒక గురువు సలహా ప్రకారం తెల్లవారుజామున చలిలో స్వరసాధన కోసం పార్కులో కూర్చుని, ఎలుగెత్తి అరిచి, లాభం లేదని విరమించుకున్నారు. కొన్నాళ్ళు చిత్రకళ అభ్యసించి థియేటర్లలో బోర్డులు రాసి చేతులు కాల్చుకున్నారు. సురభి నాటక సంస్థలో చేరి చిట్టిపొట్టి వేషాలేశారు. మద్రాసువెళ్లి పూట భోజనమూ, ఐదు రూపాయల కూలీకి 'గొల్లభామ', 'నారద నారది' సినిమాల్లో అతిథి పాత్రలేశారు.

దుర్భర జీవితాన్ని గడుపుతూనే హిందీ భాషా సాహిత్యాల అధ్యయనం కోసం హిందీ నేర్చుకున్నారు. ఆయనకు హిందీ నేర్పిన గురువు కూడా ఒక హోటల్ పనివాడే కావడం విచిత్రం. పలక కూడా కొనుక్కోలేని దీన స్థితి చూసి పాపం ఆ గురువే పలక కొనిచ్చాడు. మద్రాసులో అద్దెగది. చింకిచాప కూడాలేని దుస్థితి. ఒక వార్తా పత్రిక మీద పడుకుని మరో పత్రికను కప్పుకుని కాలక్షేపం చేశారు. బ్రతకడానికి హిందీ ట్యూషన్లు చెబుతానంటే, అందుకోసం 'రాష్ట్రభాష' పరీక్ష పాసవ్వాలి గానీ, రాహుల్ సాంకృత్యాయన్నీ, ప్రేమచంద్‌నీ చదివి హిందీ పాఠాలు చెబుతానంటే ఎలా? అని పెదవి విరిచారట.

హోటల్లో చదువుకుంటే యజమాని ఒప్పుకోడు కాబట్టి రోడ్డుపక్కన కూర్చుని చదువుకున్నారు. అభ్యుదయ సాహిత్యాన్ని అధ్యయనం చేశారు. "గోర్కీ జీవితం, 'అమ్మ' నవలా నాకెంత ఇష్టమంటే కడుపుకి ఆపరేషన్ చేయించుకున్నపుడు దాన్ని తల కింద పెట్టుకుని పడుకున్నాను" అన్నారు. ఉద్యోగానికి ఎసరు వస్తుందని తెలిసి కూడా మేడే ప్రదర్శనలో పాల్గొన్నారు. అలా హోటల్లో పని కూడా పోయింది. రచనా వ్యాసంగంలోకి అడుగు పెట్టి 'కుక్క ఆత్మకథ', 'అంతా గమ్మత్తు', 'దిక్కు మొక్కు లేని జనం', 'ప్రజలు అజేయులు' వంటి నవలలు, 'సాహిత్య బాటసారి శారద' జీవిత చరిత్రా రాశారు. ప్రేమ్‌చంద్, రాహుల్ సాంకృత్యాయన్, కిషన్ చందర్, యశ్ పాల్, సరోజ్ దత్తాల రచనలను తెలుగు లోకి అనువదించారు.

'వెలుగురవ్వల జడి'లో తన అనుభవాలను వివరించారు.' 'ప్రభాత్' పత్రికకు సంపాదకులుగా ఉన్నారు.

"ప్రతి జాతి జీవితంలోనూ ఒక సమయం వస్తుంది. అధికార మదాంధులూ, డబ్బు మదం కలవారూ, వారి పాలక యంత్రం, కాపలా కుక్కలూ – ప్రజల మీద దోపిడీ పీడనలను విస్తృతం చేసి జాతి మనుగడను– దుర్భరం చేస్తారు. అలాంటి సమయంలో ప్రజలకు బ్రతకడం కంటే పోరాడి చావడమూ, శాంతికంటే అలజడీ ప్రియాతి ప్రియమైన విషయాలుగా పరిణమిస్తాయి" అంటారు ఆలూరి తన ఆత్మకథ 'గమనా గమనం'లో. 1928 లో గుంటూరు జిల్లా కొండముది గ్రామంలో జన్మించిన ఆయన విరసం సభ్యుడిగా, రచయితగా, అనువాదకుడిగా, జీవితాన్ని అర్థవంతం చేసుకుని 2013 జూన్ 20 న తుది శ్వాస విడిచారు.

"ప్రతి జాతి జీవితంలోనూ ఒక సమయం వస్తుంది. అధికార మదాంధులూ, డబ్బు మదం కలవారూ, వారి పాలక యంత్రం, కాపలా కుక్కలూ – ప్రజల మీద దోపిడీ పీడనలను విస్తృతం చేసి జాతి మనుగడను దుర్భరం చేస్తారు. అలాంటి సమయంలో ప్రజలకు బ్రతకడం కంటే పోరాడి చావడమూ, శాంతికంటే అలజడీ ప్రియాతి ప్రియమైన విషయాలుగా పరిణమిస్తాయి"
– ఆలూరి భుజంగరావు (ఆత్మకథ 'గమనా గమనం'లో).

■ పి.యస్. ప్రకాశరావు

✆ 99637 43021

చిన్న పుస్తకమైనా అనుకోని స్పందన


నా మొదటి పుస్తకం

నామాడి శ్రీధర్



రాజమండ్రి నుంచి నలుగురు మిత్రులం (ఒమ్మి రమేష్ బాబు, తల్లావజ్ఝల శశిశేఖర్, ఇక్బాల్ చంద్) 1990లలో ఇస్మాయిల్ గారిని కలవడానికి కాకినాడ వెళుతుండేవాళ్ళం. ఆయన ఆచితూచి మాట్లాడిన తర్వాత అప్పుడప్పుడు నేను ఒకటిరెండు కవితలను వినిపించేవాడిని. ఓసారి నన్ను ఉద్దేశించి ఆయనన్నారు: "మీ కవితలతో చిన్న పుస్తకం వేయండి." ఆ ప్రతిపాదన ఆనాటి నుంచి నా మనసులో మెదులుతుండేది. ఆలోపు ఉద్యోగనిమిత్తం హైదరాబాద్ చేరుకున్నాను. అక్కడే నా కవిత్వం 'ఆకుపచ్చ లోయ' (1996) పుస్తక రూపం తాల్చింది.

వాడ్రేవు చినవీరభద్రుడు, సతీష్ చందర్, అఫ్సర్ గార్లు అపురూపమైన ముందుమాటలు రాశారు. కవిత్వసారాన్ని తల్లావజ్ఝల శివాజీ గారు ముఖచిత్రంలోకి పట్టితెచ్చారు. కవర్ పేజీ కోసం 'చేతితో తయారు చేసిన కాగితం' ఎంచుకున్నాను. పుస్తకానికయ్యే మొత్తం వ్యయంలో ముఖపత్రానికి సగం ఖర్చుచేశాను. చరిత ప్రెసులో అచ్చు వేశారు. అందుకు అవసరమైన డబ్బుని మా నాన్న గారు సమకూర్చారు.



నిజానికి అది చిన్న పుస్తకం. అయినా అనుకోని స్పందన లభించింది. మిత్రులు, పలువురు ఇష్టకవులు అక్కున చేర్చుకున్నారు. "మాటల గాజుపెంకుల మీద జాగ్రత్తగా అడుగులు వేయడం నేర్చుకున్నారు" అని జాబు రాశారు ఇస్మాయిల్. "సబ్బుతో చేతుల్ని శుభ్రంగా కడుక్కొన్న తర్వాత పుస్తకం తెరిచాను" అని వేగుంట మోహన్ ప్రసాద్ చెప్పారు. అద్భుతమైన సాహిత్య సంపాదకీయంతో ఎబికె ప్రసాద్ అబ్బురపరిచారు. 'అంతర్ముఖుడి గాయాలాపన' అంటూ కలేకూరి ప్రసాద్ తన సమీక్షలో అభివర్ణించారు. అలాగే సహృదయుల ప్రశంసకి పాత్రమై గొప్ప ఉత్తరాల్ని అందుకున్నాను.

నిబద్ధత, నిమగ్నతల మధ్య సరిహద్దురేఖని తుడిచివేసిన తరానికి చెందుతాను నేను. ఏనాటికీ ప్రత్యుత్తరం లేని ప్రేమలేఖల ప్రతీక్ష; యావత్ప్రపంచం కోనసీమలాగ సతతం హరితమనే అమాయకత; హృదయాంతరాళంలోంచి ఉప్పొంగిన నినాదం శుష్కవచనమైన సంవేదన 'ఆకుపచ్చ లోయ' పుటల్లో దాగి ఉన్నాయి. నా కవితలు క్లుప్తంగా ఉండటంతో కవిభావన చదువరికి సరిగా అందడం లేదని ఒకరిద్దరు విమర్శించారు. ఆ వ్యాఖ్యని గమనంలోకి తీసుకున్నాను. కానీ కవితకి క్లుప్తత, గాఢత చిరశాశ్వతమైన మౌలికగుణాలనే ఎరుకతో ఉన్నాను. డేవిడ్ షుల్మాన్ 'పురాగానం' కవితని ఆంగ్లంలోకి అనువదించారు. దానిని తన 'Spring, Heat, Rains: A South Indian Dairy' (2009) పుస్తకంలో చేర్చారు.

'ఆకుపచ్చ లోయ'ని ఇప్పటికీ కొందరు గుర్తుపెట్టుకున్నారు. ఎక్కడో ఎవరో తారసపడినప్పుడు అందులోంచి ఒకటిరెండు స్టాంజాలని ఉదహరిస్తుంటారు. అలా సుదూరగత స్మృతిపేటికని తెరుస్తారు. అటువంటివేళ సంభ్రమాశ్చర్యాలతో నవయవ్వనంలోకి రెక్కలు విప్పుతాను. పుస్తకం ప్రచురించిన స్వల్పకాలానికి మా అమ్మగారు అర్థాంతరంగా కనుమూశారు. అనంతరం ఓనాడు ఆమె బీరువా తెరిచాను. నేను తనకి రాసిన లేఖలతో పాటు పదిలపరిచిన 'ఆకుపచ్చ లోయ' ప్రతిని కూడా చెమ్మగిల్లే కళ్ళతో చూశాను.

నిబద్ధత, నిమగ్నతల మధ్య సరిహద్దురేఖని తుడిచి వేసిన తరానికి చెందుతాను నేను. ఏనాటికీ ప్రత్యుత్తరం లేని ప్రేమలేఖల ప్రతీక్ష; యావత్ప్రపంచం కోన సీమలాగ సతతం హరితమనే అమాయకత; హృదయాంతరాళంలోంచి ఉప్పొంగిన నినాదం శుష్కవచనమైన సంవేదన 'ఆకుపచ్చ లోయ' పుటల్లో దాగి ఉన్నాయి.

***

పుస్తకం ప్రచురించిన స్వల్పకాలానికి మా అమ్మగారు అర్థాంతరంగా కనుమూశారు. అనంతరం ఓనాడు ఆమె బీరువా తెరిచాను. నేను తనకి రాసిన లేఖలతో పాటు పదిలపరిచిన 'ఆకుపచ్చ లోయ' ప్రతిని కూడా చెమ్మగిల్లే కళ్ళతో చూశాను.

✆ 93968 07070

కల



ఆదిమానవులు చేసిన ప్రయాణంలోని
అసలైన సౌందర్యాన్ని పట్టుకోడానికి
అతడు సుదీర్ఘ యాత్ర చేస్తున్నట్లు
నిద్రలో కలగన్నాడు

సూర్యుని కింది మనుష్యుల సుఖదుఃఖాలను
దాటాడు
జంతువుల అమాయకత్వాన్ని చేత్తో తాకాడు
నదులు దాహంతో తాగిన సూర్యోదయాల్ని
సముద్రాలు వెన్నెలను చూసి పడిన మోహాల్ని
చూసాడు



అడవుల్లో చెట్ల కొమ్మలకు
వేలాడే భయాల్ని
అడవే నాకు కాపలా ఉండగా
అడవి నన్నేం చేస్తుంది అనుకునే
లేత ప్రాణుల ధైర్యాన్ని
విన్నాడు

గుహల్లో నిద్రపోతున్న శతాబ్దాల
పక్క నుండి నడిచాడు
జలపాతాల తాడు పట్టుకొని ఊగి
ఇసుక తుఫాను ఆగిపోయాక మెల్లిగా కళ్లు తెరిచిన
ఎడారుల్లోంచి నడుచుకుంటూ
అగ్నిపర్వతం అంచును చేరి
అగ్నిపుష్పాన్ని తెంపుకొని జేబులో పెట్టుకొని
ఆ అంచు నుండి ఎగిరి మంచుపర్వతాల మీద పడి
జారిపోయి ఒక లోయలో పడ్డాడు.



పడడం పడడం
అప్పటికే ఆ లోయలోకి
జారిపడ్డ మనుష్యుల మధ్య
పడ్డాడు
ఆ తర్వాత ఆ మనుష్యులు చెప్పిన
చంద్రుని కింది మనుష్యుల సుఖదుఃఖాల
కథల నుండి కదిలి
తిరిగి తన ప్రయాణాన్ని కొనసాగించాడు.

■ భగవంతం



నకిలీ నవ్వు

చిన్నప్పుడు నాన్న
ఇంటినొదిలి వేరే ఊరికి
రెండు నెలల పాటు
హమాలి పనికెళ్ళినప్పుడు
హోరు వర్షంలో
ఇంటి ఇనుపరేకులెక్కడ
ఎగిరిపోతాయోనని
మంచం కింద దాక్కున్నప్పుడే
నా లేలేత నవ్వు నరికేయబడింది

నాలుగో తరగతిలో
హాస్టల్ నుండి బాసర లోని
శ్రీజ్ఞాన సరస్వతీదేవిని
దర్శించడానికెళ్ళినప్పుడు
అక్కడి పెన్ను పుస్తకాలను తీసుకుంటే
చదువు బాగొస్తుందని
కొనుక్కొచ్చామని స్నేహితులందరు
ఆటోలో మాట్లాడుకుంటుంటే
రిక్త హస్తాలతో ఉన్న నాకు
చదువు రాదని
నవ్వుతున్న వాళ్ళ మొహాలు
నా నవ్వును
అయస్కాంతంలా లాక్కున్నాయి

ఇల్లు కట్టినప్పుడు
పది సంవత్సరాలుగా పెంచుతున్న
మేకలన్నింటినీ అమ్మినా కూడా
అప్పులైనందుకు
మా తండానొదిలి
కట్టిన ఇల్లునొదిలి
పిస్నివాళ్ళ తండాకు
వలసెళ్ళినప్పుడు
నా నవ్వు మా తండా లోనే
ఉండిపోయింది

నచ్చిన అంగీని
షాపు లోనే వదిలేసొచ్చినప్పుడు
నా నవ్వు ఆ తెల్లని అంగీ లోనే
మెరుపైపోయింది

ఇంటరైనా ప్రైవేటు కాలేజీలో చదవాలని
ఎండకాలమంతా మేస్త్రి పనికెళ్ళి
సంపాదించిన పైసలన్నింటినీ
కాలేజీలో ఫీజు కట్టినప్పుడు
నా నవ్వు ఫీజు కౌంటర్
దగ్గరే ఉరేసుకుంది

మిత్రుల దగ్గర అప్పులు చేసి
నచ్చిన పుస్తకాలను తీసుకుంటున్నప్పుడు
షాపులో నాకేసి చూస్తున్న పుస్తకాలను
వదిలేసొచ్చినప్పుడు
వాటిని తీస్కొళ్ళేంత వరకు
నా నవ్వును బయానాగా
ఇచ్చేస్తుంటాను

బాధ్యతలు
నచ్చిన చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టించి
వేరే ఉద్యోగం కోసం ప్రయత్నించటానికి
బలవంతం చేసినప్పుడు
నా నవ్వు పూర్తిగా కాల్చివేయబడింది

మొహమ్మీద
నవ్వును అతికించడానికి
ప్రయత్నించినప్పుడల్లా
పదేపదే విఫలమవుతుంటాను
నకిలీ నవ్వేమో?
ఎంత ప్రయత్నించినా
అధిక సమయంపాటు
అతకబడటం లేదు

■ జాధవ్ అంబదాస్

✆ 94902 31380

శ్రీపతి కథలపై ప్రసంగం

రాజాం రచయితల వేదిక 125వ సమావేశం జూన్ 22 ఉ.10 గంటలకు విజయనగరం జిల్లా, రాజాం పట్టణంలోని శ్రీవిద్యానికేతన్ స్కూల్లో జరుగుతుంది. ఆల్తి మోహనరావు అధ్యక్షతన జరిగే ఈ సభలో 'శ్రీపతి కథలు – ఒక పరిశీలన' అనే అంశంపై రాజాపు శాంతారావు ప్రసంగిస్తారు. వివరాలకు: 7095184846.

పిల్లా తిరుపతిరావు,

దాశరథి, ఆరుద్రలపై సదస్సు


ఎస్ఆర్ & బిజిఎన్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, ఖమ్మం ఆధ్వర్యంలో 'శతజయంతి సాహితీ మూర్తులు – దాశరథి, ఆరుద్ర జీవితం, సాహిత్యం' అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు జూన్ 20, 21 తేదీల్లో కళాశాల సెమినార్ హాల్‌లో జరుగుతుంది. ఇందులో తెలుగు రాష్ట్రాల నుంచి వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు, డిగ్రీ కాలేజీల అధ్యాపకులు70కి పైగా పరిశోధనా పత్రాలను సమర్పిస్తారు. వివరాలకు: 9290403605.

పి. రవికుమార్

తెరేష్ బాబు స్మారక సంచిక

దళిత కవి, కథకుడు, కళాకారుడు పైడి తెరేష్ బాబు స్మారక సంచిక వెలువరిస్తున్న నేపథ్యంలో తెరేష్ బాబు గురించిన వ్యాసాలు, కవితలు, జ్ఞాపకాలు లేదా మరేదైనా రచనలు జూన్ నెలాఖరులోగా పంపించవలసిందిగా మల్లెతీగ సాహిత్య సేవాసంస్థ ఆహ్వానిస్తోంది. సాహితీవేత్తలు జి.వి.రత్నాకర్, పి. శ్రీనివాస్ గౌడ్ దీనికి సంపాదకత్వం వహిస్తారు. 70135 07228, 99494 29449 నెంబర్లకు వాట్సప్‌లో గాని లేదా srinivasgoudpoet@gmail.comకు ఈమెయిల్ గాని చేయవచ్చు. వివరాలకు: 99494 29449.

కలిమిశ్రీ



ట్రాఫిక్ ఉల్లంఘనులకు క్లిక్‌తో చెక్!

నగరంలో రెడ్‌లైట్ వైలేషన్ డిటెక్షన్ కెమెరాల ఏర్పాటు

ట్రాఫిక్ ఉల్లంఘిస్తే ఫొటోలు తీస్తున్న సాంకేతిక వ్యవస్థ

వాహనదారుడి సెల్‌కు ఫొటో, జరిమానా సమాచారం

పది రోజుల్లో 751 కేసులు నమోదు.. రూ.7.85 లక్షల జరిమానా

● రాధా నగర్‌కు చెందిన రామరాజు బైక్‌పై ఫోన్ మాట్లాడుకుంటూ వెళ్తున్నాడు. ఆయన వెళ్లిన మార్గంలో ట్రాఫిక్ పోలీసులు ఎవరూ లేకపోవడంతో అలా మాట్లాడుకుంటూనే ఇంటికి చేరుకున్నాడు. సరిగ్గా బైక్‌కు స్టాండ్ వేసి ఇంట్లోకి వెళ్లగానే ఆయన ఫోన్‌కు మెసేజ్ నోటిఫికేషన్ వెళ్లింది. ఇది చూడగానే రామరాజు షాక్ అయ్యాడు.

● కృష్ణలంకకు చెందిన కిరణ్ హెల్మెట్ లేకుండా ఓ ఆదివారం తెగ తిరిగాడు. ట్రాఫిక్ పోలీసులు చూసినా అతడిని ఆపకపోవడంతో హెల్మెట్ డ్రైవ్‌ను ఆపేశారనుకున్నాడు. తీరా ఇంటికి వెళ్లిన తర్వాత రూ.1,100 జరిమానా విధించినట్టు సెల్‌ఫోన్‌కు సందేశం వచ్చింది. దీంతో నిర్ఘాంతపోయాడు. ఇలా ట్రాఫిక్ ఉల్లంఘనులకు పాల్పడే వారికి సాంకేతికతను ఉపయోగిం చుకుని పోలీసులు విధిస్తున్న జరిమానాలు నగర వాసులను అప్రమత్తం చేస్తున్నాయి. ట్రాఫిక్ నిబంధనలు పాటించేందుకు దోహదపడుతున్నాయి.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ): విజయవాడలో ట్రాఫిక్ పోలీసులు నెమ్మదిగా స్టైల్ మార్చుతున్నారు. ట్రాఫిక్ ఉల్లంఘనులకు విధించే జరిమానాలకు సాంకేతికతను జోడిస్తున్నారు. వీలైనంత వరకు జరిమానాలను నాన్ కాంటాక్ట్ విధానంలో విధించాలని భావిస్తున్నారు. ఇందుకోసం నగరంలో ఇటీవల కొత్తగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలకు పని చెబుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు అనుసరిస్తున్న వ్యూహం వాహనదారులకు అంతుబట్టడం లేదు. ఎక్కడా ఆపకుండా, ప్రశ్నించకుండా నేరుగా సెల్‌ఫోన్లకు జరిమానాలు పంపి వాహనదారులకు ఝలక్ ఇస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు నిర్వహిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో నిత్యం ఏదో ఒక వివాదం జరుగుతోంది. జరిమానాలు విధించిన తర్వాత వెంటనే చెల్లించాలని పోలీసులు చెప్పడం, తమ వద్ద అంత డబ్బులు లేవని వాహనదారులు వాదనలకు దిగడం ఒక పెద్ద తలనొప్పిగా మారుతోంది. ఒక వాహనదారుడు ట్రాఫిక్ పోలీసులపై ఎదురు తిరిగే సరికి దాన్ని చూసి మిగిలిన వాహనదారులు ఎదురు తిరుగుతున్నారు. దీనితో పోలీసులు ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను ఆపేస్తున్నారు. పోలీస్ కమిషనర్ నిత్యం ఉదయం పూట అధికారులతో సెల్‌కాన్ఫరెన్స్ నిర్వహిస్తుంటారు. క్షేత్రస్థాయిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహిస్తున్న సమయంలో ఎదురవుతున్న సవాళ్లను ట్రాఫిక్ పోలీసులు వివరించారు. దీంతో కాంటాక్ట్ విధానం(పోలీసులు నిర్వహించే తనిఖీలు)లో ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహిస్తున్నా సాంకేతికతను జోడించి జరిమానాలు విధించాలని నిర్ణయించారు.



ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడంతో సీసీ కెమెరా తీసిన చిత్రం

ఇంకా మార్పు రావాలి

▸ ఏవీఎల్ ప్రసన్నకుమార్, ట్రాఫిక్ అదనపు డీసీపీ

నగరంలో పోలీసులు నిర్వహిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ వల్ల వాహనదారుల్లో చాలా వరకు మార్పు వచ్చింది. 90శాతం మంది ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తున్నారు. ముఖ్యంగా హెల్మెట్‌ను ధరిస్తున్నారు. ఇంకా సెల్‌ఫోన్ డ్రైవింగ్, స్టాప్‌లైన్ ఉల్లంఘనలు చేస్తున్నారు. ఈ రెండు నిబంధనలను వాహనదారులు పాటించేలా మార్పు రావాల్సిన అవసరం ఉంది. ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కార్లు, ఇతర వాహనాలను నడిపే వారు నంబర్ ప్లేట్ కనపడకుండా నిమ్మకాయలు కడుతున్నారు. కొంతమంది పోస్టర్లు అడ్డు పెడుతున్నారు. కొంతమంది నంబర్ ప్లేట్‌లను ఇష్టం వచ్చినట్టు ఏర్పాటు చేసుకుంటున్నారు. బోర్డు కొన్ని అక్షరాలను చిన్నవిగా, కొన్ని పెద్దవిగా ఉంటున్నాయి. ఇలాంటి ఉల్లంఘనలను ఉపేక్షించం.

ఆర్ఎల్‌వీడీలతో వాదనలకు చెక్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విజయవాడలో సేఫ్టీ ప్రాజెక్టును పోలీస్ అధికారులు పట్టాలు ఎక్కించారు. ప్రభుత్వం నిధులపై ఆధారపడకుండా దాతల విరాళాలతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా నగరంలోని కొన్ని కూడళ్లలో ఆర్ఎల్‌వీడీ(రెడ్‌లైట్ వైలేషన్ డిటెక్షన్) కెమెరాలను మిగతా 6లో..



స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యేలు బొండా, యార్లగడ్డ, మండలి, కలెక్టర్ లక్ష్మీశ

గలగలా కృష్ణమ్మ

కృష్ణాడెల్టాకు 1,000 క్యూసెక్కుల నీరు విడుదల

▸ తొలుత శాస్త్రోక్తంగా కృష్ణమ్మకు పూజలు

▸ హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

▸ హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

పంటల సాగుకు సమయం ఆసన్నమైంది. రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం సాగు ప్రణాళికలో భాగంగా కాల్వలకు నీటిని విడుదల చేసింది. బందరు కాల్వకు 300 క్యూసెక్కులు, రైవస్ కాల్వకు 700 క్యూసెక్కుల చొప్పున మొత్తం 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విజయవాడ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): విజయవాడ, కృష్ణాజిల్లాలోని ప్రజాప్రనిధులు, ప్రాజెక్టు కమిటీల చైర్మన్లు ఆదివారం కృష్ణా డెల్టాలో పంటల సాగుకు అవసరమైన నీటిని కేఈబీ చానల్ ద్వారా విడుదల చేశారు. సాగు నీటి సలహా మండలి సమావేశంలో ఈ నెల పదో తేదీన నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు. సాగుకు రైతులు సన్నద్ధం కాకపోవడంతో నీటి విడుదలను వాయిదా వేశారు. కాల్వలకు అవసరమైన నీటిని బ్యారేజ్ నుంచి దిగువకు విడుదల చేశారు. కృష్ణా తూర్పు హెడ్ రెగ్యులేటర్ వద్ద కృష్ణమ్మకు పూజలు చేశారు. అనంతరం బందరు కాల్వకు 300 క్యూసెక్కులు, రైవస్ కాల్వకు 700 క్యూసెక్కులు చొప్పున మొత్తం 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ, ఎన్ఎస్ఆర్ ప్రాజెక్టు కమిటీ మిగతా 6లో..

సరిహద్దుల్లో కిక్

పెనమలూరు కేంద్రంగా గ్యాంగ్‌లు

▸ జిల్లా సరిహద్దుల్లో ఉంటూ వ్యవహారాలు

▸ వరుసగా సీటీఎఫ్‌కు చిక్కుతున్న నిందితులు

▸ గంజాయి కేసుల్లో ఇద్దరు, ముగ్గురు ఆ మండలం వారే



(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

● బిక్కి. నరేంద్ర... కానూరు కేంద్రంగా మణికంఠ కన్‌స్ట్రక్షన్స్ పేరుతో కార్యాలయాన్ని ప్రారంభించాడు. కొంతమందిని అందులో పనిచేసే సిబ్బందిగా చూపించి ఒడిసా సరిహద్దుల నుంచి గంజాయిని రప్పించేవాడు. కార్యాలయం పై అంతస్తులో గంజాయిని నిల్వ ఉంచి బెంగళూరుకు సరఫరా చేస్తున్నాడు. అతడితోపాటు మరో నలుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారిలో ఇద్దరు పెనమలూరు మండలం పోరంకి, యనమలకుదురు గ్రామానికి చెందిన వారే. కొద్దిరోజుల క్రితం జరిగిన ఘటన ఇది.

● పెనమలూరు మండలం సనత్‌నగర్‌కు చెందిన తిరుమలశెట్టి జీవన్‌కుమార్ అలియాస్ కిన్ను బీటెక్ చదువుకుని ఖాళీ మిగతా 6లో..



గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, ఏఎంసీ చైర్మన్ నర్రా వాసు, బొమ్మసాని సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. 6లో

భారీ గుంత



బందరు రోడ్డుపై బీసెంట్ రోడ్డు వద్ద ఆదివారం ఒక్కసారిగా మూడు అడుగుల లోతు గుంత పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

అంబారుపేట-ఐతవరం బైపాస్!

హైదరాబాద్-విజయవాడ ఎన్‌హెచ్-65 విస్తరణలో..

▸ 12 కిలోమీటర్ల నూతన బైపాస్‌కు ప్రతిపాదన

▸ అంతర్భాగంగా మునేరు బ్రిడ్జి రీ అలైన్‌మెంట్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): హైదరాబాద్ - విజయవాడ ఎన్‌హెచ్ - 65 ఆరు వరసల విస్తరణలో భాగంగా ఎన్టీఆర్ జిల్లాలో సరికొత్త బైపాస్‌కు ఎన్‌హెచ్ తెలంగాణ అధికారులు ప్రతిపాదించారు. జిల్లాలో అంబారుపేట - ఐతవరం బైపాస్‌ను తెరపైకి తెచ్చారు. ఈ బైపాస్‌తో పాటుగా మునేరు నది బ్రిడ్జి రీ అలైన్‌మెంట్‌కు కూడా ప్రతిపాదించారు. ఈ నూతన బైపాస్‌కు ఎన్‌హెచ్ అధికారులు మూడు ప్రతిపాదనలు చేశారు. ఆప్షన్-1లో అంబారుపేటపై నుంచి కృష్ణానదికి సమీపిస్తూ కీసరవైపు తిరుగుతుంది. ఆప్షన్ - 2లో అంబారుపేట, ఐతవరం గ్రామాల దిగువన మున్నేరు మీద కొత్తగా ఆరులేన్ల బ్రిడ్జి నిర్మాణంతో కీసర ఎగువ ప్రాంతం వరకు తీసుకువెళతారు. ఆప్షన్ - 3లో అంబారుపేట, ఐతవరం గ్రామాలకు అత్యంత సమీపంగా కీసర వైపు తిరుగుతుంది. ఆప్షన్ - 1 అలైన్‌మెంట్‌లో 12.13 కిలోమీటర్లు, ఆప్షన్ - 2 అలైన్‌మెంట్‌లో 12 కిలోమీటర్లు, ఆప్షన్ - 3 అలైన్‌మెంట్‌లో 12.08 కిలోమీటర్ల ప్రతిపాదిత నూతన బైపాస్ వస్తుంది. ఆప్షన్-1, 2లు ప్రతిపాదిత నూతన బైపాస్ అలైన్‌మెంట్‌కు అనువుగా ఉన్నాయని సమాచారం. ఆప్షన్ - 1 అయితే రెండు వెహికల్ అండర్ పాస్‌లు, ఒక మేజర్ బ్రిడ్జి, రెండు లైట్ వెహికల్ అండర్ పాస్‌లు, నాలుగు ఎస్‌వీయూపీలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీనికి 54.78 హెక్టార్ల భూములను సేకరిస్తే సరిపోతుంది. అదే ఆప్షన్ - 2లో అయితే రెండు వెహికల్ అండర్ పాస్‌లు, ఒక మేజర్ బ్రిడ్జి, రెండు బ్రిడ్జి కమ్ అండర్ పాస్‌లు, మూడు ఎల్‌వీయూపీఎస్, మూడు ఎస్‌వీయూపీలు నిర్మించాల్సి ఉంటుంది. 71.91 హెక్టార్ల భూములు అవసరమవుతాయి.



దుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు

ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కనక దుర్గమ్మ దర్శనానికి ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పొంగళ్లు సమర్పించారు. వివిధ ఆర్జిత సేవల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అధికారులు, సిబ్బంది ముందస్తు ప్రణాళిక ప్రకారం క్యూలైన్లలో భక్తులను నియంత్రించారు.



క్లోక్ రూమ్ వద్ద భక్తుల రద్దీని క్రమబద్ధీకరిస్తున్న ఈవో

ఉదయం 6 గంటల నుంచే దర్శనం క్యూలైన్లు రద్దీగా మారాయి. భక్తుల రద్దీ రీత్యా ఉదయం 10 నుంచి అంతరాలయ దర్శనం, రూ.500లు దర్శనం టిక్కెట్ల అమ్మకాలు నిలుపుదల చేయాలని ఈవో వీకే శీనానాయక్ ఆదేశించారు. కొండపైన క్లోక్ రూమ్, మొబైల్ ఫోన్ భద్రపరిచే చోట భక్తులు పెద్ద సంఖ్యలో ఉండటంతో ఈవో రద్దీ నియంత్రణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వెంటనే సెక్యూరిటీ సిబ్బందిని పంపి తొక్కిసలాట లేకుండా క్రమబద్ధీకరించారు. క్లోక్ రూమ్ కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేయాలని ఈవో ఆదేశించారు. వీఐపీ దర్శనం మధ్యాహ్నం వరకు లేదని మైక్ ప్రచారం చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈవో ప్రధాన ఆలయం నుండి దుర్గాఘాట్ వరకు క్యూలైన్లు, క్లోక్ రూమ్, చెప్పుల స్టాండ్, సెల్ ఫోన్ డిపాజిట్ కౌంటర్‌లను పరిశీలించారు. కేశఖండనశాల బయట ప్రదేశం, దుర్గాఘాట్‌లోని సబ్‌వేను పరిశీలించారు. భక్తుల రద్దీని పురస్కరించుకుని తాగునీరు, అన్నప్రసాదం సత్వరం అందేలా దేవస్థానం అధికారులు తగు చర్యలు తీసుకున్నారు.



బీఆర్టీఎస్ రోడ్డుపై యోగాసనాలు వేస్తున్న అధికారులు, మహిళలు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

సత్యనారాయణపురం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : సరళ యోగాసనాల అభ్యసన ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చునని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. యోగాంధ్ర మహోత్సవాలలో భాగంగా బీఆర్టీఎస్ రోడ్డులో ఆదివారం ఐసీడీఎస్, మత్స్యశాఖ అధికారులతో కలిసి కలెక్టర్ యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 45 నిమిషాల సరళ యోగాసనాలతో బీపీ, మధుమేహం, ఒత్తిడి, హార్మోన్ల అసమతుల్యం వంటి సమస్యలకు చెక్ పెట్టవచ్చునన్నారు. రోజులో కొంత సమయం యోగాకు కేటాయించాలన్నారు. ప్రతీ ఆసనంతో ప్రత్యేక ప్రయోజనాలు ఉన్నాయని, ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ డి.శ్రీలక్ష్మి, మత్స్యశాఖ డీడీ చక్రపాణి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, డాక్టర్ జె.సుమన్, ఆయుష్‌అధికారులు, మత్స్యశాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



యోగా ప్రాముఖ్యతను వివరిస్తున్న మంతెన సత్యనారాయణ రాజు

ఆరోగ్యాలయంలో యోగాంధ్ర

» యోగాసనాలతో ఆకట్టుకున్న నేచురోపతి విద్యార్థులు

విజయవాడ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : నిస్వార్థంగా, నిర్విరామంగా చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్న సుమారు 1000 మందికి ఉద్యోగాలు కల్పించి, లక్షల మందికి ఆరోగ్యాన్ని అందిస్తున్న మంచి మనసున్న వ్యక్తి మంతెన సత్యనారాయణ రాజు అని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ కొనియాడారు. మంతెన సత్యనారాయణ రాజు ఆరోగ్యాలయంలో ఈ నెల 9 నుంచి 15 వరకు నిర్వహించిన 'యోగ సమావేశ్' నిర్వహించారు. చివరి రోజైన ఆదివారం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేశ ప్రధాని నరేంద్ర మోదీ తలపెట్టిన యోగ కార్యక్రమాన్ని ప్రతిరోజు ప్రతి వ్యక్తి సాధన చేయాలన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ పి.కృష్ణయ్య మాట్లాడుతూ, యోగా వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం పొందవచ్చన్నారు. రాష్ట్రాన్ని కాలుష్య రహితంగా ఉంచాలని, అందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు. గోకరాజు గంగరాజు మాట్లాడుతూ, నిత్యం యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతతో పాటు భావోద్వేగాన్ని నియంత్రివచ్చన్నారు. యోగా శారీరక ఆరోగ్యాన్ని పరిరక్షించడంతో పాటు అంతర్లీన శాంతిని పెంపొందించడం, సంపూర్ణ ఆనందాన్ని ఆస్వాదించడంలో కీలక పాత్ర పోషిస్తుందని మంతెన సత్యనారాయణ రాజు అన్నారు. జీవితంలో యోగా ప్రధాన్యతను వివరించారు. అనంతరం ఆరోగ్యాలయ డాక్టర్ల బృందం, కేర్ కాలేజీ నేచురోపతి వైద్య విద్యార్థులు యోగా విన్యాసాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంఎస్ఆర్‌పి సూపరింటెండెంట్ బైరి శ్రీనివాస్, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సంఘంపై చేస్తున్న ఆరోపణలు నిరాధారం

» ఏపీ హంస అధ్యక్షుడు అరవ పాల్

గాంధీనగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : తమ సంఘంపై చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని, దానిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీ హంస) రాష్ట్ర అధ్యక్షుడు అరవ పాల్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తమ సంఘం ప్రభుత్వ గుర్తింపు పొంది వైద్యాధికారి కంటే తక్కువ స్థాయిలోని ప్రభుత్వ వైద్య, ఆరోగ్యశాఖ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. జీవో 264 ప్రకారం చట్టబద్ధంగా అన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు స్పష్టం చేశారు. సంఘం నమోదు, గవర్నింగ్ బాడీ ఎన్నికలు, సభ్యత్వాలు అన్ని క్రమబద్ధంగా జరిగాయన్నారు. తమపై వచ్చిన ఆరోపణలపై విచారణకు పూర్తిగా సహకరిస్తామని చెప్పారు. సంఘం కార్యకలాపాలను యధావిధిగా కొనసాగించేందుకు అనుమతించాలని అధికారులను ఆ ప్రకటనలో కోరారు.

జగన్ భూతాన్ని భూస్థాపితం చేయాలి

» మంత్రి కొలుసు పార్థసారథి

» విజయవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నర్రా వాసు ప్రమాణ స్వీకారం



సభలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి, వేదికపై నర్రా వాసు, ఎమ్మెల్యే వసంత, నెట్టెం రఘురాం, కనకమేడల

గొల్లపూడి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : 2029లోనూ ఎన్డీఏ కూటమికి అధికారమే లక్ష్యంగా కూటమి కుటుంబసభ్యులందరూ ఐకమత్యంగా ఉండి జగన్మోహన్ రెడ్డి అనే భూతాన్ని శాశ్వతంగా భూస్థాపితం చేయాలని మంత్రి కొలుసు పార్థసారథి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. విజయవాడ వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్మన్‌గా నర్రా వాసు, పాలకవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమం ఆదివారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా సభలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వంలో మూడు రాజధానులను తాను, ఎమ్మెల్యే వసంత ధైర్యంగా వ్యతిరేకించామని గుర్తుచేశారు. మరో ముఖ్యఅతిథి, మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ మాట్లాడుతూ, దార్శనికుడు చంద్రబాబు లాంటి వ్యక్తి రాష్ట్రానికి ఎంతో అవసరం అన్నారు. ఎమ్మెల్యే వసంత మాట్లాడుతూ, నర్రా వాసు నిబద్ధతతో పార్టీ బలోపేతానికి పడిన కష్టానికితగ్గ ఫలితం దక్కిందన్నారు. తొలుత ఒన్ సెంటర్ నుంచి ఏఎంసీ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు శ్రీరామ్ రాజగోపాల్, గద్దె రామ్మోహన్, డీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురాం, నాగుల్ మీరా, కోనేరు శ్రీధర్, బొమ్మసాని సుబ్బారావు, గూడపాటి పద్మశేఖర్, కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నర్రా వాసును బొర్రా రాజేంద్రప్రసాద్, బొర్రా వెంకటేశ్వరరావు (చిన్న), చిట్టినేని వెంకటేశ్వరరావు, శాఖమూరి గోపికృష్ణ, ఆలూరి చిన్న, వీరమాచనేని క్రాంతి కుమార్, పొన్నం శ్రీనివాసరావు (భీముడు), దాసరి హరికృష్ణ, పాటిబండ్ల జగదీష్, చిగురుపాటి నాగరాజు, అజ్జరపు సాయి, నూతలపాటి రఘు, నర్రా వాసు ఫ్రెండ్స్ సర్కిల్ తదితరులు అభినందించారు.



సాయి ఆలయంలో పూజలు

ఇబ్రహీంపట్నం : ఏఎంసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టేందుకు వెళుతున్న నర్రా వాసు సతీసమేతంగా సాయిపురం కాలనీలోని సాయిబాబా మందిరంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ కేశినేని శివనాథ్

విద్యాధరపురం : విజయవాడ మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన నర్రా వాసుకు, కమిటీ డైరెక్టర్లకు విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) ఆదివారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు.

తరాలకు వారధులు.. భవిష్యత్ నిర్మాతలు..

వృద్ధుల అనుభవం వెలకట్టలేనిది

» ఆత్మీయతను పంచి గౌరవంగా జీవించేలా ఊతమిద్దాం

» వయోవృద్ధుల హక్కుల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి

» వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాకారానికి తోడ్పాటునందించాలి

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న వయోవృద్ధుల సంక్షేమ సంఘం సభ్యులు

కలెక్టరేట్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : తరాలకు వారధులుగా, భవిష్యత్తుకు నిర్మాతలుగా ఉన్న వయోవృద్ధులకు ఆత్మీయతను పంచి సమాజంలో గౌరవంగా జీవించేలా ప్రతిఒక్కరూ సహానుభూతితో వ్యవహరించాలని, నైతిక విలువల పరంపర కొనసాగేలా చూడాల్సిన అవసరముందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. 'ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినం' సందర్భంగా ఆదివారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో లక్ష్మీశ పాల్గొని మాట్లాడారు. వయోవృద్ధుల హక్కుల పరిరక్షణకు డివిజనల్, జిల్లాస్థాయిలో ప్రత్యేకంగా దృష్టిసారించడం జరుగుతోందని, ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి కృషిచేస్తున్నామన్నారు. వృద్ధుల అనుభవం వెలకట్టలేని అమూల్య సంపద అని, వారిని మనం ఇప్పుడు ఎలా చూస్తామో భవిష్యత్తులో మన పిల్లలు మనల్ని అలానే చూస్తారన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. వృద్ధులు ఆరోగ్యంగా, సుసంపన్నంగా, ఆనందంగా వున్నప్పుడే స్వర్ణాంధ్ర సాకారమవుతుందన్నారు. స్విట్జర్లాండ్ తరహాలో వృద్ధులకు సేవ చేసి క్రెడిట్స్ పోగేసుకొని అవసరమైనప్పుడు తిరిగి ఉపయోగించుకొనే టైమ్‌బ్యాంక్ విధానాన్ని జిల్లాలో అమలుచేసేందుకు చర్యలు తీసుకోనున్నట్టు వెల్లడించారు. వయోవృద్ధులు చెప్పే చిన్న విషయమే జీవితానికి ఓ గొప్ప పాఠమన్నారు. వృద్ధాశ్రమాలకు అవసరమైన సహాయసహకారాలు అందించేందుకు చొరవచూపనున్నట్టు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాకారానికి వయోవృద్ధులు తోడ్పాటునందించాలని విజ్ఞప్తి చేశారు. పీజీఆర్ఎస్ తరహాలో వృద్ధుల సమస్యల పరిష్కారానికి నెలలో ఒకరోజు ప్రత్యేకంగా అర్జీలు స్వీకరించనున్నట్టు కలెక్టర్ తెలిపారు. సీనియర్ సిటిజన్స్ స్టేట్‌కౌన్సిల్ కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, వృద్ధులకు భరోసా కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం రూ.4 వేల వృద్ధాప్య పెన్షన్ అందిస్తోందని, జిల్లాలోనూ సీనియర్ సిటిజన్స్ సమస్యల పరిష్కారానికి కలెక్టర్ లక్ష్మీశ నిబద్ధతతో కృషిచేస్తున్నారని అన్నారు. నేరగాళ్లకు, మోసగాళ్లకు మొదటి టార్గెట్ వృద్ధులేనని, ఈ నేపథ్యంలో సైబర్ మోసాలు వంటి వాటిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ బి.కీర్తి మాట్లాడుతూ, తరాల మధ్య అనుబంధం పెరగాలని, మేక్ ఏ డిఫరెన్స్ తరహాలో సీనియర్ సిటిజన్స్‌తో చిన్నారులు, యువతకు అనుభవ పాఠాలు మంచి మార్పునకు తోడ్పడతాయన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, ఎన్టీఆర్ జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వేమూరు బాబూరావు, జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు వి.కామరాజు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు హాజరయ్యారు.

గలగలా కృష్ణమ్మ

(5వ పేజీ తరువాయి)

ఉపాధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాల కృష్ణారావు, కృష్ణా తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేశ్, జలవనరుల శాఖ ఈఎన్‌సీ కె.నరసింహమూర్తి, సీఈ పి.రాంబాబు, ఎస్ఈ ఆర్.మోహనరావు, ఈఈలు రావెళ్ల రవికిరణ్, బి.ఆంజనేయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాడెల్టాపై ప్రత్యేక దృష్టి

-బొండా ఉమామహేశ్వరరావు, సెంట్రల్ ఎమ్మెల్యే

ప్రభుత్వం కృష్ణాడెల్టాపై ప్రత్యేక దృష్టి పెట్టింది. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడల్లా డెల్టాకు సకాలంలో నీటిని విడుదల చేసేది. గడచిన ప్రభుత్వ హయాంలో నీటి విడుదల కోసం రైతులు పోరాటాలు చేయాల్సి వచ్చింది. ఇప్పుడు సాగు ప్రణాళిక విడుదల చేస్తున్నాం. డెల్టాకు నీటి విడుదల వల్ల 7.40 లక్షల ఎకరాల ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించడంతోపాటు ఎరువులు, విత్తనాలు సకాలంలో అందిస్తున్నాం. పండిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నాం. అన్ని రకాలుగా రైతులను ఆదుకుంటున్నాం. గత ప్రభుత్వంలో ధాన్యం సేకరణ అస్తవ్యస్తంగా ఉండి సకాలంలో రైతులకు డబ్బులు అందక రైతులు ఇబ్బందిపడేవారు. ఇప్పుడు పక్కా ప్రణాళికతో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ధాన్యం సేకరణ జరిపి సకాలంలో రైతు ఖాతాలకు జమ చేస్తున్నాం. భవిష్యత్తులోనూ షెడ్యూల్ ప్రకారం నీటిని విడుదల చేసి కృష్ణాడెల్టా రైతులకు అండగా ఉంటాం.

కాల్వగట్లను పట్టించుకోలేదు

-యార్లగడ్డ వెంకట్రావు, గన్నవరం ఎమ్మెల్యే

వైసీపీ ప్రభుత్వం కాల్వల్లో గుర్రపు డెక్క, తూటుకాడ తొలగించకపోవడంతో గట్లకు గండ్లు పడ్డాయి. దాని ఫలితంగానే బుడమేరుకు వరద వచ్చింది. ఆ ప్రభుత్వంలో ఖరీఫ్, రబీ పంటలకు సకాలంలో సాగునీరు అందించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. పదో తేదీనే కాల్వలకు నీటిని విడుదల చేయాలని నీటి పారుదల సలహా మండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్నాం. సాగుకు రైతులు సిద్ధంగా లేకపోవడంతో ఇప్పుడు విడుదల చేస్తున్నాం. రైతులకు సకాలంలో నీరు అందించి వారి సంక్షేమానికి చేస్తున్నాం.

నీటి విడుదలకు పోరాటాలు చేయాల్సి వచ్చేది

-మండలి బుద్ధప్రసాద్, అవనిగడ్డ ఎమ్మెల్యే

వైసీపీ ప్రభుత్వ హయాంలో నీటి విడుదల కోసం పోరాటాలు చేయాల్సి వచ్చేది. అవనిగడ్డ కృష్ణాడెల్టాలో ఆఖరి నియోజకవర్గం. కొద్దిపాటి వర్షానికే పంటలు ముంపులో ఉండేవి. ఆ పరిస్థితి నుంచి ముందుగానే ఖరీఫ్ పంటకు సాగునీరును అందిస్తున్నాం. వైసీపీ హయాంలో జలవనరుల శాఖకు నిధులను విడుదల చేయలేదు. దీనితో కాల్వల్లో తూటుకాడ, గుర్రపు డెక్కతో నిండిపోయాయి. కొద్దిపాటి వర్షానికి పంట పొలాలు మునిగి రైతులు నష్టపోయేవారు. ఇప్పుడు కాల్వలకు మరమ్మతులు చేపట్టి రైతులకు సకాలంలో సాగునీరు అందిస్తున్నాం.

సరిహద్దుల్లో కిక్

(5వ పేజీ తరువాయి)

ఉంటున్నాడు. స్నేహితుడు మనోహర్ ద్వారా ఢిల్లీ నుంచి ఎండీఎంఏ డ్రగ్‌ను హైదరాబాద్‌కు పార్సిల్ సర్వీసు తెప్పించుకుని అక్కడి నుంచి విజయవాడకు తీసుకొచ్చేవాడు. ఇలా కొద్దిరోజుల క్రితం ఎండీఎంఏ తీసుకొస్తుండగా జీవన్‌తోపాటు మరో ఇద్దరిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వారిలో బొంతు నితీష్‌కుమార్ అనే యువకుడు విజయవాడ ఫన్‌టైం క్లబ్ వీధికి చెందినవాడు. మరో నిందితుడు తరుణ్‌ప్రసాద్ యనమలకుదురు గ్రామానికి చెందిన వాడు. కొద్దిరోజుల క్రితం పటమట పోలీసులు నమోదు చేసిన కేసు ఇది. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ సరిహద్దుల్లో మత్తు గ్యాంగ్‌లు పెరుగుతున్నాయి. ముఖ్యంగా తూర్పు భాగంలో ఈ గ్యాంగ్‌ల సంచారం, కొత్త గ్యాంగ్‌ల ఏర్పాటు ఎక్కువగా ఉంది. వాస్తవానికి కమిషనరేట్‌కు పశ్చిమ వైపున తెలంగాణ సరిహద్దుగా ఉంది. ఉత్తరం వైపున గుంటూరు జిల్లా సరిహద్దుగా ఉంది. ఈ రెండింటితో లేని బెంగ ఎక్కువగా తూర్పు వైపు సరిహద్దుతో ఉంటోంది. కమిషనరేట్‌కు పెనమలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో సరిహద్దుగా ఉంది. పటమట పోలీసు స్టేషన్ సరిహద్దులను ఆనుకుని ఈ సరిహద్దులు ఉన్నాయి. ఇది కాకుండా గూడవల్లి వైపున గన్నవరం పోలీసు స్టేషన్ పరిధి సరిహద్దు ప్రాంతంగా ఉంది. ఈ సరిహద్దులు భౌగోళికంగానే కాకుండా శాఖల పరంగా ఉంటున్నాయి. ముఖ్యంగా ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్‌కు ఈ సరిహద్దు ఒక తలనొప్పిగా మారిపోయింది. గంజాయి కేసుల్లో చిక్కుతున్న నిందితుల్లో ఎక్కువ మంది పెనమలూరు మండలానికి చెందిన వారే ఉంటున్నారు.

కూటమి ప్రభుత్వం రాకతో ప్రత్యేక బృందం ఏర్పాటు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గంజాయి, మాదక ద్రవ్యాలను అరికట్టడానికి పక్కా ప్రణాళికను రూపొందించింది. ఇందుకోసం ఈగల్ పేరుతో ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసింది. పోలీసు కమిషనరేట్ అధికారులు గంజాయితో సంబంధం ఉన్న వారి లెక్కలను పక్కాగా సేకరించారు. స్మోకర్లు చిక్కినప్పుడల్లా ఒక్కో కింగ్ పేరు వెలుగులోకి వస్తోంది. యువతకు గంజాయి ఒడిసా సరిహద్దుల నుంచి వస్తుందని నిర్ధారించారు. అక్కడి నుంచి గంజాయిని తీసుకొస్తున్న గ్యాంగ్‌లు పెనమలూరు మండలంలో తేలుతున్నాయి.

ఏడాదిలో 100 మంది అరెస్టు

ఏడాది కాలంలో గంజాయిలో కేసుల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు సుమారుగా 100 మంది నిందితులను అరెస్టు చేసినట్టు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. వారిలో 30 మంది వరకు పెనమలూరు పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన వారే కావడం గమనార్హం. విజయవాడ నగరంలోకి గంజాయి పెనమలూరు పరిధి నుంచే వస్తుందని పోలీసు కమిషనరేట్ అధికారులు ఒక నిర్ధారణకు వచ్చారు. కానూరు, యనమలకుదురు, తాడిగడప, పోరంకి ప్రాంతాల్లో స్థావరాలు ఏర్పాటు చేసుకుని విజయవాడ పరిధిలో వ్యవహారాలు సాగిస్తున్నారు. ఈ కేసుల్లో పోలీసులు ఐదుగురు నిందితులను అరెస్టు చేస్తే వారిలో ఇద్దరు, ముగ్గురు ఆ ప్రాంతానికి చెందిన వారే ఉంటున్నారు. దీనిపై పోలీసులు మల్లగుల్లాలు పడుతున్నారు.

సరిహద్దు ప్రాంతాల్లో కొరవడిన నిఘా

పెనమలూరు పోలీస్‌స్టేషన్ ఒకప్పుడు పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉండేది. గత వైసీపీ ప్రభుత్వం కొత్త జిల్లాలను లోక్‌సభ స్థానాల పరిధిని బట్టి ఏర్పాటు చేసింది. దీంతో పెనమలూరు కృష్ణాజిల్లా పరిధిలోకి వెళ్లిపోయింది. ఎన్టీఆర్ జిల్లాకు సరిహద్దులుగా ఉన్న ప్రాంతాలను పెనమలూరు పోలీసులు పెద్దగా పట్టించుకుంటున్న దాఖలాలు లేవన్న విమర్శ ఆ ప్రాంతాల్లో వినిపిస్తోంది. కానూరు, యనమలకుదురు వాస్తవానికి పెనమలూరు మండలంలో ఉన్నప్పటికీ విజయవాడలో భాగంగానే కనిపిస్తాయి. దీనితో గంజాయి మాఫియా రెచ్చిపోతోంది. పైకి రకరకాల వ్యాపారాలు చేస్తున్నట్టు కనిపించి అంతర్గతంగా గంజాయిపై ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నారు. ఈ గంజాయి సరఫరాకు నగరంలో ఉన్న స్మోకర్లను ఏజెంట్లుగా నియమించుకుంటున్నారు. కిక్‌కు కేంద్రంగా మారిన ఈ సరిహద్దు ప్రాంతాలపై ఎలాంటి నిర్ణయం తీసుకోవాలన్న యోచనలో అధికారులు ఉన్నారు.



కొండపల్లి పీఠంపై ఎవరో?

» మున్సిపల్ చైర్మన్ ఉత్కంఠకు నేటితో తెర

» తొలిసారి తమ అభ్యర్థేనని టీడీపీ ఆశాభావం

ఇబ్రహీంపట్నం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కొండపల్లి మున్సిపల్ చైర్మన్ ఎవరనేది సోమవారంతో తేలిపోనుంది. సోమవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో హైకోర్టు తీర్పు సీల్డ్ కవర్‌ను అధికారులు కౌన్సిలర్ల సమక్షంలో తెరవనున్నారు. కవర్‌లో విజేత ఎవరనేది తేలనుందా లేక టాస్ వేయాల్సిన అవసరం పడుతుందో తేలిపోనుంది. అప్పటి టీడీపీ ఎంపీ కేశినేని నాని ఎక్స్ అఫిషియో ఓటు చెల్లితే చైర్మన్‌గా టీడీపీకి చెందిన చెన్నుబోయిన చిట్టిబాబును ప్రకటిస్తారు. నాని ఓటు చెల్లుబాటు కాదు అని తీర్పులో తేలితే అటు టీడీపీ, ఇటు వైసీపీకి సమానంగా కౌన్సిలర్లు ఉన్నట్టు.. టాస్ వేసి ఎవరు చైర్మన్ అనేది ప్రకటిస్తారా లేక మరల ఎన్నిక పెడతారా వేచి చూడాలి. అయితే చైర్మన్ పీఠం తమదేనని టీడీపీ ధీమా వ్యక్తం చేస్తున్నది. ఈ పరిణామాన్ని ఎలా ఎదుర్కోవాలో వైసీపీ వ్యూహాత్మకంగా పావులు కదిపే అవకాశం లేకపోలేదు. ఈనెల 9న సీల్డ్ కవర్ ఓపెన్ చేయకుండా అనివార్య కారణాలతో వాయిదా వేస్తే టీడీపీ వాళ్లు పారిపోయారని కొండపల్లి మున్సిపల్ చైర్మన్ వైసీపీదే అని చైర్మన్ గుంజా శ్రీనివాసరావు అని, వైస్ చైర్మన్‌లు కూడా మావారే అని మాజీమంత్రి జోగి రమేశ్ మీడియా సమావేశంలో గొప్పలు చెప్పారు. పటిష్టమైన పోలీస్ బందోబస్తు మధ్య సీల్డ్ కవర్ ఓపెన్ చేయకుంటే ఫలితం వైసీపీకి వ్యతిరేకంగా వస్తే ఖచ్చితంగా వైసీపీ మూకలు అల్లర్లు చేయడం ఖాయమనే వాదన వినిపిస్తున్నది. మొత్తం మీద కొండపల్లి మున్సిపల్ చైర్మన్ ఎవరనేదికి కొన్ని గంటల్లోనే తేలిపోనుంది.

సమస్యలు పరిష్కరించండి..

» ప్రభుత్వానికి ఎనర్జీ అసిస్టెంట్ల వినతి

ధర్నాచౌక్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించాలని ఎనర్జీ అసిస్టెంట్స్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గ్రామ, వార్డు సచివాలయాలకు అనుబంధంగా పనిచేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్ల (జేఎల్ఎం గ్రేడ్-2) అసోసియేషన్ల జేఏసీ ఆధ్వర్యంలో 'ప్రభుత్వానికి వేడుకోలు' సభను స్థానిక ధర్నాచౌక్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ రాష్ట్రనేత పుల్లగుమ్మిరాజు మాట్లాడుతూ, 2019లో సచివాలయ వ్యవస్థలో భాగంగా ఎనర్జీ అసిస్టెంట్లను నియమించడం జరిగిందన్నారు. విద్యుత్ శాఖలో పనిచేస్తున్న క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 150 మంది ఎనర్జీ అసిస్టెంట్లు ప్రమాదాలకు గురై మృతి చెందారని, 250 మందికి పైగా వికలాంగులై కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటిపై విద్యుత్‌శాఖ స్పందించలేదని వాపోయారు. ఎనర్జీ అసిస్టెంట్లకు ప్రమోషన్లు కల్పించాలన్నారు. కొత్త సర్వీస్ రెగ్యులేషన్స్ పేరుతో విద్యుత్‌శాఖ యాజమాన్యాలు ఎనర్జీ అసిస్టెంట్ల జీవితాలతో ఆటలాడుతోందని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని ఎనర్జీ అసిస్టెంట్లు కోరుతున్నారు. జేఏసీ నేతలు మల్లికార్జునరెడ్డి, రాజేష్ వంక, సుధీర్, ఎనర్జీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చైతన్యం నింపే శ్రీశ్రీ కవిత్వం

» తమ్మారెడ్డి భరద్వాజకు ఎక్స్‌రే-శ్రీశ్రీ అవార్డు ప్రదానోత్సవంలో బుద్ధప్రసాద్

విజయవాడ కల్చరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : సమకాలీన సమస్యలకు దర్పణంగా, సామాన్యుల జీవితాల్లో చైతన్యం తీసుకొచ్చేలా కవిత్వం ఉండాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఎక్స్‌రే సాహిత్య సాంస్కృతిక సేవాసంస్థ ఆధ్వర్యంలో ఘంటసాల సంగీత నృత్య కళాశాల వేదికపై ఆదివారం సాయంత్రం మహాకవి శ్రీశ్రీ 42వ వర్ధంతి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ సినీ నిర్మాత, దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజకు ఎక్స్‌రే శ్రీశ్రీ అవార్డు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ శ్రీశ్రీ కవిత్వం చదువుతుంటే ఉత్సాహం, ఊపు వస్తాయని, పోరాడే శక్తిని ఇస్తుందన్నారు. తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ శ్రమజీవుల పక్షాన నిలిచి వారిని చైతన్యపరిచిన మహాకవి శ్రీశ్రీ అవార్డు తాను అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. డిప్యూటీ కలెక్టర్ కొమ్మెర్ల కృష్ణవేణి మాట్లాడుతూ లాభాపేక్ష లేకుండా మంచి సందేశాత్మక చిత్రాలను నిర్మించిన తమ్మారెడ్డి భరద్వాజ అభినందనీయులన్నారు. ఎక్స్‌రే కొల్లూరి, శ్రీశ్రీ సాహిత్య నిధి కన్వీనర్ సింగంపల్లి అశోక్ కుమార్, వాకర్స్ పూర్వపు గవర్నర్ రావి కృష్ణారావు ప్రసంగించారు. సభకు సంస్థ ప్రధాన కార్యదర్శి బోడి ఆంజనేయరాజు స్వాగతం పలకగా, చివరిగా కోశాధికారి చామర్తి వెంకట సుబ్బయ్య వందన సమర్పణ చేశారు. సభను కందికొండ రవికిరణ్, డాక్టర్ బ్రహ్మాదేశం వసంతకుమార్, గుర్రం ఏడుకొండలు, గోపు రాము, కొల్లూరి కనకవల్లి పర్యవేక్షించారు.

ప్రత్యేక రైళ్ల పొడిగింపు

విజయవాడ : హైదరాబాద్-కటక్ మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్లను మరికొన్ని రోజుల పాటు పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 07165 హైదరాబాద్-సీటీసీ రైలు ఈనెల 15, 24 తేదీల్లో, 07166 సీటీసీ- హైదరాబాద్ మధ్య నడిచే రైలు ఈనెల 18, 25 తేదీల్లో ప్రతి బుధవారం నడిచేలా పొడిగించినట్లు పేర్కొన్నారు. ఈ రైళ్లు విజయవాడ జంక్షన్‌తో పాటు రాజమండ్రి, విజయనగరం, తదితర స్టేషన్లలో ఆగుతాయని తెలిపారు.

ట్రాఫిక్ ఉల్లంఘనులకు చెక్!

(5వ పేజీ తరువాయి)

ఏర్పాటు చేశారు. బెంజ్‌సర్కిల్, డీసీపీ బంగ్లా, పీసీఆర్, పడవలరేవు సెంటర్ వివిధ కూడళ్లలో ఈ ఆర్ఎల్‌వీడీ సీసీ కెమెరాలను అమర్చారు. అన్ని సీసీ కెమెరాల మాదిరిగానే ఈ ఆర్ఎల్‌వీడీ కెమెరాలను ఆపరేషనల్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేశారు. ఈ సీసీ కెమెరాల నుంచి వచ్చే లైవ్‌ను వీక్షించడానికి ట్రాఫిక్ సిబ్బందిని ఇక్కడ నియమించారు. వీడియో వాల్‌పై లైవ్‌ను పరిశీలించి ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తున్న వారి ఫొటోలను తీస్తున్నారు. వాటి ద్వారా జరిమానాలను విధిస్తున్నారు. రెడ్ సిగ్నల్ ఉల్లంఘించిన సీసీ కెమెరాల ద్వారా హెల్మెట్ ధరించకపోయినా, ఒకే వాహనంపై ముగ్గురు ప్రయాణించినా, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపినా, సిగ్నల్ జంప్ చేసినా ఫొటోలు తీస్తున్నారు. రవాణా శాఖ డేటా పోలీసు శాఖకు అనుసంధానం కావడంతో జరిమానా విధించగానే వాహనదారుల ఫోన్ నంబర్లకు ఆ సందేశం వెళ్లిపోతుంది. పోలీసులు నిర్వహిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో ఈ చలాన్ పెండింగ్‌లో ఉందని చెప్తే వాహనదారులు ఎదురు తిరుగుతున్నారు. ఈ పరివాహన్ యాప్‌లో ఉల్లంఘనకు సంబంధించిన ఫొటోను వాహనదారులు సెల్‌ఫోన్లలోనే చూపిస్తున్నారు. దీంతో వాహనదారులకు నోటి నుంచి మాట రావడం లేదు. ఉల్లంఘన ఎక్కడ జరిగింది, ఏ సమయానికి జరిగింది, ఏ తరహా ఉల్లంఘన చేశారో వాహనం నడిపిన వ్యక్తి ఫొటోతోపాటు వాహనం నంబరు స్పష్టంగా కనిపించేలా ఫొటోలు ఉండడంతో మరోమాట లేకుండా జరిమానాలు చెల్లిస్తున్నారు. ఈ ఆర్ఎల్‌వీడీ కెమెరాల ద్వారా పది రోజుల్లో మొత్తం 751 కేసులు నమోదు చేసి రూ.7.85లక్షల జరిమానా విధించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	108,116, 127
చికెన్ విత్ స్కిన్	206
చికెన్ స్కిన్‌లెస్	216

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

కలెక్టరేట్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతులు స్వీకరించడం జరుగుతుందని కలెక్టర్ లక్ష్మీశ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారానికి పీజీఆర్ఎస్ ద్వారా అర్జీల స్వీకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మున్సిపల్, మండల కేంద్రాల్లో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అర్జీలను మీకోసం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. అర్జీల స్థితి, ఇతర సమాచారం తెలుసుకొనేందుకు 1100కు నేరుగా కాల్ చేయవచ్చన్నారు.


వల్లూరి సాంబశివరావు రోడ్డులో పేరుకుపోయిన చెత్త


బొల్లిశెట్టి వారి వీధిలో జనావాసాల మధ్య పెరిగిన పిచ్చి మొక్కలు

సమస్యల వలయంలో వివేకానంద కాలనీ

పటమట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): పలు సమస్యలతో 11వ డివిజన్‌లోని వివేకానంద కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. వల్లూరి సాంబశివరావు రోడ్డులో వ్యర్థాలు గుట్టలు, గుట్టలుగా పేరుకున్నాయి. పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యంతో ఆప్రాంతం అంతా తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దోమలకు నిలయంగా మారాయి. బొల్లిశెట్టివారి వీధి మలుపులోని ఖాళీ స్థలంలో ఆప్రాంతం అంతా పిచ్చి మొక్కలు పెరిగి అడవిని తలపిస్తుంది. పాములు, విష కీటకాలకు స్థావరంగా మారిందని పలువురు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. యలమంచలి కుటుంబయ్య పార్క్ చినుకు పడితే చిత్తడిగా మారిపోతుంది. పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి బురదమయంగా మారుతోంది. పార్క్ పక్క వీధిలో గత పక్షం రోజుల నుంచి వీధి లైట్లు పని చేయడం లేదు. రాత్రి అయితే ఆ వీధిలో నడిచేందుకు ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

డ్రగ్స్‌పై ప్రభుత్వం ఉక్కుపాదం

● వాక్‌థాన్‌లో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ● ఇందిరాగాంధీ స్టేడియం నుంచి బెంజిసర్కిల్ వరకు ర్యాలీ

లబ్బీపేట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపి అరి కడుతున్నామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. అమరావతి రథయాత్ర ఉత్సవాల సందర్భంగా మాదకద్రవ్యం వ్యసనానికి వ్యతిరేకంగా ఒక్క అడుగు అనే నినాదంతో ఇస్కాన్, ఎర్త్ హీరోస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాగాంధీ స్టేడియం నుంచి బెంజిసర్కిల్ వరకు వాక్‌థాన్ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ డ్రగ్స్ తీసుకున్న వ్యక్తితో ఆ కుటుంబానికే కాకుండా సమాజానికి కూడా చాలా ఇబ్బందులు వస్తాయని అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకులు డ్రగ్స్‌ను సరఫరా చేయడంతో పాటు విక్రయించి అనేక అరాచకాలకు కారకులయ్యారన్నారు. సీఎం చంద్రబాబు డ్రగ్స్ సరఫరా అరికట్టడానికి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. అనంతరం ఇస్కాన్ ప్రతినిధి చక్రధారి దాస్ ప్రభు మాట్లాడుతూ సమాజంలో పెద్ద సమస్యగా ఉన్న డ్రగ్స్ వినియోగాన్ని రూపుమాపాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈగల్ యునిట్-5 ఆర్.కె.రవికృష్ణ, ఎర్త్‌హీరోస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు రావుల హాసినిరెడ్డి, ఖాజారెహ్మతుల్లా, వెంకట్, తేజ తదితరులు పాల్గొన్నారు.



వాక్‌థాన్‌లో పాల్గొన్న ప్రజలు, ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

టీటీడీ ఆధ్వర్యంలో యోగా

లబ్బీపేట, జూన్15(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలో టీటీడీ కల్యాణ మండపంలోని శ్రీవారి ఆలయ ప్రాంగణం నందు యోగాసనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లలిత రమాదేవి, యోగా గురువు సిఖాకొల్లి వెంకట సుబ్బారావు లు ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయుష్ విభాగం నుండి వెనిగళ్ళ బబిత, యోగా గురువు సుబ్బారావు లు కార్యక్రమానికి వచ్చిన వారితో యోగాసనాలు చేయించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రాం అసిస్టెంట్ సివికే ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



పొంగిపొర్లుతున్న మ్యాన్‌హోల్

గురునానక్ కాలనీ మెయిన్ రోడ్డులోని అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ పూడికతో నిండిపోయింది. దీంతో మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లుతున్నాయి. రెండురోజుల నుంచి డ్రెయినేజీ నుంచి మురుగు బయటకు రావడంతో రోడ్డు అంతా మురుగుతో నిండిపోయింది. దుర్వాసన వెదజల్లుతుందని స్థానికులు అంటున్నారు. అధికారులు స్పదించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

- భారతీనగర్


సోలార్ యూనిట్ పనితీరుపై ఆరా తీస్తున్న దుర్గగుడి ఈవో శీనానాయక్

పాతపాడులో సోలార్ యూనిట్ పరిశీలన

ఇంద్రకీలాద్రి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రూరల్ పాతపాడు పంచాయతీ పరిధిలో దుర్గగుడి ఆలయ భూముల్లో ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్‌ను ఆదివారం ఈవో వి.కె.శీనానాయక్ పరిశీలించారు. మెగా వాట్ విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ప్లాంట్ పనులు 2022లో పూర్తయి ఉత్పత్తి మొదలైందని అక్కడ సిబ్బంది ఈవోకు వివరించారు. ప్రస్తుతం ఈ ప్లాంట్ ద్వారా నెలకు 1.20లక్షల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుండగా, ఇంద్రకీలాద్రిపై నెలకు లక్ష యూనిట్ల వినియోగం జరుగుతుందని సిబ్బంది వివరించారు. దానిపై ఈవో స్పందిస్తూ విద్యుత్ 20వేల యూనిట్లకు నెట్ మీటరింగ్ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సోలార్ ప్లాంట్ నిర్వహణ సరిగా లేదని, మెరుగ్గా నిర్వహణ చేస్తే విద్యుత్ ఉత్పత్తి పెరుగుతుంది. కావున నోడల్ ఏజెన్సీ ద్వారా లేఖ రాయాలన్నారు. వారం రోజుల్లో పరిస్థితిలో మార్పు వచ్చేలా కార్యాచరణ రూపొందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఉత్పత్తి వివరాల రిజిస్టర్‌లో తీసుకోవాల్సిన చర్యలు గురించి ఈవో నోట్ రాశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కోటేశ్వరరావు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

రాయల్ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

బెంజ్‌సర్కిల్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రాయల్ క్లబ్ విజయవాడ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం సంయుక్త కల్యాణ మండపంలో నిర్వహించారు. తొలుత కళారత్న దామోదర గణపతిరావు బృందంచే జానపద సంగీతం, నృత్య కార్యక్రమాలు ఆహుతిల్ని అలరించాయి. సభాధ్యక్షుడిగా రాయల్‌తోట పద్మనాభరావు వ్యవహరించారు. అనంతరం నూతన అధ్యక్షుడిగా రాయల్ ఇమడబత్తుల నరహరి ప్రమాణస్వీకారం చేశారు. రాష్ట్ర కాపు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడుతూ రాయల్ క్లబ్ ఆధ్వర్యంలో సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహించారని కొనియాడారు. స్నేహం, సేవ సహకారం అనే నినాదంతో ఈ సంస్థ పనిచేస్తుందని గుర్తు చేశారు. అనంతరం నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ రాయల్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రతి సేవా కార్యమాలు సామాన్య ప్రజలకు అందేలా చూస్తానన్నారు. సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామని తెలిపారు. రాయల్ క్లబ్ ఆశయాలు, లక్ష్యాలను నేరవేరుస్తానని ప్రమాణం చేశారు. కార్యక్రమంలో ఏపీ సూక్ష్మ, చిన్న మధ్య తరహా సంస్థల అభివృద్ధి కార్పొరేషన్ తమ్మిరెడ్డి శివకంర్, తులసి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ తులసిరామచంద్ర ప్రభు, వెస్టిన్ గ్రూప్ ఆఫ్ కాలేజిస్ చైర్మన్ కోటి దుర్గాప్రసాద్, గౌరవ సలహాదారులు రాయల్ పేటేటి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో సీఏల పాత్ర కీలకం

ఐసీఏఐ జాతీయ అధ్యక్షుడు చరణ్ జ్యోత్ సింగ్ నందా

మొగల్రాజపురం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : దేశ, రాష్ట్ర అభివృద్ధిలో చార్టర్డ్ అకౌంటెంట్ (సీఏ)ల పాత్ర చాలా కీలకమని ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) జాతీయ అధ్యక్షుడు చరణ్ జ్యోత్ సింగ్ నందా అన్నారు. మొగల్రాజపురంలోని ఒక హోటల్‌లో జ్ఞాన వర్షిత పేరుతో సీఏలకు శిక్షణా కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న చరణ్ జ్యోత్ సింగ్ నందా మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా ఉండే సీఏలు పన్నులు సక్రమంగా చెల్లించేలా చేసి దేశ అభివృద్ధిలో భాగస్వాములు అవుతున్నారన్నారు. దేశ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తీసుకొచ్చిన ఆదాయపన్ను బిల్లు సరళంగా ఉందని, దానికి మరింత సులభతరంచేయడానికి తాము కొన్ని సూచనలు చేశామన్నారు. కొత్త సాంకేతికత, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఉపయోగించి సులభంగా ఆదాయపన్ను రిటర్న్లు ఎలా దాఖలు చేయాలో అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. చైర్మన్ కె.నారాయణ మాట్లాడుతూ ఆదాయపన్ను చెల్లించే సమయంలో ట్రస్టీకి అనుసరించాల్సిన విధానాలు, ఎఐతో ఎలా దాఖలు చేయాలో ఒత్తిడిని ఎలా అధిగమించాలో, టెట్నో ఫండ్ మార్కెటింగ్, చట్టంలో వచ్చిన మార్పుల గురించి అవగాహన చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీఏఐ సదరన్ ఇండియా రీజనల్ కౌన్సిల్ చైర్ పర్సన్ రేవతి రఘునాథన్, వైస్ చైర్‌పర్సన్ ముప్పాల సుబ్బారావు, ఐసీఏఐ విజయవాడ వైస్ చైర్‌పర్సన్ ఉప్పులూరి జయంత్, కార్యదర్శి మనీష్‌కుమార్ జైన్, కోశాధికారి వి.వీరపవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.


జ్యోతి వెలిగిస్తున్న ఐసీఏఐ జాతీయ అధ్యక్షుడు చరణ్ జ్యోత్ సింగ్‌నందా

అలరించిన నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానం మహామండపం ప్రాంగణంలోని కళావేదికపై ఆదివారం అనకాపల్లికి చెందిన శ్రీవెంకట సాయి డాన్స్ అకాడమీ కళాబృందం నృత్య కళార్చన నిర్వహించారు. అకాడమీ గురువు కె.శిరీష ఆధ్వర్యంలో కళాకారులు నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. అనంతరం అధికారులు కళాకారులను అభినందించి, అమ్మవారి ప్రసాదం, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.



ఏఎంసీ డైరెక్టర్ అప్పన్న ప్రమాణ స్వీకారానికి ర్యాలీగా..

కృష్ణలంక, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : గొల్లపూడి మార్కెట్ యార్డు కమిటీ (ఏఎంసీ) డైరెక్టర్‌గా కొర్రా అప్పన్న నియమితులయ్యారు. కృష్ణలంక నుంచి ప్రమాణస్వీకార మహోత్సవానికి ఆదివారం బైక్ ర్యాలీతో తరలివెళ్లారు. ఈ సందర్భంగా అప్పన్న మాట్లాడుతూ తన నియామకానికి కృషిచేసిన ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గొరిపర్తి నామేశ్వరరావులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బొప్పన భవనకుమార్, గద్దె క్రాంతి కుమార్, మోటేపల్లి చిన్నా, వేముల దుర్గారావు, పలిశెట్టి అన్నారావు, కేశనం భావన్నారాయణ, పోడూరి పవన్, కె.తిరుపతయ్య, జనసేన నాయకులు కొవ్వూరి కిరణ్, తోట శ్రీను, జి.జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



సాఫ్ట్ టెన్నిస్ జట్టులో కార్తీక్

లబ్బీపేట(స్పోర్ట్స్), జూన్ 15 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన కార్తీక్ భారత సాఫ్ట్ టెన్నిస్ జట్టుకు ఎంపికైనట్లు ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేసన్ ప్రధాన కార్యదర్శి డి. దిలీప్‌కుమార్ తెలిపారు. కొరియాలోని ఇంచెయోన్‌లో ఈ నెల 16 నుంచి 23వ తేదీ వరకు జరగనున్న బ్యాంక్ ఇంచెయోన్ కొరియా కప్ ఇంటర్నేషనల్ పోటీల్లో పాల్గొనే భారత జట్టుకు కార్తీక్ ప్రాతినిధ్యం వహిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా కార్తీక్‌కు అసోసియేషన్ చైర్మన్ దారం నవీన్‌కుమార్, అధ్యక్షుడు వి. శ్రీనుబాబు, కోశాధికారి బి.నీరజ తదితరులు అభినందనలు తెలిపారు.

కనకదుర్గానగర్‌కు క్లోక్‌రూమ్

ఇంద్రకీలాద్రి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): దుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తుల తమ వస్తు వులను భద్రపరుచుకునేందుకు క్లోక్ రూమ్‌ను మహామండపం వద్ద నుంచి కనకదుర్గానగర్‌కు తరలించారు. ఇటీవల భక్తుల రద్దీ ఎక్కువ కావటం వల్ల క్లోక్ రూమ్ దగ్గర పలు సమస్యలు ఎదురవుతున్నాయి. ఈవో క్లోక్ రూమ్‌ను పరిశీలించి భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుం డా ఉండేందుకు కనకదుర్గానగర్‌లో దసరా, భవానీదీక్షల సమయాల్లో ఏర్పాటు చేసే లడ్డూ ప్రసాదాల కౌంటర్ల వద్దకు మార్చాలని ఇంజనీ రింగ్ అధికారులను ఆదేశించారు. దీంతో కాంట్రాక్టర్ శనివారం రాత్రి మార్చారు.



బాలుడు అదృశ్యం

విద్యాధరపురం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): బంధువుల ఇంటి నుంచి వైఎస్ఆర్ కాలనీలో ఉన్న తల్లిదండ్రుల వద్దకు బయలుదేరిన బాలుడు అదృశ్యమైనట్లు ఆదివారం భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. జక్కంపూడి వైఎస్ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న పాతూరి హరికి ఇద్దరు కుమారులు. అతని భార్య బెంగళూరులోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. వారి పెద్ద కుమారుడు హేమాకేష్(12) చిన్నతనం నుంచి చెరువు సెంటర్‌లో ఉంటున్న పిన్ని వద్ద ఉంటున్నాడు. ఆదివారం బెంగళూరు నుంచి తన తల్లి వైఎస్ఆర్ కాలనీకి వచ్చిందని, తల్లిదండ్రుల వద్దకు వెళ్లివస్తానని పిన్నికి చెప్పి ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. సాయంత్రం నాలుగు గంటలకు హేమాకేష్ పిన్ని ఫోన్‌చేసి బాబు ఇంటికి వచ్చాడా అని అడిగింది. రాలేదని బంధువులు, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పద్యానికి వెయ్యి సంవత్సరాల చరిత్ర

జీవన సౌరభాలు పుస్తకావిష్కరణ సభలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

విజయవాడ కల్చరల్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : పద్యానికి వెయ్యి సంవత్సరాల చరిత్ర వుందని తెలుగువారు ప్రాణపదంగా ప్రేమించే సాహిత్యం పద్యం అని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ మీటింగ్ హాల్లో ఆదివారం కృష్ణాజిల్లా రచయితల సంఘం సౌజన్యంతో జరిగిన ప్రముఖ రచయిత్రి డాక్టర్ ఓలేటి ఉమా సరస్వతి పద్య కవిత సంపుటి జీవన సౌరభాలు పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ రచయిత్రి కవిత్వం రాస్తూనే ఒక ఉపాధ్యాయునిగా విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడంతో పాటు పద్య కవిత్వాన్ని కూడా వారికి నేర్పుతూ తెలుగు భాషాభివృద్ధికి సేవ చేస్తున్నారని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ రచయిత సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో డాక్టర్ జీవీ పూర్ణచంద్ గౌరవ అతిథిగా పాల్గొని రచయిత్రి రాసిన రచనలోని గొప్పదనాన్ని విశదీకరించారు. డాక్టర్ గుమ్మా సాంబశివరావు పుస్తక సమీక్ష చేస్తూ మంచి కవిత్వం చిరస్థాయిగా వుంటుందన్నారు. పద్య కవిత్వం కనుమరుగవుతున్న దశలో రచయిత్రి ఉమా సరస్వతి మంచి పద్య కవిత్వం రాసి భవిష్యత్ తరాలకి మార్గదర్శి అయ్యారని అభినందించారు. శర్మ సీహెచ్ స్వాగత వచనాలతో ప్రారంభమైన ఈ సభలో ప్రముఖ సాహితీవేత్తలు, రచయిత్రి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బుద్ధప్రసాద్, పూర్ణచంద్ తదితరులు

దిక్సూచి



ఇండస్ట్రీ డిమాండ్లతోపాటు, కొత్త కొత్త టెక్నాలజీలను అందిపుచ్చుకోవడానికి మన దేశంలోని ఐఐటీ, ఎన్ఐటీలు ముందు ఉంటున్నాయి. అందులో భాగంగా ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ ఇంటర్ డిసిప్లినరీ, కొత్త ఇంజనీరింగ్ బ్రాంచ్‌లను ప్రారంభిస్తున్నాయి. ఇటీవలి కాలంలో ఐఐటీలు, ఎన్ఐటీలు ప్రారంభించిన కొత్త బ్రాంచీలు ఏమిటో చూద్దాం.

ఇంజనీరింగ్‌లో కొత్త బ్రాంచ్‌లు

ఐఐటీల్లో

1. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) అండ్ డేటా సైన్స్
ఏఐ అండ్ డేటా సైన్స్, డేటా సైన్స్ అండ్ ఏఐ, కంప్యూటర్ సైన్స్ అండ్ ఏఐ ఇలా రకరకాల పేర్లతో లేదా కాంబినేషన్లతో హైదరాబాద్, గౌహతి, ఢిల్లీ, జోద్‌పూర్, పాట్నా ఐఐటీలు ఈ బ్రాంచీలను అందిస్తున్నాయి.
ఉద్యోగ అవకాశాలు: ఏఐఎంఎల్ ఇంజనీర్, డేటా సైంటిస్ట్, బిజినెస్ అనలిస్ట్, ఎన్ఎల్‌పీ ఇంజనీర్, కంప్యూటర్ విజన్ ఇంజనీర్‌గా పనిచేయవచ్చు.
ఏయే కంపెనీల్లో అవకాశాలు: గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్ వంటి టెక్ దిగ్గజాలతోపాటు, స్టార్టప్‌లు, ఫైనాన్స్(క్వాంటమ్ రోల్స్), హెల్త్ కేర్(ఏఐ డయాగ్నస్టిక్స్), ఈ కామర్స్ తదితరాల్లో వీరికి అవకాశాలు ఉంటాయి.
జీతభత్యాలు: మన దేశంలో ఐఐటీలు, ఎన్ఐటీల వంటి సంస్థల్లో చదివిన వారికి 12 నుంచి 30 లక్షలు. విదేశాల్లో అయితే 20 నుంచి 50 లక్షల వరకు ఉండొచ్చు.
భవిష్యత్తు: ఆటోమేషన్, రోబోటిక్స్ తదితరాల్లో ఏఐ కీలకంగా మారుతుంది. అలాగే జనరేటివ్ ఏఐ అంటే చాట్ జీపీటీ తరహా మోడల్స్ కారణంగా వీరికి డిమాండ్ చాలా ఎక్కువగా ఉంటుంది.

2. రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్ మెకట్రానిక్స్
అలహాబాద్(ప్రయాగ్‌రాజ్), హైదరాబాద్, జోద్‌పూర్ ఐఐటీలు ఈ బ్రాంచ్‌ను అందిస్తున్నాయి.
అవకాశాలు: రోబోటిక్స్ ఇంజనీర్, ఆటోమేషన్ స్పెషలిస్ట్, కంట్రోల్ సిస్టమ్ ఇంజనీర్, డిఫెన్స్ అండ్ స్పేస్‌లో ఆర్ అండ్ డీలుగా పని చేయవచ్చు.
ఏయే కంపెనీలు: టెస్లా, ఫాక్స్‌కాన్ వంటి మాన్యుఫాక్చరింగ్, ఇస్రో, స్పేస్ ఎక్స్ వంటి అంతరిక్ష సంస్థలు, డీఆర్‌డీఓ వంటి రక్షణ సంస్థలు, సీమెన్స్, బోష్ వంటి ఇండస్ట్రియల్ ఆటోమేషన్ కంపెనీల్లో అవకాశాలు ఉంటాయి.
జీతభత్యాలు: మన దేశంలో 8 నుంచి 20 లక్షలు. యూఎస్, జర్మనీ, జపాన్ వంటి విదేశాల్లోని రోబోటిక్స్ హబ్స్‌లో అయితే 20 నుంచి 60 లక్షలు.
భవిష్యత్తు: ఇండస్ట్రీ 4.0, స్మార్ట్ ఫ్యాక్టరీలు, అటానమస్ వెహికిల్స్ వంటివి వీరికి డిమాండ్‌ను తెస్తాయి.

3. రెన్యువబుల్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్ వెహికిల్(ఈవీ) ఇంజనీరింగ్
ఎనర్జీ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ పేరుతో బాంబే ఐఐటీ, ఎనర్జీ ఇంజనీరింగ్ పేరుతో ఢిల్లీ ఐఐటీ, సస్టయినబుల్ ఎనర్జీ ఇంజనీరింగ్ పేరుతో మద్రాస్ ఐఐటీ ఈ బ్రాంచ్‌లను అందిస్తున్నాయి.
అవకాశాలు: ఈవీ డిజైన్ ఇంజనీర్, సోలార్ విండ్ ఎనర్జీ కన్సల్టెంట్స్, బ్యాటరీ టెక్నాలజిస్ట్, సస్టయినబుల్ అనలిస్ట్ తదితర ఉద్యోగాలు ఉంటాయి.
ఏయే కంపెనీలు: టెస్లా, టాటా మోటార్స్ ఓలా ఎలక్ట్రిక్, అదానీ గ్రీన్, సీమెన్స్ గమేసా, ప్రభుత్వ విద్యుత్ ప్రాజెక్ట్‌లు తదితరాల్లో వీరికి అవకాశాలు ఉంటాయి.
జీతభత్యాలు: మన దేశంలో 6 నుంచి 18 లక్షలు. విదేశాల్లో ఇంకా చాలా ఎక్కువగా ఉంటుంది.
భవిష్యత్తు: 2030 సంవత్సరం వరకు 500 గిగా వాట్ పునరుత్పాదక ఇంధనాలను తయారు చేయాలని భారత దేశం లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే ఈవీ బూమ్ కూడా వీరికి పెద్ద ఎత్తున అవకాశాలను కల్పించనుంది.

4. మెటీరియల్స్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (నానో టెక్నాలజీ, ఇతర స్మార్ట్ మెటీరియల్స్ కేంద్రంగా)
ఈ బ్రాంచ్‌ను కాన్పూర్, మద్రాస్, బాంబే ఐఐటీలు అందిస్తున్నాయి.

5. క్వాంటమ్ టెక్నాలజీ
క్వాంటమ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో బీఎస్సీ డిగ్రీని మద్రాస్ ఐఐటీ అందిస్తుండగా, క్వాంటమ్ టెక్నాలజీస్‌పై ఐఐటీ జోద్‌పూర్‌లో బ్రాంచ్ ఉంది.
అవకాశాలు: క్వాంటమ్ ఆల్గోరిథమ్ డెవలపర్, క్వాంటమ్ హార్డ్‌వేర్ ఇంజనీర్, క్రిప్టోగ్రఫీ రీసెర్చర్ వంటి ఉద్యోగాలు చేయవచ్చు.
ఏయే కంపెనీలు: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ వంటి పరిశోధనశాలలు, ఐబీఎమ్, గూగుల్ క్వాంటమ్ ఏఐ వంటి పెద్ద టెక్ సంస్థలు, క్వాంటన్ ఎన్‌క్రిప్షన్ వంటి రక్షణ సంస్థల్లో పనిచేయవచ్చు.
జీతభత్యాలు: భారతదేశంలో రీసెర్చ్ స్టార్టప్స్‌లో 15 నుంచి 30 లక్షలు. విదేశాల్లో సుమారు లక్షన్నర డాలర్లు.
భవిష్యత్తు: ఈ రంగాలు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయి. కంప్యూటింగ్, క్రిప్టోగ్రఫి, మెటీరియల్‌సైన్స్‌లు వేగంగా ఎదిగే అవకాశం ఉంది.

6. బయో ఇంజనీరింగ్, బయో మెడికల్ ఇంజనీరింగ్
ఈ బ్రాంచ్‌లను ఢిల్లీ, బాంబే, కాన్పూర్, హైదరాబాద్‌ల్లోని ఐఐటీలు అందిస్తున్నాయి.
అవకాశాలు: మెడికల్ డివైజ్ డిజైనర్, బయో మెకానిక్స్ ఇంజనీర్, హెల్త్‌కేర్ ఏఐ స్పెషలిస్ట్
ఏయే కంపెనీలు: బయోకాన్- డాక్టర్ రెడ్డీస్ వంటి ఫార్మా కంపెనీలు, సీమెన్స్ హీల్ థిన్నర్స్ వంటి మెడ్‌టెక్ కంపెనీలు, ఎయిమ్స్, ఐసీఎంఆర్ వంటి పరిశోధన సంస్థల్లో అవకాశాలు ఉంటాయి.
జీతభత్యాలు: భారతదేశంలో 6 నుంచి 15 లక్షలు. విదేశీ మెడికల్ హబ్స్‌లో ఇంకా ఎక్కువగా ఉంటుంది.
భవిష్యత్తు: పెరుగుతున్న జనాభా, ఏఐ ఆధారిత హెల్త్‌కేర్ ఉత్పత్తుల కారణంగా వీరికి మంచి డిమాండ్ ఉంటుంది.

6. కంప్యూటేషనల్ ఇంజనీరింగ్(ఏఐ + మెకానిక్స్ డిజైన్)
ఈ బ్రాంచ్ హైదరాబాద్, గాంధీనగర్ ఐఐటీల్లో ఉంది.

7. ఎలక్ట్రిక్ వెహికిల్స్(ఈవీ) అండ్ మొబిలిటీ ఇంజనీరింగ్
మద్రాస్ ఐఐటీలో మొబిలిటీ ఇంజనీరింగ్, ఢిల్లీ ఐఐటీలో ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్ ఉంది

8. సైబర్ సెక్యూరిటీ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ
కాన్పూర్ ఐఐటీలో సైబర్ సెక్యూరిటీ, జోద్‌పూర్ ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ సైబర్ సెక్యూరిటీ బ్రాంచ్‌లు ఉన్నాయి.
అవకాశాలు: ఎథికల్ హ్యాకర్, సైబర్ సెక్యూరిటీ అనలిస్ట్, థ్రెట్ ఇంటెలిజెన్స్ స్పెషలిస్ట్, బ్లాక్‌చైన్ సెక్యూరిటీ ఎక్స్‌పర్ట్ తదితరాలు పనిచేయవచ్చు.
ఏయే కంపెనీలు: టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి దిగ్గజ కంపెనీలు, సెర్ట్ ఇన్ వంటి రక్షణ సంస్థలు, పేటీఎమ్-రాజోర్ పే వంటి ఫిన్‌టెక్ కంపెనీలు, పాలో ఆల్టో - క్రౌడ్ స్ట్రైక్ వంటి గ్లోబల్ సైబర్ సెక్యూరిటీ సంస్థల్లో పనిచేయవచ్చు.
జీతభత్యాలు: భారతదేశంలో 10 నుంచి 25 లక్షలు. విదేశాల్లో సుమారు లక్ష డాలర్లు.
భవిష్యత్తు: భవిష్యత్తు సైబర్ యుద్ధాలు జరిగే కాలం, 5జి క్లౌడ్ సెక్యూరిటీ అవసరాలు వీరి డిమాండ్‌ను బాగా పెంచుతాయి.

9. కాగ్నెటివ్ సైన్స్(హ్యూమన్-కంప్యూటర్ ఇంటరాక్షన్, ఏఐ+ సైకాలజీ)
గాంధీ నగర్, కాన్పూర్ ఐఐటీలో కాగ్నెటివ్ సైన్స్‌లో డ్యూయల్ డిగ్రీ కోర్సు ఉంది.
అవకాశాలు: యూఎక్స్‌యూఐ డిజైనర్, ఏఐ ఎథిస్ట్, న్యూరోసైన్స్ ఇంజనీర్(బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్‌ఫేస్) తదితరాలుగా పనిచేయవచ్చు.
ఏయే కంపెనీలు: టెక్ కంపెనీలైన మైక్రోసాఫ్ట్ రీసర్చ్, మెటా, హెల్త్‌కేర్‌లో న్యూరో స్టార్టప్స్‌లో అవకాశాలు ఉంటాయి.
జీతభత్యాలు: యూఎక్స్ రోల్స్‌లో అయితే 10 నుంచి 25 లక్షలు. పరిశోధనలవైపు వెళితే ఇంకా ఎక్కువ ఉంటుంది.
భవిష్యత్తు: ఏఐ ఎథిక్స్, మెటావర్స్, ఏఆర్‌వీఆర్‌లో కాగ్నిటీవ్ సైన్స్ నిపుణుల అవసరం ఉంటుంది.

ఇంకొన్ని..



ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ), సైబర్ ఫిజికల్ సిస్టమ్స్
అవకాశాలు: ఐఓటీ సొల్యూషన్స్ ఆర్కిటెక్ట్, ఎంబెడెడ్ సిస్టమ్ ఇంజనీర్, స్మార్ట్ సిటీ కన్సల్టెంట్‌గా పనిచేయవచ్చు.
ఏయే కంపెనీలు: జియో, ఎయిర్‌టెల్ వంటి టెలీకామ్ కంపెనీల్లో, ఎల్‌అండ్ టీ, సీమెన్స్ వంటి స్మార్ట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఐఓటీ ఆధారిత ఫార్మింగ్ అగ్రిటెక్ కంపెనీల్లో అవకాశాలు ఉంటాయి.
జీతభత్యాలు: భారతదేశంలో 8 నుంచి 20 లక్షలు. గ్లోబల్ ఐటీ మార్కెట్ డిమాండ్ బాగా ఉంది.
భవిష్యత్తు: 5జీ బాగా పెరుగుతోంది. ఐఓటీ ఆధారంగా స్మార్ట్‌సిటీలు తయారవుతున్నాయి.

మెటీరియల్స్ సైన్స్ (స్మార్ట్ మెటీరియల్స్ నానో టెక్)
అవకాశాలు: నానోటెక్ రీసెర్చర్, కాంపోజిట్ మెటీరియల్స్ ఇంజనీర్, సెమీ కండక్టర్ మెటీరియల్స్ స్పెషలిస్ట్ తదితరాలుగా పనిచేయవచ్చు.
ఏయే కంపెనీలు: ఇంటెల్, టీఎస్ఎమ్‌సీ వంటి సెమీ కండక్టర్ కంపెనీల్లో, ఇస్రో, బోయింగ్ వంటి స్పేస్ సంస్థల్లో, ఈవీ బ్యాటరీ, రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌లో విభాగాల్లో వీరికి అవకాశాలు ఉంటాయి.
జీతభత్యాలు: భారతదేశంలో 7 నుంచి 18 లక్షలు. విదేశీ పరిశోధక సంస్థల్లో చాలా ఎక్కుగా ఉంటుంది.
భవిష్యత్తు: చిప్స్, ఈవీలు, స్పెస్ టెక్నాలజీ బాగా పెరుగుతుండడంతో డిమాండ్‌కు తిరుగులేదు.

'క్రీ' ట్రెండ్స్

- ఏఐ, ఎంఎల్, డేటా సైన్స్ అనేవి ఇప్పుడున్న పాపులర్ ట్రెండ్స్
- పునరుత్పాదన ఇంధనాలు, ఈవీలపై అందరి దృష్టి ఉంది.
- క్వాంటమ్ టెక్ అండ్ సైబర్ సెక్యూరిటీ అనేవి అత్యంత డిమాండ్ ఉన్న రంగాలు.
- ఇప్పుడు సంప్రదాయ కోర్సులను ఇంటర్ డిసిప్లినరీ కోర్సులు రిప్లేస్ చేస్తున్నారు. ఉదాహరణకు కంప్యూటర్ + ఏ రంగం అయితే ఆ రంగానికి సంబంధించిన కోర్సు దీనికి చేరుతోంది.
- ఐఐటీలు, ఎన్ఐటీలు ప్రవేశపెట్టిన ఈ కోర్సులకు ఉద్యోగ అవకాశాలు అత్యంత ఎక్కువగా ఉంటాయి. ఎందుకంటే టెక్నలాజికల్ అడ్వాన్స్‌మెంట్స్, ఇండస్ట్రీ అవసరాలతోపాటు, మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా, నేషనల్ ఏఐ స్ట్రాటజీ మొదలైన ప్రభుత్వ చొరవలకు అనుగుణంగా డిజైన్ చేసిన కోర్సులు ఇవి.

ఎన్ఐటీల్లో

- **ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్:** వరంగల్, తిరుచ్చి, సూరత్‌కల్, కాలికట్, పాట్నాల్లోని ఎన్ఐటీల్లో ఈ బ్రాంచ్ ఉంది.
- **ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ఇంజనీరింగ్:** కురుక్షేత్ర, నాగపూర్‌ల్లోని ఎన్ఐటీల్లో ఈ బ్రాంచ్ ఉంది.
- **బయోటెక్నాలజీ అండ్ బయో మెడికల్ ఇంజనీరింగ్:** రూర్కేలా, దుర్గాపూర్, వరంగల్‌లోని ఎన్ఐటీల్లో ఈ బ్రాంచ్ ఉంది.



- **మానుఫ్యాక్చరింగ్ ఇంజనీరింగ్ ఇండస్ట్రియల్ అండ్ ప్రొడక్షన్ ఇంజనీరింగ్:** తిరుచ్చి, జంషెడ్‌పూర్‌ల్లోని ఎన్ఐటీల్లో ఈ కోర్సు ఉంది.
- **మెకట్రానిక్స్ ఇంజనీరింగ్:** కాలికట్, పాట్నా ఎన్ఐటీల్లో ఈ బ్రాంచ్ ఉంది.
- **పెట్రోలియం ఇంజనీరింగ్, ఎనర్జీ ఇంజనీరింగ్:** కాలికట్, సూరత్‌కల్‌లోని ఎన్ఐటీల్లో ఉంది.
- **స్మార్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ కన్‌స్ట్రక్షన్ ఇంజనీరింగ్:** తిరుచ్చి ఎన్ఐటీలో సివిల్ విత్ స్మార్ట్ టెక్నాలజీ కోర్సు ఉంది.
- **సైబర్, ఫిజికల్ సిస్టమ్స్(ఏఐ+ఐఓటీ=రోబోటిక్స్):** ఆంధ్రప్రదేశ్, మణిపూర్‌ల్లోని ఎన్ఐటీల్లో ఉంది.

ఇంజనీరింగ్ ఇంటర్ డిసిప్లినరీ ప్రోగ్రామ్స్ (బీటెక్+ఎంటెక్ డ్యూయల్ డిగ్రీ, బీఎస్-ఎంఎస్ ప్రోగ్రామ్స్)

- క్వాంటమ్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌తో ఇంజనీరింగ్ ఫిజిక్స్. ఇది బొంబే, మద్రాస్ ఐఐటీల్లో ఉంది.
- మేథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్. అన్ని ఐఐటీలు, పేరున్న ఎన్ఐటీల్లో ఈ కోర్సు ఉంది.
- ఎకనామిక్స్ అండ్ డేటా సైన్స్. కాన్పూర్, ఖరగ్‌పూర్ ఐఐటీల్లో ఉంది.
- ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ అండ్ సస్టయినబిలిటీ. బాంబే ఐఐటీలో, తిరుచ్చి ఎన్ఐటీలో ఈ కోర్సు ఉంది.



ప్రొఫెసర్ ఎన్.వి.రమణారావు
డైరెక్టర్, ఎన్ఐటి రాయపూర్

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

అఖండ 2 కొత్త షెడ్యూల్



నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను తెరకెక్కిస్తున్న చిత్రం 'అఖండ 2: తాండవం'. 2021లో విడుదలై ఘనవిజయం సాధించిన 'అఖండ'కు ఇది సీక్వెల్. ఇటీవలె విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను పెంచింది. ఈ సినిమా కీలక షెడ్యూల్‌ను నేటి నుంచి రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రారంభించనున్నట్లు తెలిపారు మేకర్స్. బాలకృష్ణతో సహ ప్రధాన పాత్రధారులందరూ పాల్గొననున్న ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. బాలకృష్ణ కుమార్తె తేజస్విని సమర్పణలో రామ్ అచంట, గోపీ అచంట నిర్మిస్తున్నారు. సంయుక్త కథానాయిక. ఆది పినిశెట్టి కీలక పాత్ర పోషిస్తున్నారు. దసరా సందర్భంగా సెప్టెంబరు 25న చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

'కన్నప్ప' చిత్రంపై ఆ శివుడి అనుగ్రహం ఉండాలి



మంచు విష్ణు కథానాయకుడిగా ముఖేష్‌కుమార్ సింగ్ తెరకెక్కించిన చిత్రం 'కన్నప్ప'. డా.మోహన్‌బాబు నిర్మించారు. ప్రభాస్, మోహన్‌లాల్, అక్షయ్‌కుమార్, మోహన్‌బాబు తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ నెల 27న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా కేరళలో నిర్వహించిన కార్యక్రమంలో ట్రైలర్‌ను విడుదల చేశారు. హీరో మోహన్‌లాల్ మాట్లాడుతూ "ఇప్పుడంతా పాన్ ఇండియా ట్రెండ్ నడుస్తోంది. 'కన్నప్ప' చిత్రం అద్భుతంగా వచ్చింది. ఆ శివుడి అనుగ్రహం ఈ సినిమాపై ఉండాలని కోరుకుంటున్నాను. ఈ చిత్రంలో భాగమైనందుకు సంతోషంగా ఉంది" అని అన్నారు. మోహన్‌బాబు మాట్లాడుతూ "మోహన్‌లాల్ గొప్ప నటుడు. సినిమా కోసం ఇప్పటివరకూ ఒక్క రూపాయి కూడా పారితోషికంగా తీసుకోలేదు. ఆయన చూపించిన ప్రేమకు రుణపడి ఉంటాను. ఆయనతో కలసి నటించాలనుంది" అని చెప్పారు. మంచు విష్ణు మాట్లాడుతూ "ఈ సినిమా గురించి ఇక నేను చెప్పాల్సిన పని లేదు. మీరు అల్రెడీ ట్రైలర్ చూశారు. సినిమా విజయంపై నమ్మకం ఉంది" అని అన్నారు.

అవార్డు వచ్చినవాళ్లు స్వయంగా వచ్చి స్వీకరించాలి

● సినీ ప్రముఖులకు దిల్‌రాజు సూచన



'ప్రభుత్వం నుంచి అవార్డ్ వస్తున్నాయంటే చాలా జాగ్రత్తగా పురస్కారాలను స్వీకరించాలి. ఇది ఇండస్ట్రీలోని అందరికీ చెబుతున్నాను. భవిష్యత్‌లో ప్రభుత్వ పురస్కారాల ప్రకటన వచ్చినప్పుడు ఆ తేదీని డైరీలో నోట్ చేసుకొని... అవార్డు వచ్చినవాళ్లు స్వయంగా వచ్చి స్వీకరించాలి. నా విజ్ఞప్తిని అందరూ అర్థం చేసుకుంటారని భావిస్తున్నాను' అని నిర్మాత, తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ (టీజీఎఫ్‌డీసీ) చైర్మన్ దిల్ రాజు అన్నారు. శనివారం నిర్వహించిన తెలంగాణ గద్దర్ అవార్డుల వేడుక విజయవంతమైన సందర్భంగా ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దిల్‌రాజు మాట్లాడుతూ 'షూటింగ్స్ ఉన్నా పక్కనపెట్టి పురస్కార గ్రహీతలు స్వయంగా అవార్డ్ ప్రధానోత్సవ కార్యక్రమానికి హాజరవ్వాలి. అది మన బాధ్యత. త్వరలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా సినీ పురస్కారాలను ఇవ్వబోతోంది. అందరికీ చెబుతున్నా... గుర్తు పెట్టుకోండి. ప్రభుత్వంతో సామరస్యపూర్వకంగా ముందుకెళ్లాల్సిన బాధ్యత ఇండస్ట్రీలోని ప్రతి ఒక్కరిపైన ఉంది' అని చెప్పారు. 'గద్దర్ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని భారీ స్థాయిలో నిర్వహించి విజయవంతం చేశాం. ఆరునెలల నుంచి పడిన కష్టం ఫలించినందుకు చాలా ఆనందంగా ఉంది. సినీ పరిశ్రమలోని వారంతా ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని నిర్వహించిన తీరు బావుందంటూ చాలామంది ప్రశంసిస్తున్నారు. సీఎం గారు గంట సమయం ఇస్తానన్నారు. కానీ నా కోరిక మేరకు ఆయన రెండు గంటలకుపైగా ఉండడం ఉత్సాహాన్నిచ్చింది. ఇంత పెద్ద వేడుకలో ఏమైనా పొరపాట్లు జరిగి ఎవరి మనసైనా నొప్పించి ఉంటే వాళ్లకు టీజీఎఫ్‌డీసీ తరఫున క్షమాపణలు చెబుతున్నాను' అని దిల్‌రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఎఫ్‌డీసీ ఎండీ హరీశ్ పాల్గొన్నారు.



'కుబేర' కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా

ఎస్.ఎస్.రాజమౌళి

"శేఖర్ కమ్ముల పైకి చూడ్డానికి చాలా సాఫ్ట్‌గా ఉంటారు. ఆయన్ని చూస్తూనే మనకి అలా అనిపిస్తుంది. కానీ ఆయన నమ్మిన సిద్ధాంతాల కోసం ఎంత దూరమైనా వెళ్లే మొండి పట్టుదల కలవారు. ఆయన నమ్మే సిద్ధాంతాలనే సినిమాలుగా తీస్తారు. ఆయనలోని ఈ గుణాన్ని నేను ఎంతో గౌరవిస్తాను. ఆయన ముందు ముందు కూడా ఇలానే మనకు మరిన్ని మంచి సినిమాలు అందించాలని కోరుకుంటున్నాను" అని అన్నారు. నాగార్జున, ధనుష్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో శేఖర్ కమ్ముల తెరకెక్కించిన చిత్రం 'కుబేర'. సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్మోహన్ నిర్మించారు. ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా ఆదివారం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజమౌళి మాట్లాడుతూ "ట్రాన్స్ ఆఫ్ కుబేర టీజర్ చూసి ఆశ్చర్యపోయాను. మేకింగ్ అద్భుతంగా ఉంది. తొలి రోజే సినిమాను చూడటానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని చెప్పారు. నాగార్జున మాట్లాడుతూ "ధనుష్ మీ సినిమాలు చేశాను. సెట్స్‌లో మీరు పాత్రలోకి ఎలా పరకాయ ప్రవేశం చేస్తారో చూశాను. మీతో కలసి పనిచేయడం గొప్ప జ్ఞాపకం. ఇది కంప్లీట్‌గా శేఖర్ కమ్ముల సినిమా. ఈ చిత్రానికి ఆయనే హీరో" అని చెప్పారు. ధనుష్ మాట్లాడుతూ "ఇది 'సార్' తర్వాత నా రెండో తెలుగు చిత్రం. నిజానికి 'సార్' కంటే ముందే శేఖర్ కమ్ముల ఈ కథ చెప్పారు. మీ ముందుకు రావడానికి ఇంత టైమ్ పట్టింది. ఆయనో అద్భుత వ్యక్తి. చిన్నప్పటి నుంచి నాగార్జున సినిమాలు చూస్తూ పెరిగాను. ఆయనతో కలసి నటించడం మరిచిపోలేని అనుభవం. ఇది రెండు భిన్న ప్రపంచాల మధ్య జరిగే కథ" అని పేర్కొన్నారు. శేఖర్ కమ్ముల మాట్లాడుతూ "రాజమౌళి ఈ కార్యక్రమానికి రావడంతో 'కుబేర' చాలా పెద్ద సినిమా అయ్యింది. దర్శకుడిగా అప్పుడే 25 ఏళ్లు అయ్యాయా అనిపిస్తోంది. ఈ సినిమా నాకు చాలా ప్రత్యేకం. నిజాయితీగా తీసిన సినిమా ఇది. చాలా కొత్తగా ఉంటుంది. ట్రూ పాన్ ఇండియా చిత్రమిది. అందరికీ కనెక్ట్ అవుతుంది" అని తెలిపారు. నిర్మాత సునీల్ నారంగ్ మాట్లాడుతూ "ఈ సినిమా గురించి ఇప్పుడేం మాట్లాడను. సినిమా విడుదలయ్యాక సక్సెస్ మీట్‌లో మాట్లాడుతా" అని అన్నారు. నిర్మాత పుస్కుర్ రామ్‌మోహన్ రావు మాట్లాడుతూ "ఇదో విభిన్న చిత్రం. నాగార్జున,ధనుష్ నటన ఈ సినిమాకే హైలెట్‌గా ఉండబోతోంది" అని అన్నారు.

స్వచ్ఛమైన ప్రేమకథ



'మను' ఫేమ్ ఫణీంద్ర నార్సెట్టి తెరకెక్కించిన చిత్రం '8 వసంతాలు'. 'మ్యాడ్' ఫేమ్ అనంతిక సునీల్‌కుమార్ కీలక పాత్రలో నటించారు. రవితేజ దుగ్గిరాల, హనురెడ్డి కీలక పాత్రలు పోషించారు. నవీన్ యెర్నేని, యలమంచలి రవిశంకర్ నిర్మించారు. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలు ఆకట్టుకున్నాయి. ఈ నెల 20న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. 'ప్రేమంటే ఒక దశ మాత్రమే.. దిశ కాదు', 'మగాడి ప్రేమకు సాక్ష్యాలుగా పాలరాతి సౌధాలు, భాగ్యనగరాలు ఉన్నాయి.. ఆడదాని ప్రేమకు ఏమున్నాయి? మనసులోనే సమాధి చేసుకున్న జ్ఞాపకాలు తప్ప' వంటి సంభాషణలు సినిమాపై మరింత అంచనాలను పెంచాయి. ప్రధాన పాత్రధారుల నటన, అద్భుతమైన విజువల్స్, సంగీతం ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మేకర్స్ మాట్లాడుతూ "ఇది మహిళా ప్రాధాన్యం ఉన్న కథ అయినా, ఇందులోని పాత్రలన్నీ కీలకమే. ప్రతీ పాత్రలో చాలా లేయర్స్ ఉంటాయి. ఇదో స్వచ్ఛమైన ప్రేమ కథ. నిజజీవితాన్ని తెరపై చూస్తున్న అనుభూతి కలుగుతుంది. సినిమా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే విధంగా ఉంటుంది. అద్భుతమైన సినిమాటిక్ అనుభవాన్ని పంచుతుంది" అని తెలిపారు.



భూ అంటే భూతం

నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'తమ్ముడు'. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. లయ వర్ష బొల్లమ్మ, సప్తమి గౌడ కీలకపాత్రలు పోషిస్తున్నారు. జులై 4న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. 'భూ అంటే భూతం' అంటే సాగే గీతాన్ని ఈ మంగళవారం విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా చిత్రబృందం స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, సినిమాటోగ్రఫీ: కేవీ గుహన్

సినిమాకే హైలెట్‌గా

రామ్ పోతినేని కథానాయకుడిగా మహేశ్‌బాబు.పి తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఆంధ్రా కింగ్ తాలూకా'. మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, యలమంచలి రవిశంకర్ నిర్మిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. కన్నడ హీరో ఉపేంద్ర ఇందులో సూపర్‌స్టార్ సూర్యకుమార్ అనే శక్తిమంతమైన పాత్రను పోషిస్తున్నారు.



తాజాగా, ఈ సినిమాలో కీలకమైన టాకీ పార్ట్‌ను హైదరాబాద్‌లో షూట్ చేస్తున్నారు. రామ్, ఉపేంద్ర మధ్య తెరకెక్కుతోన్న ఈ కీలక సన్నివేశాలు సినిమాకే హైలెట్‌గా ఉంటాయని మేకర్స్ తెలిపారు. ఇందులో రామ్ పాత్ర చాలా విభిన్నంగా ఉండబోతోందని చెప్పారు. ఈ చిత్రానికి ఎడిటర్: శ్రీకర్ ప్రసాద్, సినిమాటోగ్రఫీ: సిద్ధార్థ నుని, సంగీతం: వివేక్- మెర్విన్.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
సోమవారం • 16 జూన్ 2025

ప్రసవం కోసం ఆసుపత్రికి వెళ్లేటప్పుడు..

సాధారణంగా తొమ్మిది నెలలు నిండిన తరవాత ప్రసవం కోసం గర్భిణులు ఆసుపత్రిలో చేరుతూ ఉంటారు. ప్రసవం తరవాత కనీసం మూడు నుంచి అయిదు రోజులు అక్కడే ఉండాల్సి వస్తుంది. ఇలా ఆసుపత్రికి వెళ్లే ముందు కాబోయే తల్లులు తమ వెంట ఏమేం తీసుకువెళ్లాలో తెలుసుకుందాం...

- వైద్యులు సూచించిన ప్రకారం ప్రసవ తేదీ సమీపిస్తుందనగానే ఒక బ్యాగ్‌ను సిద్ధం చేసుకోవాలి. ఆ బ్యాగ్ పెద్దదిగా, తేలికగా పట్టుకోవడానికి వీలుగా ఉండాలి. తల్లీ బిడ్డలకు అవసరమయ్యే వస్తువులు, దుస్తులు తదితరాలను పొందికగా సర్దడానికి అనువుగా ఉండాలి.
- వైద్యుల సూచనలతో ఇప్పటి వరకు వాడిన మందుల చీటీలు, ఇతరత్రా చేయించుకున్న వైద్య పరీక్షల రిపోర్టులు, ఎక్స్‌రేలు, పుట్టబోయే బిడ్డ ఆరోగ్యానికి సంబంధించి కీలక సమాచారాన్ని తెలిపే పత్రాలను ఒక ఫైల్‌లో ఉంచాలి. దీనితోపాటు ఆధార్ కార్డ్, ఇన్సూరెన్స్ కార్డ్‌లను అడిగిన వెంటనే తీసి చూపించేందుకు వీలుగా బ్యాగ్‌లో పెట్టాలి.



- ప్రసవం అయిన తరవాత ధరించేందుకు వదులుగా ఉండే నూలు దుస్తులు, పొడవాటి చున్నీలు, బాలింతల కోసం ప్రత్యేకించిన బట్టలు, తువాళ్లు, లోదుస్తులు, మెటర్నిటీ ప్యాడ్స్ సర్దుకోవాలి.
- బిడ్డకు పాలిచ్చేటప్పుడు ఒడిలో పెట్టుకోవడానికి మెత్తటి దిండును తీసుకెళ్లాలి.
- రోజువారీగా అవసరమయ్యే టూత్‌బ్రష్, పేస్ట్, సబ్బులు, షాంపూలు, దువ్వెన, లిప్ బామ్, మసాజ్ ఆయిల్ తదితరాలను ఒక బాక్స్‌లో పెట్టుకోవాలి.
- ప్రసవం తరవాత నడవమని వైద్యులు చెబుతుంటారు. మెత్తగా సౌకర్యవంతంగా ఉండే చెప్పుల జతను తీసుకెళ్లాలి. పాదాలను వెచ్చగా ఉంచే సాక్స్ కూడా పెట్టుకోవాలి.
- పుట్టిన బిడ్డకు డైపర్లు అవసరమవుతాయి. వీటితోపాటు పిల్లలకు మాత్రమే ప్రత్యేకించిన ర్యాష్ క్రీమ్‌ను కూడా బ్యాగ్‌లో పెట్టుకోవాలి. అలాగే బిడ్డ కోసం రెండు జతల దుస్తులు, తలకు క్యాప్, కాళ్లకు సాక్స్, చేతులకు మిటెన్స్, బేబీ వైప్స్ లేదా మెత్తని టవల్స్, బేబీ క్యారియర్ లేదా స్లీపింగ్ బ్యాగ్ తీసుకెళ్లాలి.
- ప్రసవం తరవాత ఆకలి ఎక్కువగా ఉంటుంది. తేలికగా జీర్ణమయ్యే చిరుతిళ్లు , డ్రై ఫ్రూట్స్ లాంటివాటిని బాక్స్‌లో పెట్టుకుని తీసుకెళ్లాలి.



పోలీస్ అంటే..
భయం కాదు.. ధైర్యం

ఖాకీ డ్రెస్ వేసుకోవాలి... పోలీస్ ఉద్యోగం చేయాలి... ఈ కల నెరవేర్చుకోవడానికి... అంది వచ్చిన ప్రభుత్వ ఉద్యోగాన్ని వదులుకున్నారు.

ఎందరు నిరుత్సాహపరిచినా, ఎగతాళి చేసినా లెక్క చెయ్యకుండా... పట్టుదలతో శ్రమించి తన లక్ష్యం నెరవేర్చుకున్నారు.

ఇప్పుడు ప్రజలతో మమేకమై వారి మన్ననలతో పాటు సీఎం నుంచి, ఉన్నతాధికారుల నుంచి అభినందలను అందుకుంటున్నారు.

పోలీస్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే తన ఆశయమంటున్న హనుమకొండ జిల్లా వంగర ఎస్ఐ గొల్లపల్లి దివ్య 'నవ్య'తో ప్రత్యేకంగా ముచ్చటించారు.

"మాది కరీంనగర్ జిల్లా కేశవపట్నానికి చెందిన వ్యవసాయ కుటుంబం. అమ్మానాన్నలు సమ్మయ్య, దేవేంద్రలకు నేను, చెల్లి... ఇద్దరు పిల్లలం. "ఇద్దరూ అమ్మాయిలేనా? కొడుకులు లేరా?" అని ఇరుగుపొరుగువారు అనేవారు. "కూతుళ్లయినా, కొడుకులైనా వీళ్లే" అని అమ్మానాన్నా ధైర్యంగా చెప్పేవారు. మమ్మల్ని చదివించడానికి వాళ్లు ఎంత కష్టపడుతున్నారో ప్రత్యక్షంగా చూశాను.

ప్రతి పరీక్షలో టాప్-10లో ఉండాలనే లక్ష్యంతో చదివాను. పదో తరగతి పరీక్షల్లో మా స్కూల్ టాపర్‌గా నిలిచాను. స్టేట్ లెవల్ కూడా టాప్ 10లో ఉన్నాను. బాసర ఐఐఐటీలో నాకు మొదటి కౌన్సెలింగ్‌లోనే సీటు వచ్చింది. అక్కడ బీటెక్ పూర్తి చేసి, ఉద్యోగ వేటలో పడ్డాను.

ఆ ఫొటో చూసి...

వీఆర్‌వో ఉద్యోగాలకు 2021-22లో నోటిఫికేషన్ రావడంతో దరఖాస్తు చేశాను. పరీక్ష రాశాను. మరోవైపు బ్యాంక్ పరీక్షల కోసం సిద్ధమవుతున్నాను. ఆ సమయంలో... కరెంట్ అఫైర్స్ కోసం వార్తా పత్రికలు చదువుతున్నప్పుడు... ఒక ఫొటో నన్ను ఆకర్షించింది. కరీంనగర్ ప్రాంతంలోనే... హేమలత అనే పోలీస్ ఇన్‌స్పెక్టర్ జీపు దగ్గర నిలబడి, ప్రజలతో ఏదో చర్చిస్తున్నట్టున్న ఫొటో అది. 'నేనెందుకు పోలీస్ కాకూడదూ?' అనే ఆలోచన నాలో ఉద్భవించిన క్షణం అది. అప్పటి నుంచి పోలీస్ వృత్తి నా డ్రీమ్ జాబ్‌గా మారిపోయింది. నా ఉద్దేశాన్ని నాన్నకు చెప్పినప్పుడు... "ఎందుకమ్మా పోలీస్ నౌకరీ? ఇంజనీరింగ్ చేశావు కదా... ఏదైనా ఉద్యోగం దొరకదా?" అన్నారు. ఈ సంగతి తెలిసి మా ఊర్లో చాలామంది ఎగతాళి చేశారు. "ఆడపిల్లవు... నీకెందుకు పోలీస్ ఉద్యోగం? ఏదో ఒక చిన్నపాటి నౌకరీ చూసుకొని... మీ అమ్మానాన్నలకు ఆసరాగా ఉండొచ్చు కదా?" అని సలహా ఇచ్చారు.

దాంతో కాస్త నిరుత్సాహానికి గురయ్యాను. ఇంతలో ఎస్ఐ పోస్టులకు నోటిఫికేషన్ వచ్చింది. ఏదైతే అది అవుతుందని దరఖాస్తు చేశారు. "ఆ ఉరుకుడు, దునుకుడు నీ వల్ల అయితదా... నువ్వసలే కొంచెం లావుగా ఉన్నావు" అన్నారు నా స్నేహితుల్లో చాలామంది. ఎవరి మాటలూ పట్టించుకోలేదు. పట్టుదలగా ప్రిపేర్ అయ్యాను. ప్రిలిమినరీ పరీక్షతో పాటు ఫిజికల్ టెస్ట్‌లో కూడా విజయం సాధించాను.

నా కోరిక... వారి ప్రోత్సాహం

ఆ తరువాత... మెయిన్స్ పరీక్షకు సిద్ధమవుతూ ఉండగా.. వీఆర్‌వో పరీక్ష ఫలితాలు వచ్చాయి. రాజన్న-సిరిసిల్ల జిల్లాలో నాకు ఉద్యోగం వచ్చింది. అందులో చేరిపోవాలనీ, దీన్ని వదులుకున్నాక... ఎస్ఐ మెయిన్స్‌లో క్వాలిఫై కాకపోతే... రెండిటికీ చెడినట్టు అవుతుందనీ ఎందరో చెప్పారు. "అసలే మీది బీద కుటుంబం. ఆలోచించుకో" అన్నారు. అయితే... ఖాకీ డ్రెస్ ధరించాలన్న నా బలమైన కోరికకు... మా అమ్మానాన్నల ప్రోత్సాహం తోడై, నాలో ఉత్సాహాన్ని నింపింది. "మా గురించి ఆలోచించకు బిడ్డా... నీకు ఏది మంచిదనిపిస్తే అది చెయ్యి. కానీ ఒకటికి రెండుసార్లు ఆలోచించి నిర్ణయం తీసుకో" అని వారు చెప్పడంతో... ఎస్ఐ ఉద్యోగం వైపే ధైర్యంగా మొగ్గుచూపాను. మెయిన్ పరీక్షలో ఉత్తీర్ణురాలిని అయ్యాను. ఎస్ఐ శిక్షణ తరువాత... వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో ఉద్యోగం వచ్చింది. మొదట మడికొండ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పోస్టింగ్ ఇచ్చారు. తరువాత ఇటీవలే వంగరకు ఎస్‌హెచ్‌ఓగా బదిలీ అయ్యాను. వంగర... మాజీ ప్రధానమంత్రి పి.వి.నరసింహారావు గారి స్వగ్రామం. ఇక్కడి పోలీస్ స్టేషన్ పరిధిలో చాలా తక్కువ గ్రామాలు ఉన్నాయి. ఎక్కువగా కుటుంబ కలహాలు, భూవివాదాల కేసులే వస్తూ ఉంటాయి. కాగా... ఈ మధ్య ఒక యువకుడు గంజాయి తాగుతూ దొరికిపోయాడు. హైదరాబాద్ నుంచి అతని స్నేహితుడు గంజాయి పంపినట్టు విచారణలో తేలింది. దీని గురించి మా పై అధికారులకు సమాచారం ఇచ్చాం. యువత బాధ్యతగా ఉండాలి. గంజాయి, డ్రగ్స్‌కు బానిసలై, సైబర్ మోసాలకు పాల్పడి, తమ జీవితాలను నాశనం చేసుకోకూడదు.

> "ఇటీవల 'ఆంధ్ర జ్యోతి'లో... 'వారెవ్వా... వంగర పోలీస్' అనే కథనం రావడం, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, మా డీజీపీ అభినందనలు తెలపడం జీవితంలో మరచిపోలేను. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'కి ప్రత్యేక ధన్యవాదాలు. అదే స్ఫూర్తితో పేదలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేసేందుకు కృషి చేస్తాను."

ఆ భయం పోగొట్టడానికి...

పోలీసు వాహనాన్ని చూస్తేనే ప్రజలకు భయం. ఏదైనా సమాచారం అడిగినా... చెప్పడం లేదు. వారి ఇంటి పక్కన నేరస్తుడు ఉన్నా.. చెప్పే పరిస్థితి లేదు. పోలీసు వాహనాల్లో వెళ్లడం వల్ల ప్రజలకు దగ్గర కాలేకపోతున్నామని గ్రహించాం. అందుకే సైకిళ్లు కొనుగోలు చేశాం. రోజూ ఉదయం సైకిళ్లపై గ్రామాలకు వెళ్తున్నాం. దాంతో ప్రజలు మమ్మల్ని ఆసక్తిగా చూడడంతో పాటు మాతో మాట్లాడడానికి ముందుకు వస్తున్నారు. ఊరి సమస్యలను వారితో చర్చిస్తున్నాం. ఊరికి ఎవరైనా కొత్తగా వచ్చినా, అనుమానాస్పదంగా కనిపించినా మాతో చెబుతున్నారు. మాదక



ద్రవ్యాలు వాడుతున్నవారి వివరాలు కూడా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో.. యువత డ్రగ్స్‌కు బానిసలు కాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నాం. కాగా.... వివిధ సమస్యలతో పాటు పిల్లలు పట్టించుకోవడం లేదని వృద్ధులు చేసే ఫిర్యాదులు కూడా వస్తున్నాయి. వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నాం. మొత్తంగా మాకు వచ్చిన ఈ ఆలోచన ప్రజలకు ప్రయోజనకరంగా ఉండడం, నేరాలను అరికట్టేందుకు... ముఖ్యంగా ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు ఉపయోగపడడం ఆనందంగా ఉంది.

• తడుక రాజనారాయణ
ఫొటోలు: వీరగోని హరీష్



ఈ ఆశ్రయం... మెరుగైన ప్రపంచం కోసం

వైకల్యం ఉందని కుంగిపోలేదు. సవాళ్లు ఎదురైనా భయపడలేదు. నిర్దేశించుకున్న గమ్యాన్ని చేరుకోవడానికి ఎంతటి శ్రమనైనా లెక్క చేయలేదు. మూడేళ్లకే పోలియో బారిన పడిన డాక్టర్ ఐశ్వర్యారావు విధిని ఎదిరించి గెలిచారు. వైద్యురాలిగా సేవలందిస్తూనే... నిలువనీడలేని వికలాంగ మహిళలకు ఆశ్రయం కల్పిస్తున్నారు. ఈ మధ్యే వారి కోసం ప్రత్యేకంగా ఒక జిమ్ కూడా ఏర్పాటు చేసి, పారా క్రీడలను ప్రోత్సహిస్తున్నారు. చెన్నైకి చెందిన 52 ఏళ్ల ఐశ్వర్య స్ఫూర్తిమంతమైన ప్రయాణం గురించి ఆమె మాటల్లోనే...

"మాది విద్యావంతుల కుటుంబం. మా నాన్న ఐఎఎస్ అధికారి. నన్ను బాగా చదివించాలనేది ఆయన కోరిక. కానీ తొమ్మిదేళ్లు వచ్చేదాకా నేను బడికే వెళ్లలేదు. కారణం... నాకు మూడేళ్ల వయసులో పోలియో సోకింది. నా కండరాలన్నీ బలహీనమైపోయాయి. కాళ్లను స్వతంత్రంగా కదపలేకపోయేదాన్ని. నా తల్లిదండ్రులు ఎన్నో ఆసుపత్రులకు తిరిగారు, ఎందరో వైద్యులను కలిశారు. కానీ పెద్దగా ప్రయోజనం కలగలేదు. అలా ఆరేళ్లపాటు ఇంటికే పరిమితమైపోయాను. ఇంట్లోనే అమ్మ దగ్గర రాయడం, చదవడం నేర్చుకున్నాను. నన్ను బడికి పంపడానికి మొదట్లో సంకోచించినా... నా ఉత్సాహం చూసి నాన్న ఒప్పుకున్నారు. అదృష్టవశాత్తూ ఒక స్కూల్‌లో నన్ను చేర్చుకోవడానికి ప్రిన్సిపాల్ అంగీకరించారు. కొన్ని పరీక్షలు పెట్టి... మూడో తరగతిలో అడ్మిషన్ ఇచ్చారు. అప్పుడు నాకు తొమ్మిదేళ్లు.

కొత్త ప్రపంచంలో...

స్కూల్ అనేది అప్పటికి నాకు పూర్తిగా కొత్త ప్రపంచం. 'అక్కడ ఎలా నెగ్గుకొస్తానా?' అనే అనుమానాలతోనే తరగతి గదిలోకి అడుగుపెట్టాను. అయితే తోటి విద్యార్థులు స్నేహపూర్వకంగా ఆహ్వానించారు. దాంతో నాకున్న సంకోచాలన్నీ మాయమయ్యాయి. అందరిలాగే నేను కూడా ఏదైనా సాధించగలననే ఆత్మవిశ్వాసం కలిగింది. చదువులో ఒక్కొక్క మెట్టూ ఎక్కాను. ఇంటర్ తరువాత... నాకు ఆరు ఇంజనీరింగ్ కళాశాలల్లో, ఒక మెడికల్ వైద్య విశ్వవిద్యాలయంలో సీట్లు వచ్చాయి. తీవ్రంగా ఆలోచించిన తరువాత... వైద్య విద్యవైపే మొగ్గు చూపాను. 1996లో ఎంబీబీఎస్ పూర్తయ్యాక, శిశు వైద్యంలో డిప్లమా చేశాను. పేదలకు, వైకల్యాలు ఉన్నవారికి ఏదైనా చేయాలని అప్పుడే నిర్ణయించుకున్నాను. అందుకే విద్య, ఆరోగ్య సంరక్షణ, అత్యవసర సేవలు తదితర అంశాల్లో ఆ సంస్థ సేవలు అందించే 'వరల్డ్ విజన్ అనే స్వచ్ఛంద సంస్థలో చేరాను. కొన్నేళ్ళ తరువాత.. హెచ్ఐవి చికిత్సలోనూ నైపుణ్యం సంపాదించాను. ప్రభుత్వం చేపట్టిన ఎయిడ్స్ నిరోధక కార్యక్రమాల్లో భాగస్వామిని అయ్యాను. మరోవైపు 'భారత వైద్య పరిశోధన మండలి' (ఐసిఎంఆర్)లో పరిశోధకురాలుగా పని చేశాను. కానీ వాటన్నిటినీ వదిలేయాల్సిన పరిస్థితి ఎదురయింది.

కన్నీళ్లు ఆగలేదు...

ఒక రోజు ఇంట్లో జారి పడిపోవడంతో నా తుంటి ఎముక విరిగిపోయింది. శస్త్రచికిత్స చేయించుకున్నాక... కొన్నాళ్లపాటు కదలకుండా మంచం మీదే ఉండాల్సి వచ్చింది. దాంతో నా ఉద్యోగాన్ని, ఇతర కార్యకలాపాల్ని వదిలేయాలని నిర్ణయించుకున్నాను. చికిత్స కోసం ఆసుపత్రికి వెళ్తున్నప్పుడు... వైకల్యాలున్న మహిళలు ఎందరో కనిపించేవారు. వారి కష్టాలు, సామాజికంగా వారు ఎదుర్కొంటున్న వివక్షలు, అవమానాలు, ఎగతాళి వ్యాఖ్యల గురించి తెలుసుకున్నాక నాకు కన్నీళ్లు ఆగలేదు. కుటుంబ సభ్యులు పట్టించుకోని, నిలువనీడలేని మహిళల కోసం సురక్షితమైన ఒక ఆశ్రయాన్ని కల్పించాలనీ, వారికి నైపుణ్య శిక్షణ ఇచ్చి... గౌరవంతో జీవించే దారి చూపించాలనీ అనుకున్నాను. చెన్నైలోని నూగంబాక్కంలో 'బెటర్ వరల్డ్ షెల్టర్' పేరిట వైకల్యాలు ఉన్న మహిళల పునరావాస కేంద్రాన్ని ప్రారంభించాను. గతంలో ప్రభుత్వ సంస్థలతో పని చెయ్యడం వల్ల అధికారులతో నాకు ఉన్న పరిచయాలు ఉపయోగపడ్డాయి. చెన్నై కార్పొరేషన్, తమిళనాడు ప్రభుత్వం మా కేంద్రానికి నిధులు కేటాయించాయి. అయితే అవి చాలకపోవడంతో నా సొంత డబ్బు ఖర్చు పెట్టడం, నగలు తాకట్టు పెట్టడం తరచుగా జరుగుతూనే ఉంది. ప్రస్తుతం మా కేంద్రంలో దాదాపు 75 మంది ఆశ్రయం పొందుతున్నారు. వారికి విద్యతోపాటు కుట్టుపని, ఆభరణాల తయారీ, ఎంబ్రాయిడరీ, పారా క్రీడలు తదితర అంశాల్లో నిపుణుల ద్వారా శిక్షణ ఇస్తున్నాం.అలాగే ఉద్యోగాల కోసం, స్వయంఉపాధి కోసం, వివాహాల కోసం అవసరమైన సాయం అందిస్తున్నాం.


అన్నీ ఉచితంగానే...

కొన్నేళ్ళుగా పారా క్రీడలకు ఆదరణ పెరగడం, వాటిలో పాల్గొనాలనే ఆసక్తి చాలామందిలో ఉండడం గమనించాను. మా కేంద్రంలో ఉంటూ జాతీయ స్థాయిలో పతకాలు సాధించినవారు కూడా ఎంతోమంది ఉన్నారు. అయితే వారు అభ్యాసం చెయ్యడానికి తగిన సౌకర్యాలు సాధారణ వ్యాయామశాలల్లో ఉండవు. అంతే కాదు, దానికి అయ్యే ఖర్చు ఎక్కువ. సామాజికమైన ఇబ్బందులూ ఉంటూనే ఉంటాయి. ఈ విషయంపై రాష్ట్ర క్రీడామంత్రికి ఒక లేఖ రాశాను. దానికి సానుకూలమైన స్పందన లభించడంతో... ఈ ఏడాది మార్చిలో... ప్రభుత్వ సాయంతో ఒక జిమ్‌ను ఏర్పాటు చేశాను. దీనికోసం మా 'బెటర్ వరల్డ్ షెల్టర్'ను కొత్త భవనంలోకి మార్చాం. అత్యాధునికమైన, వైకల్యాలు ఉన్నవారికి అనువైన సదుపాయాలన్నీ ఇక్కడ ఉన్నాయి. పలువురు మా కేంద్రంలోనే ఆశ్రయం పొందుతూ సాధన చేస్తున్నారు. వారికి అన్నీ ఉచితంగానే సమకూరుస్తున్నాం. ఈ పారా-అథ్లెట్లలో 38 ఏళ్ళ నదియా ఒకరు. ఆమె ఇప్పటికే దాదాపు నలభై వరకూ జాతీయ, రాష్ట్ర స్థాయి టోర్నమెంట్లలో పాల్గొని పతకాలు గెలుచుకున్నారు. అలాగే 41 ఏళ్ళ ఏళ్ళ మేరీ, 38 ఏళ్ళ జెనీతా, 50 ఏళ్ళ మెటిల్డా... వీరందరూ వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ ప్లేయర్లు. జిమ్‌కు వచ్చే యువతుల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది. మా కేంద్రానికి సమీపంలో ఉన్నవారు తమ ఇళ్ళ నుంచి వచ్చి శిక్షణ పొందుతున్నారు. ఇప్పటివరకూ కొన్ని వందలమంది మహిళలకు మా కేంద్రం అండగా నిలిచింది. పట్టుదల, దృఢ సంకల్పం ఉంటే ఏ వైకల్యమూ ఆపలేదు. ఎన్ని సవాళ్ళు వచ్చినా ఎదిరించి... జీవితంలో నిలదొక్కుకోవాలనుకొనేవారికి చేయూతనివ్వడం నాకు సంతోషాన్నీ, సంతృప్తినీ కలిగిస్తోంది. 'మెరుగైన ప్రపంచానికి దోహదం చేసే ఆశ్రయం'గా మా కేంద్రం గుర్తుండిపోవాలన్నదే నా ఆశయం."



పిగ్మెంటేషన్ తగ్గిద్దామిలా

చాలా మంది మహిళలను ఇబ్బంది పెట్టే సమస్య పిగ్మెంటేషన్ (మంగు మచ్చలు). ఈ మచ్చలను ఇంట్లోనే ఎలా తగ్గించుకోవచ్చో తెలుసుకుందాం..



- ఒక టేబుల్ స్పూన్ తేనెలో ఒక టేబుల్ స్పూన్ కలబంద గుజ్జును కలిపి మచ్చల మీద రాసి అరగంట సేపు తరువాత కడిగేయాలి.
- పుదీనా ఆకులను రుబ్బి ఆ పేస్టును మచ్చల మీద రాయాలి. పావుగంట తరువాత కడిగేయాలి.
- రెండు టేబుల్ స్పూన్ల ఓట్ మీల్, టేబుల్ స్పూన్ పెరుగు, కొంచెం టమాటా రసం వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని మంగు మచ్చలపై రాసి ఇరవై నిమిషాల తరువాత కడిగేయాలి.
- నారింజ తొక్కను ఎండబెట్టి పొడి చేసుకుని అందులో కొన్ని పాలు పోసి పేస్ట్‌లా చేసుకోవాలి. దీనిని మచ్చలపై రాయాలి. ఆరిన తరువాత చల్లటి నీళ్లతో కడిగేసుకోవాలి.
- బంగాళదుంపల రసాన్ని మచ్చల మీద రాసి అరగంట తరువాత కడిగేసుకోవాలి.
- పసుపులో పాలు పోసి పేస్ట్‌లా కలుపుకోవాలి. దీనిని మచ్చల మీద రాసి 20 నిమిషాల తరువాత కడిగేసుకోవాలి.
- వాడిన గ్రీన్ టీ బ్యాగులతో మచ్చల మీద రుద్దాలి. రోజుకు రెండుసార్లు ఇలా చేస్తే మచ్చలు తగ్గుతాయి.
- యాపిల్ సైడర్ వెనిగర్, నీళ్లు సమపాళ్లలో తీసుకుని కలిపి ఆ మిశ్రమాన్ని దూదితో మచ్చల మీద అద్దాలి. 5 నిమిషాల తరువాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. రోజూ రెండుసార్లు ఇలా చేయాలి.
- రాత్రి పడుకునే ముందు కలబంద గుజ్జును రాసుకుని, ఉదయాన్నే గోరువెచ్చని నీటితో కడిగేసుకోవాలి. రోజూ ఇలా చేయడం వలన మంచి ఫలితం ఉంటుంది.

బీట్‌రూట్ ప్రయోజనాలెన్నో!

విటమిన్లు, ప్రొటీన్లు పుష్కలంగా ఉండే బీట్‌రూట్ తినడానికి చాలామంది ఇష్టపడరు. కానీ దీనిని రోజూ తినడం వలన బోలెడు ప్రయోజనాలు ఉన్నాయి. ఆ వివరాలివి..

- బీట్‌రూట్‌లో సహజ నైట్రేట్‌లు పుష్కలంగా ఉంటాయి. అవి రక్త ప్రసరణను మెరుగుపరచడంలో సహాయపడతాయి.
- ఇందులోని విటమిన్ బి, సిలు రక్తపోటును నియంత్రించి, గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి.
- బీట్‌రూట్ శరీరంలోని విష పదార్థాలను తొలగిస్తుంది. కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుతుంది.
- బీట్‌రూట్‌లో ఐరన్ ఉంటుంది. ఇది రక్తహీనతను తగ్గిస్తుంది. పీచు పదార్థాలు జీర్ణవ్యవస్థను పనితీరును మెరుగుపరుస్తాయి.
- బీట్‌రూట్‌తో ఆరోగ్యమే కాదు అందమూ సొంతమవుతుంది. దీనిలోని విటమిన్లు చర్మాన్ని నిగారింపుకు సహాయపడతాయి. మొటిమలు మచ్చలను యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు, విటమిన్ సి తగ్గిస్తాయి.
- కాబట్టి అప్పుడప్పుడు బీట్‌రూట్ రసాన్ని ముఖానికి రాసుకోవాలి.



స్పోర్ట్స్

అదే నా కర్తవ్యం

జట్టును సమష్టిగా ఉంచుతా
టీమిండియా కెప్టెన్ గిల్



లండన్: జట్టులో ఆనందకరమైన, ఏ మాత్రం అభద్రతకు తావులేని వాతావరణాన్ని నెలకొల్పుతానని టీమిండియా కొత్త సారథి శుభ్‌మన్ గిల్ స్పష్టం చేశాడు. అతడి ఆధ్వర్యంలో తొలిసారిగా ఇంగ్లండ్ పర్యటనకు వచ్చిన భారత జట్టు ఈనెల 20 నుంచి ఐదు టెస్టుల సిరీస్‌లో తలపడనుంది. ఈ సందర్భంగా ఓ క్రీడా ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో గిల్ పలు అంశాలపై మాట్లాడాడు. 'జట్టుకు విజయాలు, ట్రోఫీలు అందించడమే కాకుండా ఆటగాళ్లంతా సౌకర్యవంతంగా, సంతోషంగా ఉండే సంస్కృతిని నెలకొల్పుతా. అలా అయితేనే ఒత్తిడికి లోనుకాకుండా ఆటగాడిలో నైపుణ్యం బయటపడుతుంది. నాయకుడిగా నా కర్తవ్యం కూడా అదేనని భావిస్తా. ఆరంభంలో ఇది కష్టమే కావచ్చు. కానీ ప్రయత్నిస్తే సాధ్యం కానిది లేదు. ఇక మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ గురించి మాట్లాడుతూ... అతను మైదానంలో దూకుడుగా కనిపించకపోవచ్చు. కానీ అతని వ్యూహరచన మాత్రం దూకుడుగానే ఉంటుంది. ఆటగాళ్ల నుంచి తానేం ఆశిస్తున్నాడో సిరీస్‌కు ముందే స్పష్టంగా చెప్పేవాడు. డ్రెస్సింగ్‌రూమ్‌లోనూ చక్కటి వాతావరణాన్ని నెలకొల్పాడు. మైదానంలో అతడి చేత చీవాట్లు తిన్నా దాన్ని ఎవరూ వ్యక్తిగతంగా తీసుకునేవారు కాదు. జట్టు విజయం కోసమే అలా చేస్తున్నాడని అంతా భావించేవారు' అని గిల్ తెలిపాడు. కాగా కోచ్ గౌతమ్ గంభీర్‌లో అంకితభావం ఎక్కువని, ఆటగాళ్లతో చాలా స్పష్టంగా ఉంటాడని అన్నాడు. ఇక స్టార్ పేసర్ బుమ్రాపై అధిక భారం పడకూడదని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తున్నట్టు గిల్ తెలిపాడు. సిరీస్‌లో అన్ని మ్యాచ్‌లను తను ఆడే అవకాశం లేదని ఇప్పటికే చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ సైతం తెలిపాడు. 'ప్రతీ మ్యాచ్ తర్వాత అతడిపై పడే పని ఒత్తిడి భారాన్ని పరిశీలిస్తాం. అంతేకానీ ముందే ఫలానా మ్యాచ్ ఆడతాడనే నిర్ణయాన్ని తీసుకోలేం' అని గిల్ తేల్చాడు. మరోవైపు ఇంగ్లండ్ బజ్‌బాల్ గేమ్‌ను ఎదుర్కొనేందుకు తాము ఎలాంటి ప్రణాళికలను రచించలేదని చెప్పాడు. 'నేను ఎలా ఉండాలనుకుంటున్నానో ముందస్తుగా ఆలోచించడం ఇష్టముండదు. దూకుడుగా ఆడితే అంతే వేగంగా వికెట్లు కోల్పోయే అవకాశం కూడా ఉంటుంది' అని కెప్టెన్ గిల్ తెలిపాడు.



గంభీర్ బాధ్యతలు లక్ష్మణ్‌కు!

బెకెన్‌హామ్ (కెంట్): ఇంగ్లండ్‌తో తొలి టెస్ట్‌కు భారత జట్టు సన్నాహకం ఊపందుకుంది. ఈనెల 20 నుంచి జరిగే మొదటి టెస్ట్‌కు.. నాలుగు రోజుల ఇంట్రా స్క్వాడ్ మ్యాచ్‌ను భారత్ ఆడుతున్న సంగతి తెలిసిందే. మ్యాచ్ ఆదివారం, మూడోరోజు కూడా జోరుగా సాగింది. మొదటి టెస్ట్‌కు ఆల్‌రౌండర్ స్థానానికి తెలుగు ఆటగాడు నితీశ్ కుమార్‌తో పోటీపడుతున్న శార్దూల్ ఠాకూర్ మూడో రోజు ఆటలో శతకం బాదాడు. మొదటి రోజు బౌలింగ్‌లో ఆకట్టుకున్న శార్దూల్..బ్యాట్‌తోనూ సత్తా నిరూపించుకోవడం విశేషం. 2023లో చివరి టెస్ట్ ఆడిన ఠాకూర్ రెండోరోజు 19 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఆ ఇన్నింగ్స్‌ను కొనసాగించి అజేయ సెంచరీ(122 నాటౌట్)తో మెరిశాడు. తద్వారా తొలి టెస్ట్‌కు తుది జట్టు రేస్‌లో బలంగా నిలిచాడు. కాగా..శనివారం ఆటలో భారత్ 'ఎ' బ్యాటర్ సర్ఫ్‌రాజ్ శతకంతో చెలరేగాడు. ఇక..చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్, బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ హెడ్ వీవీఎస్ లక్ష్మణ్ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు తల్లి అనారోగ్యం కారణంగా స్వదేశం వెళ్లిన గంభీర్ తిరిగొచ్చేవరకు వీవీఎస్ లక్ష్మణ్ తాత్కాలిక కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నట్టు తెలిసింది.

ఆర్చరీ వరల్డ్‌కప్ స్టేజ్-4కు
జ్యోతి, చికిత, ధీరజ్

పుణె: ఆర్చరీ వరల్డ్‌కప్ స్టేజ్-4కు తెలుగు ప్లేయర్లు జ్యోతి సురేఖ, చికిత, ధీరజ్ బొమ్మదేవర ఎంపిక కాగా.. ఒలింపియన్ అతాను దాస్, సీనియర్ ప్లేయర్ అభిషేక్ వర్మకు సెలెక్షన్ ట్రయల్స్‌లో షాక్ తగిలింది. మహిళల రికర్వ్ టీమ్‌లో వెటరన్ దీపికా కుమారి, అంకిత భక్త్‌తోపాటు మహారాష్ట్రకు చెందిన 15 ఏళ్ల టీనేజర్లు గథా ఖడాకే, శార్వరి షిండే అర్హత సాధించారు. వరల్డ్‌కప్ స్టేజ్-4 మాడ్రిడ్‌లో వచ్చే నెల 8 నుంచి 13 వరకు జరగనుంది. మహిళల కాంపౌండ్ ఆర్చరీ టీమ్‌లో జ్యోతి సురేఖ టాప్‌లో నిలవగా.. పర్ణీత్ కౌర్, ప్రీతిక ప్రదీప్, చికిత తర్వాతి స్థానాలు దక్కించుకొన్నారు. ట్రయల్స్‌లో టాప్-3లో నిలిచిన వారు మాత్రమే సెప్టెంబరులో జరిగే వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో పాల్గొనేందుకు అర్హులు.

నాన్నకు ప్రేమతో..
కోహ్లీకి వామిక క్యూట్ సర్‌ప్రైజ్



న్యూఢిల్లీ: ఫాదర్స్ డేను పురస్కరించుకొని కోహ్లీకి అతడి కుమార్తె వామిక ముద్దుముద్దుగా శుభాకాంక్షలు చెప్పింది. చేతితో రాసిన నోట్‌పై వామిక సంతకం చేయగా.. ఆ నోట్ ఫొటోను అనుష్క ఇన్‌స్టాలో పంచుకొంది. తన తండ్రి కల్నల్ అజయ్ కుమార్‌కు విషెస్ తెలిపిన అనుష్క.. వామిక నోట్‌ను కూడా షేర్ చేసి ఆశ్చర్యపర్చింది. 'అతడు నా సోదరుడులా ఉంటాడు. ఎంతో సరదాగా ఉంటాడు. నాకు గిలిగింతలు పెడతాడు. మేకప్ చేసే ఆటలు ఆడుకుంటాం. నన్ను ఎంతో ప్రేమిస్తాడు.. నేను కూడా అదే విధంగా ప్రేమిస్తా' అని ఆ నోట్‌లో ఉంది.

ఆ జట్టులో విషపు వ్యక్తులున్నారు!
ఢిల్లీపై డివిల్లీర్స్ సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికా దిగ్గజం ఏబీ డివిల్లీర్స్.. ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) తరఫున అద్భుత ప్రదర్శన కనబరచాడు. 2008 నుంచి 2010 వరకు మూడేళ్లపాటు ఢిల్లీ డేర్‌డెవిల్స్ తరఫున ఆడిన డివిల్లీర్స్ ఆ తర్వాత బెంగళూరుకు మారాడు. అయితే, బెంగళూరు జట్టు తరఫున రాణించిన తరహాలో ఢిల్లీకి ఆడలేకపోయాడు. అందుకు గల కారణాన్ని అతడు ఇప్పుడు బయటపెట్టాడు. తాను ఆడే రోజుల్లో 'ఢిల్లీలో విషపు మనస్తత్వం గల వారున్నార'ని చెప్పాడు. కానీ, వారి పేర్లను మాత్రం బయటపెట్టలేదు. 'వారి పేర్లు పలకడం కూడా ఇష్టంలేదు. ఎప్పుడూ రగిలిపోతూ.. విషాన్ని చిమ్ముతుండేవారు. అయితే, మెక్‌గ్రాత్, వెటోరి లాంటి వారితో ఆడడం తీపి జ్ఞాపకమ'ని డివిల్లీర్స్ చెప్పాడు.



జాతీయ జట్టు కంటే ఐపీఎల్ ముఖ్యమా?
ఆసీస్ బౌలర్లపై జాన్సన్ ఆగ్రహం

మెల్‌బోర్న్: ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్లో దక్షిణాఫ్రికా చేతిలో ఓటమి చవిచూసిన ఆస్ట్రేలియాపై స్వదేశంలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఆసీస్ మాజీ పేసర్, కామెంటేటర్ మిచెల్ జాన్సన్ జట్టు బౌలింగ్ విభాగంపై నిప్పులు చెరిగాడు. పేసర్లు మిచెల్ స్టార్క్, కెప్టెన్ పాట్ కమిన్స్, హాజెల్‌వుడ్, స్పిన్నర్ నాథన్ లియాన్‌కు భవిష్యత్‌లో జట్టులో చోటు కల్పించకూడదని తేల్చేశాడు. పైగా..తమ బౌలర్లంతా జాతీయ జట్టుకు కాకుండా ఐపీఎల్‌కు ప్రాధాన్యమివ్వడాన్ని జాన్సన్ ఆక్షేపించాడు. ముఖ్యంగా డబ్ల్యూటీసీ ఫైనల్లో కేవలం రెండు వికెట్లే తీసిన పేసర్ హాజెల్‌వుడ్‌ను తప్పుపట్టాడు. భారత్-పాకిస్థాన్ యుద్ధం కారణంగా కొద్దిరోజులు వాయిదాపడి పునఃప్రారంభమైన ఐపీఎల్‌లో పాల్గొనేందుకు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఆటగాడు హాజెల్‌వుడ్ గాయాన్ని లెక్క చేయకుం డా స్వదేశం నుంచి మళ్లీ భారత్ వెళ్లిన సంగతి తెలిసిందే. 'స్టార్క్, కమిన్స్, హాజెల్‌వుడ్, లియాన్‌తో కూడిన మా 'బిగ్ ఫోర్' బౌలింగ్ విభాగం వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్లో విఫలం కావడాన్ని తేలిగ్గా తీసుకోకూడదు. వారికి భవిష్యత్‌లో జట్టులో చోటు గ్యారెంటీ కాకూడదు. జట్టులో యువ రక్తాన్ని నింపడంపై సెలెక్టర్లు దృష్టి సారించాలి' అని మిచెల్ జాన్సన్ సూచించాడు.

అర్జున్ బృందానికి నిరాశ
వరల్డ్ బ్లిట్జ్ టీమ్ చెస్ నాకౌట్‌లో ఓటమి



లండన్: ఫిడే వరల్డ్ ర్యాపిడ్ టీమ్ చాంపియన్‌షిప్‌ను గెలుచుకున్న ఉత్సాహంలో.. బ్లిట్జ్ టైటిల్‌నూ సొంతం చేసుకోవాలనుకున్న భారత గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఇరిగేసి సారథ్యంలోని ఎంజీడీ1 జట్టుకు నిరాశే ఎదురైంది. అర్జున్, హరికృష్ణ, ప్రణవ్, ల్యూక్ మెన్‌డోన్కా, స్టరౌలా సొలాకిడో, అథర్వ టయాడేతో కూడిన ఈ బృందానికి నాకౌట్‌లో చుక్కెదురైంది. అర్జున్ జట్టును హెక్సామైండ్ జట్టు ఓడించి సెమీఫైనల్ చేరింది. ఇక, విశ్వనాథన్ ఆనంద్ సారథ్యంలోని ఫ్రీడమ్ జట్టుకూ నిరాశ తప్పలేదు. నాకౌట్‌లో ఫ్రీడమ్ టీమ్‌పై కజ్ చెస్ జట్టు గెలిచింది. ఇతర నాకౌట్ మ్యాచుల్లో అష్డోద్ ఎలీట్ క్లబ్‌పై ఉజ్బెకిస్థాన్, జర్మనీ అండ్ ఫ్రెండ్స్‌పై డబ్ల్యూఆర్ చెస్ విజయం సాధించాయి. ఆ తర్వాత జరిగిన సెమీఫైనల్స్‌లో హెక్సామైండ్‌ను డబ్ల్యూఆర్ఎస్ చెస్ జట్టు, ఉజ్బెకిస్థాన్‌ను కజ్ చెస్ జట్టు ఓడించి ఫైనల్ బెర్త్‌ను దక్కించుకున్నాయి.



మాపై స్లెడ్జింగ్‌కు దిగారు
సఫారీ సారథి బవుమా

లండన్: వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్లో తమను మానసికంగా దెబ్బతీసేందుకు ఆస్ట్రేలియా జట్టు స్లెడ్జింగ్‌కు దిగిందని దక్షిణాఫ్రికా కెప్టెన్ బవుమా ఆరోపించాడు. నాలుగో రోజు ఆటలో సఫారీలు తమ విజయానికి 69 పరుగుల దూరంలో ఉండగా.. తొలి సెషన్‌లో ఆసీస్ మాటల యుద్ధానికి దిగిందట. 'మేం బ్యాటింగ్ చేసే సమయంలో చోకర్స్ అనే మాట కూడా వినాల్సి వచ్చింది. ఓ ప్లేయర్ అయితే 60 పరుగుల్లోపే మిగిలిన 8 వికెట్లు కూడా కోల్పోతారంటూ ఎద్దేవా చేశాడు. మార్‌క్రమ్ మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ వాటిని పట్టించుకోవద్దని చెప్పాడు' అని బవుమా తెలిపాడు.

కెప్టెన్సీ సమయంలో జుత్తు ఊడిపోయింది

లంక ఆల్‌రౌండర్ మాథ్యూస్



గాలె: శ్రీలంక ఆల్‌రౌండర్ ఏంజెలో మాథ్యూస్ టెస్ట్‌లకు రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. మంగళవారం నుంచి బంగ్లాదేశ్‌తో గాలెలో జరిగే టెస్టు అతడి కెరీర్‌లో చివరిది. 25 ఏళ్లకే సారథిగా బాధ్యతలు చేపట్టిన మాథ్యూస్ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నాడు. అయితే, సారథ్యం చేపట్టిన తర్వాత తన జుత్తు ఎంతో ఊడిపోయిందన్నాడు. 'జట్టు పగ్గాలు అందుకొన్న తర్వాత జుత్తు బాగా రాలిపోయింది. ప్రతి కెప్టెన్ పరిస్థితి ఇంతే. దేశానికి ప్రాతినిధ్యం వహించడం వేరు.. సారథ్యం వహించడం వేరు. ప్రతీసారి అదనపు బాధ్యత తీసుకోవాల్సి ఉంటుంది. దృష్టంతా మనమీదే ఉంటుంది. మనం ఏం మాట్లాడతామో వినాలనుకొంటారు. కొన్నిసార్లు ఇబ్బందిగా అనిపించినా.. ఎంతో ఆస్వాదించా. విమర్శలను తట్టుకోలేక సారథ్యం వదిలేయాలని అనుకొనే వాడిని. కానీ, జట్టును మరోస్థాయికి తీసుకెళ్లడానికి అవకాశం వచ్చిందని నాకు నేను నచ్చజెప్పుకొనే వాడిన'ని మాథ్యూస్ తెలిపాడు.

మూడో టీ20లో ఐర్లాండ్‌పై విండీస్ విజయం

బ్రీడీ: ఐర్లాండ్‌తో జరిగిన మూడో టీ20లో వెస్టిండీస్ 62 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. దీంతో సిరీస్‌ను కూడా 1-0తో గెలుచుకుంది. తొలి రెండు మ్యాచ్‌లు వర్షం కారణంగా రద్దయ్యాయి. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన విండీస్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 256 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్లు ఎవిన్ లెవిస్ (91), హోప్ (51) తొలి వికెట్‌కు 122 పరుగులు జత చేశారు. చివర్లో కీసీ కార్టీ (49 నాటౌట్), షెఫర్డ్ (19 నాటౌట్) చెలరేగారు. మాథ్యూ రెండు వికెట్లు తీశాడు. ఆ తర్వాత ఛేదనలో ఐర్లాండ్ 20 ఓవర్లలో 194/7 స్కోరుకే పరిమితమై ఓటమి పాలైంది. రాస్ ఎడెయిర్ (48), టెక్టర్ (38), మార్ ఎడెయిర్ (31 నాటౌట్) మాత్రమే రాణించారు. హోసేన్‌కు మూడు, హోల్డర్‌కు రెండు వికెట్లు దక్కాయి.

హాకీలో అదే వరస..
ప్రొ. లీగ్‌లో పురుషులు, మహిళల జట్ల ఓటమి

లండన్/ఆంట్వెర్ప్: ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్‌లో భారత హాకీ జట్లకు మళ్లీ ఓటమి ఎదురైంది. పురుషుల జట్టు వరుసగా ఆరో పరాజయాన్ని చవిచూడగా.. మహిళల బృందం వరుసగా రెండో మ్యాచ్‌లో ఓటమిపాలైంది. లండన్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో భారత మహిళలు 1-2తో ఆస్ట్రేలియా ధాటికి తలొంచారు. యూరోపియన్ లెగ్‌లో భాగంగా ఆదివారం బెల్జియంలోని ఆంట్వెర్ప్‌లో జరిగిన మ్యాచ్‌లో భారత పురుషుల జట్టు 2-3తో ఆస్ట్రేలియా చేతిలో చిత్తయింది. భారత్ ఇప్పటికే నెదర్లాండ్స్, అర్జెంటీనా జట్లతో రెండేసి మ్యాచ్‌లను కోల్పోయిన సంగతి తెలిసిందే.

బిజినెస్

రాష్ట్రాల పీఎస్‌యూల కోసం కాగ్ ప్రత్యేక యూనిట్

న్యూఢిల్లీ: వివిధ రాష్ట్ర ప్రభుత్వాల యాజమాన్యంలో పని చేస్తున్న 1,600 ప్రభుత్వ రంగ సంస్థల (పీఎస్‌యూ) కోసం కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) కార్యాలయం ప్రత్యేక ఆడిటింగ్ విభాగం ఏర్పాటు చేసింది. దీనివల్ల ఆయా సంస్థల ఆడిట్ వేగంగా పూర్తి చేయగలుగుతారు. తద్వారా అవి మరింత సమర్థవంతంగా పని చేయగలుగుతాయి. ఇప్పటికే ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయని, ఆ విభాగం ఏర్పాటు కాగానే సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాల అధీనంలోని పీఎస్‌యూలన్నీ ఆ విభాగం పరిధిలోకి వస్తాయని డిప్యూటీ సీఏజీ కేఎస్ సుబ్రమణియన్ చెప్పారు. ప్రస్తుతం దేశంలో 700 వరకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు (సీపీఎస్ఈ), 1600 రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు (ఎస్‌పీఎస్ఈ), 485 స్వతంత్ర ప్రతిపత్తి గల కేంద్ర సంస్థలు, 700 స్వతంత్ర ప్రతిపత్తి గల రాష్ట్ర సంస్థలు ఉన్నాయి.

- రిలయన్స్ ట్రెండ్స్.. ఆంధ్రప్రదేశ్‌లో తన కార్యకలాపాలను మరింతగా విస్తరించింది. ఇందులో భాగంగా అనంతపురంలోని రుద్రంపేటలో కొత్త షోరూమ్‌ను ప్రారంభించింది. ట్రెండ్స్‌కు అనంతపురంలో ఇది రెండో స్టోర్.
- ఐటీసీ ఆశీర్వాద్ మసాలా.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో తన ప్రచారకర్త, టాలీవుడ్ నటుడు నానితో ప్రత్యేక క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత వాట్సాప్ బాట్ ద్వారా నానితో వినియోగదారులు ప్రత్యేకంగా తమ చిత్రాలను రూపొందించుకునే విధంగా ఒక కార్యక్రమాన్ని చేపట్టింది. వినియోగదారులు ఆశీర్వాద్ మసాలాకు చెందిన అధికారిక సామాజిక మాధ్యమాలను క్లిక్ చేయటం ద్వారా ఇందులో పాల్గొనవచ్చని తెలిపింది.

'మేడిన్ ఇండియా'కు చైనా కంపెనీలు జై!

అమెరికా,పశ్చిమాసియాలే లక్ష్యంగా భారత్ నుంచి ఎగుమతులు



న్యూఢిల్లీ: పరిస్థితులకు తగ్గట్టు మారితేనే వ్యాపారంలో మనుగడ. చైనా కంపెనీలు ఈ విషయాన్ని బాగానే వంటపట్టించుకున్నాయి. ఇప్పటి వరకు భారత మార్కెట్‌పైనే దృష్టి పెట్టిన ఈ కంపెనీలు ఇప్పుడు ఎగుమతులకూ భారత్‌ను కేంద్రంగా మార్చుకుంటున్నాయి. యూరోపియన్ యూనియన్ (ఈయూ), అమెరికా దేశాల్లో తమకు ఎదురవుతున్న ఆంక్షలను తప్పించుకునేందుకు 'భారత్‌లో తయారీ' (మేడిన్ ఇండియా)కి జై కొడుతున్నాయి. చైనా స్మార్ట్‌ఫోన్, ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ ఉపకరణాల కంపెనీలు ఈ విషయంలో ముందున్నాయి. ఇందుకోసం స్థానిక కంపెనీలతో తయారీ ఒప్పందాలు కుదుర్చుకుని మరీ తమ వస్తువులను అమెరికా, పశ్చిమాసియా, ఆఫ్రికా దేశాలకు ఎగుమతి చేస్తున్నాయి. రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్ఓసీ) వద్ద అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం 2023-24లో భారత్ నుంచి ఒప్పో మొబైల్స్ ఇండియా రూ.272 కోట్లు, రియల్‌మీ మొబైల్ టెలికమ్యూనికేషన్స్ (ఇండియా) రూ.114 కోట్ల విలువైన స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు మన దేశం నుంచి ఎగుమతి చేశాయి. 2024-25 ఆర్థిక సంవత్సరం ఆర్థిక ఫలితాల వివరాలను ఈ కంపెనీలు ఇంకా ప్రకటించాల్సి ఉంది.

ఎందుకంటే?

డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టక ముందు నుంచే అమెరికా, చైనా దిగుమతులపై ఆంక్షలు కఠినం చేసింది. ఈయూలోనూ ఇదే పరిస్థితి. ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టాక అమెరికా చైనాపై మరింత రెచ్చిపోతోంది. చైనా ఉత్పత్తులపై ఏకంగా 145 శాతం సుంకం విధించారు. రేర్ ఎర్త్ ఖనిజ ఉత్పత్తుల కోసం ఈ సుంకాల పోటు కొద్దిగా తగ్గించినా.. చైనా వస్తువుల దిగుమతులు ఇంకా 55 శాతం సుంకాల పరిధిలో ఉన్నాయి. భారత్‌పై ఉన్న 26 శాతంతో పోలిస్తే ఇది 29 శాతం ఎక్కువ. భారత-అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) కుదిరితే ఈ పోటు కూడా ఉండదు. భారత-బ్రిటన్ మధ్య ఇటీవల కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కూడా చైనా కంపెనీలను ఆకర్షిస్తోంది. దీంతో అమెరికా, ఈయూ మార్కెట్లలో ప్రవేశించేందుకు భారత్‌లో తయారీకి చైనా కంపెనీలు మొగ్గు చూపుతున్నాయి.

ప్రభుత్వ ఆంక్షలు: అయితే 2020 గాల్వన్ సరిహద్దు ఘర్షణల తర్వాత కేంద్ర ప్రభుత్వం చైనా కంపెనీల పెట్టుబడులను కట్టడి చేసింది. ప్రభుత్వ అనుమతి లేకుండా ఏ దేశీయ కంపెనీలోనూ చైనా కంపెనీల పెట్టుబడులను అనుమతించడం లేదు. అయితే స్థానిక కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకుని తమ ఉత్పత్తులను ఆ కంపెనీల్లో తయారు చేయించి ఎగుమతి చేసుకోవచ్చని పరోక్షంగా సూచించింది. అయితే ఇందుకోసం ఆ కంపెనీలకు పూర్తి స్థాయిలో టెక్నాలజీ బదిలీ చేయాలని స్పష్టం చేసింది. గతంలో ఇందుకు ససేమిరా అన్న చైనా కంపెనీలు.. ఇప్పుడు అందుకు రెడీ అంటూ ముందుకొస్తున్నాయి.

దారికొచ్చిన చైనా కంపెనీలు

- పశ్చిమాసియా, ఆఫ్రికా దేశాలకు హైసెన్స్ గ్రూప్ ఎగుమతి చేసే టీవీలు, గృహోపకరణాల తయారీ కోసం ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ సిటీలో రూ.100 కోట్లతో ప్లాంటు ఏర్పాటు చేస్తున్న ఇప్యాక్ డ్యూరబుల్స్ కంపెనీ
- డిక్సన్ టెక్నాలజీస్‌లో తయారైన తన అనుబంధ కంపెనీ మోటరోలా స్మార్ట్‌ఫోన్లను అమెరికాకు ఎగుమతి చేస్తున్న లెనోవా. త్వరలో సర్వర్లు, లాప్‌టాప్‌ల ఎగుమతికి సన్నాహాలు
- ఆఫ్రికా దేశాలకు ఎగుమతి కోసం చైనా కంపెనీ ట్రాన్సిషన్ హోల్డింగ్స్ ఐటెల్, టెక్నో, ఇన్ఫినిక్స్ బ్రాండెడ్ స్మార్ట్‌ఫోన్లను ఉత్పత్తి చేస్తున్న డిక్సన్ టెక్నాలజీస్
- భారత్ నుంచి కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ పరికరాలు, గృహోపకరణాలు ఎగుమతి చేసే విషయాన్ని పరిశీలిస్తున్న హాయర్ కంపెనీ
- ఎగమతుల బాట పట్టిన స్మార్ట్‌ఫోన్ తయారీ కంపెనీలు ఒప్పో, వివో, వన్‌ప్లస్, షామీ

25,000 పైన బుల్లిష్
(జూన్ 16-20 తేదీల మధ్య వారానికి)



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

ట్రెండ్ గైడ్

నిఫ్టీ గత వారం 25,204-24,473 పాయింట్ల మధ్యన కదలాడి 282 పాయింట్ల నష్టంతో 24,719 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25,000 కన్నా పైన ముగిస్తే స్వల్ప కాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 24,947, 24,961, 24,844, 24,760 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 25,125 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 24,300
నిరోధ స్థాయిలు: 24,925, 25,025, 25,125 (24,825 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 24,500, 24,400, 24,300 (24,600 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



16వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	515
వరంగల్	512	గోదావరి	500
చిత్తూరు	593	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	97	విజయవాడ	100
వరంగల్	97	గుంటూరు	103
కరీంనగర్	97	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	97	చిత్తూరు	94
కర్నూలు	97	నెల్లూరు	99
విశాఖపట్నం	90	అనంతపురం	99
గోదావరి	100		

మార్కెట్లపై యుద్ధ భయాలు!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం తీవ్ర ఆటుపోట్లకు లోనయ్యే అవకాశం ఉంది. ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం ప్రపంచ వాణిజ్యంపై పెను ప్రభావం చూపించనుంది. ఇప్పటికే క్రూడాయిల్ ధరలు విపరీతంగా పెరిగాయి. యుద్ధం మరింత తీవ్రతరమై ఇతర దేశాలకు పాకితే ప్రపంచ సంక్షోభం రావచ్చని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో మదుపరులు ఆచితూచి అడుగులు వేయటం మంచిది.

స్టాక్ రికమండేషన్స్

భారత్ ఎలక్ట్రానిక్స్: అనిశ్చిత పరిస్థితుల్లోనూ డిఫెన్స్ స్టాక్స్ రాణిస్తున్నాయి. సుదీర్ఘ కన్సాలిడేషన్ తర్వాత ఈ షేరు మూడు నెలల్లో 40 శాతం మేర పెరిగింది. ఆ తర్వాత స్థిరంగా కొనసాగుతూ వస్తోంది. మూమెంటమ్, రిలేటివ్ స్ట్రెంత్ బాగున్నాయి. గత శుక్రవారం రూ.394 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.390 ఎగువన పొజిషన్ తీసుకుని రూ.440 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.375 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

బయోకాన్: ప్రస్తుతం ఈ షేరు స్వల్ప, మధ్యకాలిక మూమెంటమ్ గణనీయంగా పెరుగుతోంది. పైగా 20,50 రోజుల ఈఎంఏపై స్థాయిలో చలిస్తున్నాయి. గత శుక్రవారం రూ.355 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.340 ఎగువన ప్రవేశించి రూ.410 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.320 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టెక్ మహీంద్రా: ప్రస్తుతం ఈ షేరు కీలక నిరోధ స్థాయి రూ1,700కి సమీపంలో ఉంది. ఏప్రిల్ నుంచి రిలేటివ్ స్ట్రెంత్, మూమెంటమ్ క్రమంగా పెరుగుతున్నాయి. చివరి మూడు నెలల్లో 15 శాతం మేర పెరిగింది. ఫండమెంటల్స్ బలంగా ఉన్నాయి. గత శుక్రవారం రూ.1,659 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.1,630/1,650 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,740/1,770 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,610 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

విప్రో: ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తున్న ఈ కౌంటర్‌లో ప్రస్తుతం అక్యుములేషన్ జరుగుతోంది. ప్రైస్ యాక్షన్ చాలా టైట్‌గా కొనసాగుతోంది. రిలేటివ్ స్ట్రెంత్, మూమెంటమ్ పెరుగుతున్నాయి. గత శుక్రవారం రూ.260 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.250 శ్రేణిలో ఎంటరై రూ.390/410 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.240 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

మ్యాక్స్‌హెల్త్: ఈ కౌంటర్‌కు అనేక అనుకూలతలు కనిపిస్తున్నాయి. తాజాగా 52 వారాలు, జీవితకాల గరిష్ఠాన్ని బ్రేక్ చేసింది. జనవరి నుంచి కన్సాలిడేషన్ దిశలో కొనసాగుతోంది. పైగా మూమెంటమ్, రిలేటివ్ స్ట్రెంత్ మెరుగ్గా ఉన్నాయి. గత శుక్రవారం రూ.1,232 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,220 ఎగువన పొజిషన్ తీసుకుని రూ.1,450 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,200 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

24,500 వద్ద నిలదొక్కుకోవడం కీలకం

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం పాజిటివ్‌గానే ప్రారంభమై మానసిక అవధి 25,000 కన్నా పైకి దూసుకుపోయినా ఆ స్థాయిలో నిలదొక్కుకోలేకపోయింది. ఇది స్వల్పకాలిక బలహీనతను సూచిస్తోంది. అయితే శుక్రవారం నాడు 250 పాయింట్లు లాభపడడం ద్వారా 24,500 వద్ద మద్దతు లభించినట్టు కూడా నిర్ధారించింది. గత ఐదు వారాలుగా సైడ్‌వేస్, కన్సాలిడేషన్ ట్రెండ్‌లో ఉన్న మార్కెట్ 25,000-24,500 మధ్యన కదలాడుతోంది. అలాగే మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా కీలక స్థాయిలు 60,000, 19,000 వరకు వెళ్లినా ఆ స్థాయిల్లో నిలదొక్కుకోలేకపోయాయి. మొత్తం మీద మార్కెట్ ఐదు వారాల కనిష్ఠ స్థాయిలో ముగియడం, శుక్రవారం అమెరికన్ మార్కెట్లు బలహీనత ప్రదర్శించిన నేపథ్యంలో ఈ వారం మార్కెట్ మద్దతు స్థాయిల్లో పరీక్ష ఎదుర్కొనవచ్చు. స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి.

బుల్లిష్ స్థాయిలు: రికవరీ బాట పట్టినట్టయితే స్వల్పకాలిక అప్‌ట్రెండ్‌ను మరింతగా కొనసాగించేందుకు కీలక నిరోధం 25,000 కన్నా పైన నిలదొక్కుకోవాలి. అయితే కొన్ని వారాలుగా మార్కెట్ తీవ్ర ఆటుపోట్లలో ఉన్నందు వల్ల సానుకూలత కోసం మొదట కనిష్ఠ స్థాయిల్లో కన్సాలిడేట్ కావడం తప్పనిసరి.

బేరిష్ స్థాయిలు: గత వారం నిఫ్టీ 24,500 వద్ద మైనర్ రికవరీ సాధించింది. భద్రత కోసం ఈ స్థాయిలో నిలదొక్కుకుని తీరాలి. ఇక్కడ విఫలమైతే స్వల్పకాలిక బలహీనత మరింతగా కొనసాగుతుందనేందుకు సంకేతంగా భావించాలి. ప్రధాన మద్దతు స్థాయి 23,900.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం 57,000 వరకు వెళ్లి బలమైన కరెక్షన్‌లో పడడంతో పాటు 1,050 పాయింట్ల నష్టంతో 55,525 వద్ద ముగిసింది. గతంలో ఏర్పడిన టాప్ కన్నా దిగువన క్లోజ్ కావడం స్వల్పకాలిక అప్రమత్త సంకేతం. మద్దతు స్థాయి 55,000. ఇక్కడ విఫలమైతే స్వల్పకాలిక బలహీనత ముప్పు ఎదుర్కొంటుంది. రికవరీ బాట పడితే మరింత సానుకూలత కోసం నిరోధ స్థాయి 56,000 కన్నా పైన నిలదొక్కుకోవాలి.

పాటర్న్: 24,500 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా దిగజారితే మరింత బలహీనపడుతుంది. ఇదే స్థాయిలో ట్రిపుల్ బాటమ్ కూడా ఏర్పడింది. అందువల్ల ఇక్కడ నిలదొక్కుకోవడం తప్పనిసరి. మార్కెట్ గత వారం 25 డీఎంఏ కన్నా దిగజారింది. ఇప్పుడు 50 డీఎంఏకు చేరువవుతోంది.

టైమ్ : ఈ సూచీ ప్రకారం గురువారం మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,780, 24,850
మద్దతు	24,600, 24,500

అభివృద్ధిని ఓర్వలేకే వైసీపీ విమర్శలు: అచ్చెన్న

టెక్కలి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్థక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మండిపడ్డారు. ఆ విమర్శలను తిప్పికొట్టేలా మరింత అభివృద్ధి దిశగా అడుగులేస్తామన్నారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మే 22న మన ఊరు.. మాటామంతీ కార్యక్రమంలో భాగంగా రావివలస గ్రామాభివృద్ధికి రూ.15కోట్లతో పనులు చేపట్టనున్నట్టు ఇచ్చిన హామీ మేరకు ఆదివారం రావివలసలో రూ.12కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు మంత్రి అచ్చెన్నాయుడు శంకుస్థాపన చేశారు. అలాగే రూ.13కోట్లతో టెక్కలిలో పట్టుమహాదేవి కోనేరు గట్టు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్లెల అభివృద్ధిని గత వైసీపీ ప్రభుత్వం విస్మరించిందన్నారు. 'కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పల్లెల అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తున్నాం. రాష్ట్రంలో 67లక్షల మంది మహిళలకు తల్లికి వందనం పథకం నిధులు ఖాతాల్లో జమ చేశాం' అని తెలిపారు.

పేదింటి బిడ్డలకు ఎంబీబీఎస్ సీట్లు

- గురుకుల విద్యార్థులకు మంత్రి డోలా అభినందన

అమరావతి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): నీట్‌లో అర్హత సాధించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల విద్యార్థులను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అభినందించారు. మొత్తం 143 మంది అర్హత సాధించగా.. వారిలో 32 మందికి ఎంబీబీఎస్ సీట్లు దక్కే అవకాశముందని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయస్థాయి ప్రవేశ పరీక్షలో గురుకుల విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రశంసించారు. పేదింటి బిడ్డలు డాక్టర్లు, ఇంజనీర్లు కావాలన్నదే సీఎం చంద్రబాబు స్వప్నమన్నారు. గురుకులాల్లో జేఈఈ, నీట్ కోచింగ్ సెంటర్లను ఈ ఏడాది 3 నుంచి 10కి పెంచినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. నాడు జగన్ నాన్నకు ఇంధనం పేరుతో నకిలీ మద్యంతో పేదల నుంచి రూ.వేల కోట్లు దోపిడీ చేస్తే.. నేడు చంద్రబాబు 'తల్లికి వందనం'తో పేద విద్యార్థులకు రూ.10 వేల కోట్లు ఇచ్చారని అన్నారు.

రైతు పరామర్శ ర్యాలీనా.. విధ్వంస ర్యాలీనా?

- పొదిలి ఘటనలో వైసీపీ తీరును ఎండగట్టిన మంత్రి పార్థసారథి



అమరావతి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): జగన్ మీడియాలో డిబేట్ల పేరుతో మహిళల్ని అవమానించారంటూ పొదిలిలో మహిళలు నిరసన చేస్తుంటే వారిపై రాళ్లు, చెప్పులతో దాడి చేయిస్తారా? అని మంత్రి కొలుసు పార్థసారథి ఆగ్రహం వ్యక్తం చేశారు. పొదిలిలో వైసీపీ కార్యకర్తలు రెచ్చగొట్టేలా రాసుకొచ్చిన ప్లకార్డులను.. మహిళలు, పోలీసులపైకి వైసీపీ కార్యకర్తలు రాళ్లు రువ్వుతున్న వీడియోలను ఆదివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి విలేకరుల సమావేశంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొదిలిలో పొగాకు రైతులను పరామర్శించేందుకు వెళ్లిన జగన్.. తన వెంట వచ్చిన వారి వద్ద ఉన్న ప్లకార్డులను పరిశీలించారా? అని మంత్రి ప్రశ్నించారు. రైతులను పరామర్శించడానికి వెళితే.. గిట్టుబాటు ధర కల్పించాలి, రైతులకు న్యాయం చేయాలి, పొగాకు రైతులను కాపాడాలి అన్న నినాదాలున్న ప్లకార్డులు పట్టుకుంటారు. కానీ, ఎవరైనా సరే రండి తొక్కిపడేస్తాం అని రాసిన ప్లకార్డులు ప్రదర్శించారు. పొదిలిలో జగన్ చేసింది రైతు పరామర్శ ర్యాలీలా లేదు. విధ్వంసం సృష్టికి చేసిన ర్యాలీలా ఉంది' అన్నారు. శాంతియుతంగా నిరసన చేస్తున్న మహిళలపై దాడులు చేయడమే కాకుండా వారిని రక్షించేందుకు ప్రయత్నించిన పోలీసులపైనా దాడులు చేయడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలు, రైతుల సమస్యలపై జగన్‌కు చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీకి వచ్చి వారి సమస్యలను ఎందుకు ప్రస్తావించడం లేదని నిలదీశారు. వైసీపీ వారే నేర రాజకీయాలు చేస్తూ మరోవైపు రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవంటూ ప్రచారం చేస్తున్నారని, తమ ప్రభుత్వం శాంతిభద్రతలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. విధ్వంసకర రాజకీయాలు చేస్తున్న వైసీపీ నాయకులెవ్వరినీ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

పొగాకు రైతులను ఆదుకోండి!

(మొదటి పేజీ తరువాయి)

దిగుమతి సుంకం విధింపు, మామిడి గుజ్జుపై జీఎస్టీ వంటి అంశాలను ప్రస్తావించారు. రైతుల ఇబ్బందులను అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లిన చంద్రబాబు కేంద్ర సహకారాన్ని కోరారు. ప్రస్తుత సీజన్‌లో హెచ్‌డీ బర్లీ, వైట్ బర్లీ పొగాకు సాగు చేసిన రైతులు ధరలు తగ్గిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని సీఎం వివరించారు. పొగాకు కొనుగోళ్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టిందని, దీనిలో భాగంగా రూ.300 కోట్లతో 2 కోట్ల కిలోల పొగాకును కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో 7 కొనుగోలు కేంద్రాలను ఏపీ మార్క్‌ఫెడ్ ఏర్పాటు చేసిందన్నారు. పొగాకు కొనుగోళ్ల కోసం రూ.150 కోట్లు భారత పొగాకు బోర్డు వెచ్చించేలా చూడాలని సీఎం కోరారు. ప్రస్తుతం ఏపీలో 1.31 లక్షల హెక్టార్లలో పొగాకు సాగు చేశారని, గతేడాది కంటే ఈసారి సాగు విస్తీర్ణం పెరిగిందని చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్‌లో పొగాకుకు డిమాండ్ తగ్గడంతో ధరల విషయంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. రాష్ట్రంలో పొగాకు ఉత్పత్తి, మార్కెట్‌ను పొగాకు బోర్డు పరిధిలోకి తెచ్చేలా చట్టాన్ని సవరించాలని సీఎం సూచించారు.



ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయంలో కేంద్ర మంత్రి గోయల్‌తో సీఎం

సుంకం తగ్గిస్తే సమస్యలు

క్రూడ్ పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని 10శాతానికి తగ్గించడం వల్ల ఆయిల్‌పామ్ రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు సీఎం చంద్రబాబు తెలిపారు. క్రూడ్ పామాయిల్‌పై దిగుమతి సుంకం విషయంలో పాత విధానాన్నే కొనసాగించాలని కోరారు. సుంకం తగ్గింపుతో కేంద్రం నిర్దేశించిన 'నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్' లక్ష్యాలను చేరుకోలేమన్న విషయాన్ని గమనించాలని సూచించారు. అలాగే ఆక్వా ఎగుమతులపై అమెరికా విధించిన సుంకాల వల్ల ఏపీలోని 8 లక్షల మంది ఆక్వా రైతులు నష్టపోతున్నారని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆక్వా ఉత్పత్తులపై అమెరికా విధించిన 27శాతం సుంకాన్ని తగ్గించేలా ఆ దేశ అధికారులతో మాట్లాడాలని కోరారు. ఆక్వా రైతులపై ఈ టారీఫ్ భారం తగ్గించి, సంక్షోభం నుంచి బయటపడేలా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అమెరికా విధించిన సుంకాల వల్ల ఆక్వా రైతులు, హేచరీలు, ఫీడ్ మిల్లులు, ప్రాసెసింగ్ యూనిట్లు, ఎగుమతిదారులు సంక్షోభంలో పడ్డారని సీఎం వివరించారు. అలాగే మామిడి గుజ్జుపై జీఎస్టీని 12శాతం నుంచి 5శాతానికి తగ్గించాలని సీఎం కోరారు. మామిడి తాండ్రపై 5 శాతం జీఎస్టీ విధిస్తున్నారని, అదే విధానం గుజ్జుకు కూడా వర్తింపజేయాలన్నారు. జీఎస్టీ తగ్గిస్తే మామిడి రైతులకు, గుజ్జు పరిశ్రమలకు ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. ఇప్పటికే ఈ విషయాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ దృష్టికి తీసుకెళ్లినట్లు సీఎం చంద్రబాబు వివరించారు. చంద్రబాబు విజ్ఞప్తిపై గోయల్ సానుకూలంగా స్పందించారు. రాష్ట్రంలోని పొగాకు, ఆయిల్‌పామ్, మామిడి, ఆక్వా రైతులకు మేలు జరిగేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. భేటీ అనంతరం కేంద్రమంత్రిని సీఎం శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందజేశారు.

పొగాకు అదనపు సాగు వద్దు

దీంతో రైతులకు ఇబ్బందులే

- ఏపీలో కొత్తగా ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నాం
- పొగాకు రైతులకు వడ్డీలేని రుణాలు
- వారి పిల్లలకు విదేశీ భాషల్లో శిక్షణ
- కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్

గుంటూరు, జూన్ 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అనుమతించిన విస్తీర్ణంలోనే పొగాకు సాగు జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ ఆదేశించారు. చాలా చోట్ల అదనంగా పొగాకు సాగు చేస్తుండటం వల్ల సమస్యలు ఉత్పన్న మవుతున్నాయన్నారు. ఆదివారం గుంటూరులోని పొగాకు బోర్డు కార్యాలయానికి వచ్చిన ఆయన కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌తో కలిసి ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. "గత నాలుగేళ్లలో పొగాకు రైతుల ఆదాయం రెట్టింపు అయింది. అది అలానే కొనసాగాలంటే అదనపు విస్తీర్ణంలో పొగాకు సాగు చేయరాదు. ఈ విషయంలో బోర్డు పరంగా అవసరమైన చర్యలు తీసుకొంటాం. పొగాకు రైతులకు దీర్ఘకాలిక వడ్డీ లేని రుణాలను బోర్డు ఇస్తోంది. రూ.3 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు రుణాలను రైతుల పిల్లల చదువుల కోసం మంజూరు చేస్తోంది. తీసుకొన్న రుణాలను ఐదేళ్లలోపు చెల్లించే విధంగా నిబంధనలను సడలించాం. పొగాకు రైతుల పిల్లలకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణతో పాటు జర్మనీ, జపాన్ భాషల్లో కూడా శిక్షణ ఇస్తున్నాం. దీని వల్ల ఆయా దేశాల్లో ఉద్యోగాల సాధనకు ఆస్కారం ఉంటుంది" అని మంత్రి వివరించారు.

ఎన్‌ఐడీలో పురోగతి!

ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో భాగంగా కేంద్రం మంజూరు చేసిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్స్(ఎన్‌ఐడీ).. ఏపీలో పురోగతిలో ఉందని కేంద్ర మంత్రి గోయల్ చెప్పారు. రాబోయే రోజుల్లో ఇది సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌గా మారుతుందన్నారు. కొత్తగా పరిశ్రమల ఏర్పాటు, ఏపీ నుంచి ఎగుమతులను పెంచే విషయంపై సీఎం చంద్రబాబుతో చర్చించినట్టు తెలిపారు. "పారిశ్రామిక అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించాం. రాష్ట్రంలోని 1.60 కోట్ల కుటుంబాలకు లాభం జరిగేలా ఏ నిర్ణయమైనా తీసుకొంటాం. మౌలిక వసతులు, పర్యాటకం, ఏరో స్పేస్, కెమికల్స్ తదితర రంగాల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల సాధనపై సీఎంతో చర్చించాం. కృష్ణపట్నం పార్కు వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఫలితంగా రాబోయే రోజుల్లో వేలాది మందికి కొత్తగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పీయూష్ గోయల్ అన్నారు. ఈ సమావేశంలో పొగాకు బోర్డు ఛైర్మన్ యశ్వంత్‌కుమార్, ఈడీ విశ్వశ్రీ తదితరులు పాల్గొన్నారు.

'తల్లికి వందనం'తో జగన్ కడుపుమంట పెరిగింది

- 2 ఈనో ప్యాకెట్లు పంపుతా వాడండి: లోకేశ్
- నీట్ విజేతలకు శుభాకాంక్షలు
- చంద్రబాబుకు ఫాదర్స్‌డే శుభాకాంక్షలు



అమరావతి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకంతో లబ్ధి పొందిన తల్లుల కళ్లలో ఆనందం చూసి, జగన్ రెడ్డి కడుపు మంట మూడింతలు పెరిగిందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఎద్దేవా చేశారు. జగన్ పత్రికలో ఈ పథకంపై తప్పుడు కథనాలు రాస్తూ వికృతానందం పొందుతున్నారని విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్‌లో ఒక పోస్టు చేశారు. 'ఆరుగురు కంటే ఎక్కువ పిల్లలు ఉన్న తల్లులు, అనాథ శరణాలయాల్లో ఉంటున్న పిల్లలకు ఇంకా డబ్బులు జమ కాలేదు. గ్రామ/వార్డు సచివాలయ సిబ్బంది క్షేత్ర పరిశీలన తర్వాత మాత్రమే వారికి నిధులు విడుదలవుతాయి. దొంగ లెక్కలు, డబ్బులు కొట్టేయడం మీ బ్రాండ్ జగన్. మీ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలే అందరూ చేస్తారనుకుంటే ఎలా? మాది ప్రజాప్రభుత్వం. తప్పు చేయం.. చేయనివ్వం. జగన్ మీకు కడుపు మంటగా ఉన్నట్టుంది. రెండు ఈనో ప్యాకెట్లు పంపిస్తాను. వాడండి.. కాస్త తగ్గుద్ది' అని పేర్కొన్నారు. కాగా, నీట్ విజేతలకు మంత్రి లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. 'టాప్-100లో నిలిచిన రాష్ట్రానికి చెందిన ఆరుగురు విద్యార్థులు.. డి.కార్తీక్ రామ్ కిరీటి, కె.మోహిత శ్రీరామ్, డి.సూర్యకిరణ్, పి.అవినాశ్, వై.సమీర్ కుమార్, టి.శివమణిదీప్‌లకు హృదయపూర్వక శుభాకాంక్షలు' అని పేర్కొన్నారు. ఫాదర్స్‌డే సందర్భంగా చంద్రబాబుకు లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. 'నా ప్రేరణ.. నా గురువు.. నా మార్గదర్శి.. నా బాస్.. హ్యాపీ ఫాదర్స్ డే నాన్న' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

వైసీపీది అబద్ధపు ప్రచారం: కొండపల్లి

హైదరాబాద్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకంపై వైసీపీ అబద్ధపు ప్రచారం చేస్తోందని ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మండిపడ్డారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికి తల్లికి వందనం పథకం లబ్ధి చేకూరుతోందన్నారు. స్కూల్ మెయింటెనెన్స్ కోసం రూ.2 వేలను ప్రభుత్వ యంత్రాంగం ద్వారా ఖర్చు చేయడం వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోనే అని, అయినా వైసీపీవారే విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. జగన్ ఎంతమంది పిల్లలుంటే అంతమందికి అమ్మఒడి ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక ఒక్కరికే ఇచ్చారని విమర్శించారు.

ఆ పిల్లలకు నగదు విడుదల చేయలేదు

- తప్పుదోవ పట్టించే కథనాలపై చర్యలు
- పాఠశాల విద్యాశాఖ హెచ్చరిక

అమరావతి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకంపై ప్రజలను తప్పుదోవ పట్టించేలా వార్తా కథనాలను ప్రచురించిన పత్రిక, ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియా హ్యాండిల్స్ బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పాఠశాల విద్యాశాఖ హెచ్చరించింది. జగన్ పత్రికలో ఆదివారం ప్రచురితమైన కథనాన్ని ప్రస్తావిస్తూ ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. కర్నూలు జిల్లాలో భారీ సంఖ్యలో పిల్లలున్న కుటుంబాలకు నగదు జమ చేసినట్టు జగన్ పత్రిక పేర్కొందని, అయితే, అలాంటి వారికి నగదు విడుదల చేయలేదని తెలిపింది. ఆరుగురు పిల్లలు దాటిన తల్లుల వివరాలను డీఈవో, ఎంఈవో స్థాయిలో పరిశీలిస్తున్నామని వివరించింది.



అమ్మఒడి 26వేల కోట్లు ఎగ్గొట్టిన జగన్

- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి ధ్వజం
- జగన్‌కు ఆ అర్హత లేదు: నాదెండ్ల బ్రహ్మం

అమరావతి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): జగన్ లక్షలాది మంది విద్యార్థులకు అమ్మ ఒడి పథకం నిధులు రూ.26వేల కోట్లు ఎగనామం పెట్టారని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి విమర్శించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం నిజాయితీగా ఇచ్చిన హామీ ప్రకారం ఒక ఇంట్లో ఎంత మంది పిల్లలు బడికి వెళుతుంటే వారందరికీ తల్లికి వందనం నిధులు తల్లుల ఖాతాలో జమ చేస్తుంటే వైసీపీ నాయకులు అసత్య ప్రచారం చేస్తూ, ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని విమర్శించారు. '2019 ఎన్నికల్లో జగన్, ఆయన భార్య ఇచ్చిన హామీ ప్రకారం అమ్మఒడిని ప్రతి బిడ్డకు అమలు చేస్తే ఏడాదికి రూ.10వేల కోట్లు చొప్పున ఐదేళ్లలో రూ.50వేల కోట్లు తల్లుల ఖాతాల్లో వేయాల్సి ఉంది. కానీ, జగన్ ఐదేళ్ల పాలనలో ఇచ్చింది రూ.23,877 కోట్లు మాత్రమే. జగన్ హయాంలో ప్రతియేటా లబ్ధిదారులను తగ్గించుకుంటూ పోయారు. 2021లో 44.48 లక్షల మంది లబ్ధిదారులు ఉంటే 2023కి ఆ సంఖ్య 42.61 లక్షలకు పడిపోయింది. నేడు కూటమి ప్రభుత్వం 67.27 లక్షల మంది లబ్ధిదారులకు తల్లికి వందనం పథకంఅమలు చేస్తుంటే వైసీపీవారు దుష్ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు. జగన్ ఐదేళ్లలో రూ.23,877 కోట్లు ఇస్తే, మేం ఒక్క ఏడాదే రూ.10,090 కోట్లు ఇస్తున్నాం. ప్రజలు సంతోషంగా ఉంటే జగన్‌కు పట్టదు. అందుకే ఆయన్ను సైకో జగన్ అంటారు. హుందాతనం జగన్ డీఎన్‌ఏలోనే లేదు' అని పట్టాభి విమర్శించారు. కాగా, ఎన్నికల ముందు విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు నొక్కేసి, తన వారికి కాంట్రాక్టు బిల్లులు విడుదల చేసుకున్న ఘనత జగన్‌దని, అలాంటి వ్యక్తికి తల్లికి వందనం గురించి మాట్లాడే అర్హత లేదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాదెండ్ల బ్రహ్మం విమర్శించారు.

విశాఖ భూములపై రాజకీయ గద్దలు

(మొదటి పేజీ తరువాయి)

సైనికుడిది. ఆ భూమిని ఆయన నుంచి నేరుగా వైసీపీ నేత కొనుగోలు చేసి తన పేరిట రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. కానీ ఆపని చేయలేదు. అది దొడ్డిదారిన దక్కించుకున్న భూమి. దీంతో కూటమి ప్రభుత్వంలో ఆ పని కాదనుకొని ప్రహరీ కట్టుకొని భూమిని తన ఆధీనంలో ఉంచుకున్నారు. ఆ భూమి విలువ రూ.82 కోట్లపైమాటే. ఇప్పుడు రెవెన్యూ పెద్దలు, అధికార యంత్రాంగంతో మాట్లాడి సెటిల్ చేయించే బాధ్యతను విశాఖకే చెందిన టీడీపీ నేతకు అప్పగించారు. ఈ నేత గత ఎన్నికలకు ముందే టీడీపీలో చేరారు. అమరావతిలో డీలింగ్స్ ఎండాడ భూమి సెటిల్‌మెంట్‌తో సక్సెస్‌ఫుల్ దళారీగా ఆయన మారారు. గతంలో వైసీపీలో ఉన్నప్పుడు ఈయన, ఆ వైసీపీ నెల్లూరు నేత ఇద్దరూ సన్నిహితులు. దీంతో ఈ భూమిని నిషేధ జాబితా నుంచి తీసేయించి, కలెక్టర్‌తో ఎన్‌ఓసీ ఇప్పించే బాధ్యతను తీసుకున్నారు. ఇందులో పెద్దలను భాగస్వాములను చేయడంతో భూమి ఫైలు అమరావతిలోని నాలుగో బ్లాక్‌కు చేరింది. ఈ భూమిపై రెండుసార్లు అమరావతి సచివాలయం కేంద్రంగా సమావేశాలు జరిగాయి. తాడేపల్లిలోని ఓ మూడు అక్షరాల హోటల్‌లో రెండు సమావేశాలు జరిగాయి. ఈ భేటీలకు నెల్లూరుకు చెందిన వైసీపీ కీలక నేత, ఓ మాజీ ప్రజాప్రతినిధి కూడా హాజరయ్యారు. త్వరలో దీనికి మోక్షం కల్పించబోతున్నారు. దీనికి టీడీపీలో ఉన్న ఓ దళారీ నేత ప్రయత్నాలు కొనసాగిస్తుండడం విశేషం. ఆ నేత వైసీపీని వదిలి టీడీపీలో చేరినా ఆయన కష్టం అంతా వైసీపీ నేతల కోసమే అన్నట్లుగా సెటిల్‌మెంట్‌లు చేయిస్తున్నారు. ఇదిలా ఉంటే, ఇదే భూమి తనకు కావాలని భీమిలి ప్రాంతానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి పేచీ పెట్టారు. తనకు ఆ భూమి దక్కకపోతే అందరి బండారం బయటపెడతానని కూడా ఆయన హెచ్చరించినట్టు తెలిసింది.

రూ. కోట్ల భూమికి రూ.లక్షల్లో చెల్లింపులు

రైతులు, మాజీ సైనికులకు డబ్బులు ఇచ్చి వారి భూముల కొనుగోలుకు ఒప్పందం చేసుకుంటే తప్పేముంది? అదేమి చట్టవ్యతిరేకమైన చర్యకాదు కదా అని కొందరు పెద్దలు వాదించొచ్చు. అయితే, భూమి హక్కుదారులకు ఎంత సొమ్ము చెల్లిస్తున్నారు? అది నైతికంగా సరైన చెల్లింపా? లేక రైతులను మోసం చేసి కొనుగోలు చేస్తున్నారా? అనేది పలు చట్టాల పరిధిలోకి వచ్చే అంశాలు. తమ వల్లనే ఎన్‌ఓసీ వస్తుందని నమ్మించి ఎకరా రూ.20 లక్షలకు ఓ మాజీ సైనికుడికి కట్టబెట్టారు. ఇది మోసం, దగా. చట్టరీత్యా నేరం. అక్కడ భూమి మార్కెట్ విలువే ఎకరాకు కనీసం రూ.15-20 కోట్లపైమాట. అలాంటి చోట ఎకరాకు 20లక్షల మేర మాజీ సైనికుడికి చెల్లించారు. ఇక సామాన్య రైతులకు ఎకరాకు 10-15 లక్షలే ఇచ్చారు. ఇలా రైతులను మోసం చేసి భూములపై ఒప్పందాలు చేసుకోవడం, షెల్ కంపెనీల నుంచి డబ్బులు బదలాయించడం చట్టారీత్యా నేరం. ఇలాంటి పనులు చేసేవారిని వెనకేసుకొచ్చి వారికి తెరవెనుక సహకరించడం కూడా నేరమే.

ఎవరి అండతో ఈ దందా?

ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లపై నిషేధం అమల్లో ఉంది. ఆ నిషేధం ఎప్పుడు ఎత్తివేస్తారో మంత్రివర్గ ఉపసంఘానికి, ఇంకా ప్రభుత్వాధినేతకు తప్ప మరెవ్వరికీ తెలియని అంశం. అలాంటిది ఏ ధైర్యంతో గత మార్చి నుంచే ఈ దళారీ నేత డీ పట్టా భూములపై ఒప్పందాలు చేసుకున్నారు? ఎవరి ప్రోద్బలం, అండతో రైతులకు అడ్వాన్స్‌లు ఇచ్చారు? ఎవరిచ్చిన ధైర్యంతో ఆ దళారీ మాజీ సైనికులు, సామాన్య రైతులకు కుచ్చుటోపీ పెట్టి రూ.కోట్ల విలువైన భూ ములను రూ.లక్షలకే దక్కించుకున్నారు. తెరవెనక పెద్దల అండాదండ లేకుండా కేవలం ఓ నియోజకవర్గ స్థాయి నేత ఇలాంటి పనులు చేయగలరా?మాజీ సైనికుల భూములను నిషేధ జాబితా నుంచి తొలగించడానికి ఎలాంటి ఎన్‌ఓసీ అవసరం లేదనే 2016లోనే ప్రభుత్వం 279 జీఓ ఇచ్చింది. అయినా సరే ఎన్‌ఓసీ ఉండాల్సిందేనని చెబుతున్న అధికారుల మాటల వెనక ఎవరి చర్యలు దాగి ఉన్నాయి?

ఆ భూములపై చీకటి ఒప్పందాలు

ఉమ్మడి విశాఖ జిల్లా పెందుర్తి మండలంలో సౌభాగ్యరాయపురం (ఎస్‌ఆర్ పురం) అనే గ్రామంలో మాజీ సైనికులు, రాజకీయ బాధితులు, పేద ప్రజలకిచ్చిన అసైన్డ్ భూములు వందలాది ఎకరాలున్నాయి. జగన్ జమానాలో ప్రభుత్వంలో ఓ ఐఏఎస్ కొడుకు, అల్లుడితో కలిసి విశాఖకే చెందిన దళారీ నేత భారీగా భూములు కొన్నారు. అందులో అసైన్డ్ భూములున్నాయి. జగన్ పాలన చరమాంకంలో రైతులతో ఒప్పందాలు చేసుకున్నారు. కానీ రిజిస్ట్రేషన్లు జరగలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక గతేడాది ఆగస్టు నుంచే ఫ్రీ హోల్డ్ అసైన్డ్ భూములపై నిషేధం విధించారు. అయితే, పెద్దల ఆశీస్సులతో భూ దళారీ ఎస్‌ఆర్ పురంలోని డీ పట్టా భూములను చేజిక్కించుకునే పనులు ప్రారంభించారు. ఒక మాజీ సైనికుడి వద్ద ఉన్న ఐదు ఎకరాలతోపాటు, ఇతర రైతుల వద్ద 31 ఎకరాలను గుప్పెట పట్టారు. ఎకరా రూ.20 లక్షలకు ఈ భూ దళారీ సూచించిన వ్యక్తులు, ఓ షెల్ కంపెనీలోని డైరెక్టర్ల పేరిట ఈ ఏడాది మార్చిలో ఒప్పందాలు జరిగాయి. అడ్వాన్స్‌లు షెల్ కంపెనీల నుంచి బదిలీ చేశారు. ఇక్కడి నుంచి డ్రాచేసి ఓ అర్ధరాత్రి పంపిణీ చేశారు.

ఆ అధికారి ఎవరు?

ప్రభుత్వంలో ఓ ముఖ్య వ్యక్తి వద్ద పనిచేస్తున్న ఓ ముఖ్య అధికారి ఇచ్చిన మౌఖిక ఆదేశాల మేరకే ఎన్‌ఓసీ డ్రామాను విజయవంతంగా అమలు చేస్తున్నట్టు విమర్శలున్నాయి. ఈ విషయం ఆ ముఖ్యనేతకు తెలియకుండా ముఖ్య అధికారి తెర వెనుక నడిపిస్తున్నారని ఉన్నతాధికారవర్గాలే చెబుతున్నాయి. అయినా, చర్యలు లేకపోవడం చర్చకు దారితీస్తోంది. ఇప్పుడు ఈ ముఖ్య అధికారికి రెవెన్యూలోని వారు తోడవ్వడంతో మాజీ సైనికులు, సామాన్య రైతులే బలవుతుండటం ఇందులోని విషాదం.

పంచాయతీ నిధులు హాంఫట్

(మొదటి పేజీ తరువాయి)

ఇంకా కొంత మంది డీపీఓలు, డీఎల్‌పీఓలు అక్రమాలను కప్పిపుచ్చి కమిషనరేట్‌కు పక్కా సమాచారం అందించలేదన్న ఆరోపణలున్నాయి. నెల్లూరు జిల్లా ఉదయగిరిలో పనిచేసిన ఓ పంచాయతీ కార్యదర్శి అదే మండలంలోని కృష్ణంపల్లిలో జరిగిన పనులకు ఉదయగిరి పంచాయతీ నిధుల నుంచి బిల్లులు డ్రా చేసినట్టు ఫిర్యాదులు వచ్చాయి. విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సిన జిల్లా అధికారులు కమిషనరేట్‌కు సమాచారం అందించకుండా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించారు. ఇలా వైసీపీ హయాంలో కార్యదర్శులను చెప్పుచేతుల్లో పెట్టుకుని భారీగా నిధులు వాడేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

నిధులు లేవంటూనే దోపిడీ

గత ప్రభుత్వంలో ఆర్థిక సంఘం నిధులు రాకపోవడంతో ఆయా పంచాయతీలకు వచ్చిన సొంత వనరుల ఆదాయాన్ని లెక్కా పక్కా లేకుండా తినేశారని ఆరోపిస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో ఏ పనులు చేపట్టాలన్నా వర్క్ కమిటీలు వేయాలి. రాష్ట్రంలో ఆ సంప్రదాయాన్ని గత ఐదేళ్లా తుంగలో తొక్కారు. థర్డ్ పార్టీకి బిల్లులు చెల్లించిన కొందరు పంచాయతీ కార్యదర్శులు సస్పెండై కార్యాలయాల చుట్టూ, నేతల చుట్టూ తిరుగుతున్నారు. పంచాయతీల్లో ఏ వస్తువైనా కొనాలంటే రూ.50 వేలకు పైబడి కొనుగోళ్లకు టెండర్లు పిలవాలి. కానీ ఎక్కడా టెండర్లు జరిగిన దాఖలాల్లేవు. ఇష్టమొచ్చినట్లు షాపుల్లో బిల్లులు తెచ్చి పెట్టారు.

సీఎఫ్ఎంఎస్‌లో బిల్లులకు తనిఖీ ఏదీ?

గతంలో ట్రెజరీ ద్వారా బిల్లులు సమర్పించి, ట్రెజరీ అధికారులు సరిచూసుకుని బిల్లులు విడుదల చేసేవారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ట్రెజరీల నుంచి తప్పించి సీఎఫ్ఎంఎస్ ద్వారా బిల్లులు అప్‌లోడ్ చేస్తున్నారు. కొన్ని మేజర్ పంచాయతీల్లో కార్యదర్శులు ఏవేవో బిల్లులు పెట్టి మరీ డ్రా చేస్తున్నారు. కొన్ని సార్లు విడ్డూరంగా వైట్‌పేపర్ పెట్టి మరీ సీఎఫ్ఎంఎస్ ద్వారా బిల్లులు అప్‌లోడ్ చేస్తున్నారు. సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేసే వాటిని తనిఖీ చేసే పరిస్థితి లేకపోవడంతో పంచాయతీలు ఇష్టారీతిగా డబ్బులు డ్రా చేస్తున్నాయి. ఎక్కడైనా ఫిర్యాదులు వస్తేనే సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేసిన బిల్లులను పరిశీలిస్తున్నారు. లేకపోతే వాటిని పరిశీలించే వ్యవస్థ గ్రామ పంచాయతీల్లో లేదు. మున్సిపాలిటీల్లో డబ్బులు డ్రా చేయాలంటే ముందుగా ప్రీ ఆడిట్ చేస్తారు. గ్రామ పంచాయతీల్లో అలాంటి విధానం లేకపోవడంతో నిధులు దుర్వినియోగం చేస్తున్నారు. స్టాక్ రిజిస్టర్లు పెట్టకుండానే, కొనుగోలు చేసిన వాటిని నమోదు చేయకుండానే డబ్బులు డ్రా చేస్తున్నారు. బ్లీచింగ్ తదితర వస్తువులు కొనుగోలు చేయాలంటే కలెక్టర్ అనుమతి తీసుకోవాలి. అయితే ఎక్కడా ఆ విధానాన్ని పాటించడం లేదు.

నిజాయితీగా పనిచేస్తే బదిలీయే

వార్షిక ఆడిట్‌లో పంచాయతీ ఆడిట్ అధికారులు సాధారణంగా అక్రమాలను పట్టించుకునే పరిస్థితి లేదు. ఆడిటర్లకు పర్సంటేజీలు ఇస్తే చాలు, ఏదైనా ఓకే చేసే పరిస్థితి గ్రామ పంచాయతీల్లో ఉంది. కొన్ని చోట్ల నిజాయితీ గల అధికారులు పక్కాగా ఆడిట్ చేస్తే వారిని శంకరగిరి మాన్యాలు పట్టిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా ఆడిట్ అధికారిణి పద్మజారాణి ఉదంతమే ఇందుకు నిదర్శనం. 90 పంచాయతీల్లో ఆడిట్‌ను తిరిగి సమీక్షించాలని ఆమె నిర్ణయించగా, అక్కడ పనిచేసే కార్యదర్శులు అడ్డుకున్నారు. లోపభూయిష్ట ఆడిట్‌ను సమీక్షించాలని జిల్లా కలెక్టర్ కూడా ఆదేశాలిచ్చినా అమలు కాలేదు. ఇటీవల పద్మజారాణి స్వయంగా హుకుంపేట పంచాయతీలో తనిఖీ చేస్తే రూ.4 కోట్లు అవినీతి జరిగిందని తేలింది. అంతకుముందు వేమగిరి పంచాయతీలో సమీక్షిస్తే రూ.కోటికిపైగా అవినీతి జరిగినట్లు నివేదిక ఇచ్చారు. పద్మజారాణి ఆడిట్ తనిఖీలను పునఃసమీక్ష చేపట్టడంతో ఆర్థిక శాఖ అధికారులు ఆమెను బదిలీ చేశారు. మరో అధికారిని అక్కడ నియమించారు. గతంలో కూడా పద్మజారాణి నిజాయితీని తట్టుకోలేని కొందరు ఆమెను బదిలీ చేయించారు. అయితే ఆమె అప్పట్లో కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. కోర్టు ఆదేశాలను ధిక్కరించి ఇప్పుడు ఆమెకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా, ఆమె స్థానంలో సుబ్బారెడ్డి అనే అధికారిని సాధారణ బదిలీ ప్రక్రియలో నియమించారు.


పంచాయతీ కార్యదర్శులకు గిరాకీ

సొంత ఆదాయం కలిగిన పంచాయతీల్లో పనిచేసే కార్యదర్శులకు గిరాకీ పెరిగింది. ఇలాంటి పలు పంచాయతీల్లో ఏదో ఒక నెపంతో ఎన్నికలు నిర్వహించకుండా కొందరు అడ్డుకుంటున్నారు. రాజమండ్రి చుట్టూ ఉన్న 21 పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించకుండా కోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారు. ఇక్కడ పోస్టింగ్ కోసం ఉన్నతాధికారులకు, నేతలకు కార్యదర్శులు పెద్ద మొత్తంలో ఆఫర్ చేస్తున్నారు. ఇటీవల పంచాయతీరాజ్ సంస్కరణల్లో భాగంగా రూ.కోటికి పైగా ఆదాయం కలిగిన పంచాయతీలకు అధికారిగా డిప్యూటీ ఎంపీడీఓ స్థాయి అధికారిని నియమించాలని నిర్ణయించారు. దీంతో పలు చోట్ల ఎంపీడీఓ పోస్టు కంటే డిప్యూటీ ఎంపీడీఓ పోస్టు కోసం పలువురు ఎగబడుతున్నారు.

ఒకే ఇంట్లో ఐదుగురికి 'వందనం'

కర్నూలు జిల్లా కోసిగిలోని బెళగల్ నరసమ్మ కుటుంబానికి తల్లికి వందనం కింద రూ.65 వేలు జమయ్యాయి. నరసమ్మ, ఈరేష్ దంపతులకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరికి రూ.13 వేల చొప్పున రూ.65 వేలు బ్యాంకులో జమ కావడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఆదివారం సీఎం చంద్రబాబు చిత్రపటానికి టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తురెడ్డి సమక్షంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికులు క్షీరాభిషేకం చేశారు.

- కోసిగి, ఆంధ్రజ్యోతి



సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నరసమ్మ

'పలుకుబడి'కే పదోన్నతి!

- ఈఎస్‌ఐలో బదిలీలు, పోస్టింగ్స్‌లో ఇదే అర్హత
- జేడీల బదిలీల్లో అధికారుల ఇష్టారాజ్యం
- ఐదేళ్ల సర్వీసు పూర్తయితే స్టేషను మారాల్సిందే కానీ.. ఎనికేపాడు నుంచి ఎనికేపాడుకే ఇద్దరు బదిలీ
- జూనియర్ల కింద స్పెషల్ గ్రేడ్ సర్జన్లు
- మంత్రి, ఉన్నతాధికారుల అండతోనే ఇలా?

అమరావతి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): కార్మిక రాజ్య బీమా సంస్థ (ఈఎస్‌ఐ)లో బదిలీల తంతు చూస్తే.. వడ్డించేవాడు మనోడైతే.. కడబంతిలో కూర్చొన్నా అన్నీ వస్తాయి.. అన్న సామెత గుర్తొస్తుంది! పలుకుబడి ఉన్నోడికే పదోన్నతి, పోస్టింగ్ అన్న రీతిలో అధికారులు వ్యవహరించారు. ఇటీవల కొంత మంది వైద్యులకు ఇచ్చిన పదోన్నతుల్లో అధికారులు పలుకుబడినే ప్రాతిపదికగా తీసుకున్నారు. పలుబడి ఉన్న అధికారుల విషయంలో ఒకే స్టేషన్ అంటే ఒకే ఆఫీసుగా, పలుబడి లేని వారిని ఒకే స్టేషన్ అంటే ఒకే ఊరుగా భావించి బదిలీల ప్రక్రియను చేపట్టడం గమనార్హం. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఇదే పద్ధతిని అవలంబించారు. అధికారులు జారీ చేసిన అర్డర్లను వారే పాటించలేదు. వివరాలివీ.. విజయవాడలోని పటమట పీహెచ్‌సీలో పని చేసే ఒక సివిల్ అసిస్టెంట్ సర్జన్ వైద్యురాలు ఐదేళ్లుగా అదే డిస్పెన్సరీలో విధులు నిర్వహిస్తున్నారు. ఆమె సాధారణ బదిలీల్లో భాగంగా స్టేషన్ మారాలి. కాబట్టి ఎనికేపాడులో ఉన్న ఈఎస్‌ఐ ప్రధాన కార్యాలయంలో సీఏఎస్ పోస్టు ఖాళీ ఉంటే ఆ పోస్టులోకి బదిలీ చేయాలంటూ ఆప్షన్ పెట్టుకున్నారు. ఇదే పోస్టు కోసం మరో ముగ్గురు వైద్యులు ఆప్షన్ పెట్టుకున్నారు. పటమటకూ ఎనికేపాడుకూ పెద్ద దూరం కాదు. కనుక దీనిని స్టేషన్ మారినట్లు పరిగణించాలా? లేదా ఆమెను వేరే ఊరికి బదిలీ చేయాలా అన్న విషయమై స్పష్టత ఇవ్వాలని ఈఎస్‌ఐ ఉన్నతాధికారులు ప్రభుత్వాన్ని కోరారు. పటమట, ఎనికేపాడు విజయవాడలో భాగమే కనుక, ఆమెను వేరే ప్రదేశానికి బదిలీ చేయాలని ప్రభుత్వం నుంచి బదులు వచ్చింది. ఈమేరకు ఆ వైద్యురాలిని గుంటూరు జిల్లాకు బదిలీ చేశారు. ఆ పోస్టులోకి వచ్చేందుకు ఆప్షన్ ఇచ్చిన మరో ఇద్దరు వైద్యులను కూడా వేరో జిల్లాకు బదిలీ చేశారు. కానీ, ఇద్దరు జాయింట్ డైరెక్టర్ విషయంలో మాత్రం అధికారులు ఈ నిబంధన పాటించలేదు. ఈఎస్‌ఐ ప్రధాన కార్యాలయంలో పని చేసే ఒక జాయింట్ డైరెక్టర్, విజయవాడ ఈఎస్‌ఐ జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న మరో అధికారి ఏడేళ్ల నుంచి అవే పోస్టుల్లో పని చేస్తున్నారు. సాధారణ బదిలీల్లో వీరు కచ్చితగా స్టేషన్ మార్చాలి. కానీ విచిత్రంగా ఒక అధికారిని ఎనికేపాడులో ఉన్న ఈఎస్‌ఐ ప్రధాన కార్యాలయం నుంచి ఎనికేపాడులో ఉన్న ఈఎస్‌ఐ జాయింట్ డైరెక్టర్ కార్యాలయానికి బదిలీ చేశారు. మరో అధికారిని జాయింట్ డైరెక్టర్ కార్యాలయం నుంచి ఈఎస్‌ఐ ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. ఈ రెండు కార్యాలయాల మధ్య కేవలం అర కిలోమీటర్ దూరం మాత్రమే ఉంటుంది. జేడీలు తమ పలుకుబడి ఉపయోగించడంతో ఈఎస్‌ఐ ఉన్నతాధికారులు కూడా వారు విజయవాడలోనే ఉండే విధంగా సహకరించారు. ఈఎస్‌ఐలో చేపట్టిన బదిలీల్లో చాలా వరకూ ఇదే విధంగా చేశారన్న విమర్శలు వస్తున్నాయి.

సూపరింటెండెంట్లుగా జూనియర్లు

ఈఎస్‌ఐలో ఏడుగురు సీనియర్ సివిల్ సర్జన్ వైద్యులకు స్పెషల్ గ్రేడ్ సివిల్ సర్జన్‌గా మే నెలలో పదోన్నతి కల్పించారు. తర్వాత పోస్టింగ్‌లో భాగంగా విశాఖపట్నం వంద పడకల ఆస్పత్రికి ముగ్గురు, విజయవాడకు ఇద్దరు, తిరుపతికి ఇద్దరు సీనియర్ వైద్యులకు పోస్టింగ్ ఇచ్చారు. నిబంధనల ప్రకారం ఈఎస్‌ఐ ఆస్పత్రులకు స్పెషల్ గ్రేడ్ సివిల్ సర్జన్లు ఆస్పత్రుల సూపరింటెండెంట్లుగా ఉండాలి. అయితే, ఏడుగురిలో ఎవ్వరికీ సూపరింటెండెంట్లుగా పోస్టింగ్స్ ఇవ్వలేదు. విశాఖపట్నంలో ఉన్న ఈఎస్‌ఐ వంద పడకల ఆస్పత్రికి మాత్రమే స్పెషల్ గ్రేడ్ సివిల్ సర్జన్‌ను సూపరింటెండెంటుగా ఉన్నారు. విజయవాడ, తిరుపతిలో స్పెషల్ గ్రేడ్ సివిల్ సర్జన్లు ఉన్నప్పటికీ జూనియర్లను సూపరింటెండెంట్లుగా కొనసాగిస్తున్నారు. దీంతో సీనియర్ వైద్యులు వెళ్లి జూనియర్ల కింద పని చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో తిరుపతికి చెందిన ఒక వైద్యుడు తాను నెల రోజుల్లో రిటైర్ కాబోతున్నానని, సూపరింటెండెంటుగా అవకాశం కల్పించాలని ఉన్నతాధికారులకు లేఖలు పెట్టుకున్నా ఫలితం లేకపోయింది. జూనియర్ వైద్యులు.. మంత్రి, ఉన్నతాధికారుల వద్ద పలుకుబడి ఉపయోగించి సూపరింటెండెంట్లుగా కొనసాగుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి.

22 ఆలయాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- ప్రత్యేక అధికారుల నియామకం
- శానిటేషన్, క్యూలైన్ల పర్యవేక్షణ ఇతర బాధ్యతలు

అమరావతి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆలయాల్లో భక్తుల సౌకర్యార్థం శానిటేషన్, క్యూలై న్ల మేనేజ్‌మెంట్, ఇతర సౌకర్యాల పర్యవేక్షణపై ప్రభుత్వం దృష్టి సారించింది. రాష్ట్ర వ్యాప్తంగాదే వదాయశాఖ పరిధిలోని 22 ఆలయాలను ఎంపిక చేసి ఏడీసీ, ఆర్జేసీ, డీసీ కేడర్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించింది. వీటిలో ప్రధాన ఆలయాలైన సింహాచలం, అన్నవరం, విశాఖ కనకమహాలక్ష్మీ ఆలయం, అరసవిల్లి, ద్వారకాతిరుమల, వాడపల్లి, మోపిదేవి, బెజవాడ కనకదుర్గమ్మ ఆలయంతోపాటు ఇలా మొత్తం 22 ఆలయాలను అధికారులు ఎంపిక చేశారు. దేవదాయశాఖ అధికారుల నిర్దేశం మేరకు వీరు ఆయా ఆలయాల్లో పరిశుభ్రతకు పెద్దపీట వేస్తూ పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. క్యూలైన్ల పర్యవేక్షణ, భక్తులు వేచి ఉండే గదులను పరిశుభ్రంగా ఉంచ డం, ప్రసాదం నాణ్యతపై పర్యవేక్షణ ఇలా అన్ని రకాల బాధ్యతలు చూడాలి. ఆలయాల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలి. ఎక్కడా లోపాలు లేకుండా చూడాలి. ఏవైనా సమస్యలుంటే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారమివ్వాలి. సమీక్షలు నిర్వహించి, కమిషనర్‌కు నివేదికలు పంపాలి. దేవదాయ శాఖ నిర్దేశించిన ప్రత్యేక నిబంధనలకు అనుగుణంగానే 22 ఆలయాల్లో శానిటేషన్, క్యూలైన్ల ఏర్పాట్లు, ప్రసాదం తయారీ, అన్నదానం నాణ్యత ఉండేటట్లు చూడాలి.

వ్యాపారం పేరిట ఘరానా మోసం

ఒకే కుటుంబానికి కోటికి టోకరా

- పెట్టుబడి పెట్టించి.. తిరిగివ్వని వైనం
- వైసీపీ నేతల అండతోనే: బాధితులు
- అన్నమయ్య జిల్లాలో దంపతుల మోసం
- వైసీపీ ఎంపీ సాయంపై అనుమానాలు
- అరెస్టు చేసిన అనంతపురం పోలీసులు
- కడపలో ఉద్యోగాల పేరుతో యువతకు టోపీ



మాజీ సీఎం జగన్‌తో మధురవాణి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డితో

అనంతపురం క్రైం, జూన్ 15(ఆంధ్రజ్యోతి): వ్యాపారం పేరుతో అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరుకు చెందిన దంపతులు ఘరానా మోసానికి తెరదీశారు. మధు గ్రూప్స్ పేరుతో ఇంపోర్ట్, ఎక్స్‌పోర్ట్ వ్యాపారమని, పెట్టుబడులు పెడితే మంచి లాభాలు వస్తాయని ఆశ పెట్టారు. వారి మాటలను నమ్మి అనంతపురానికి చెందిన ఓ కుటుంబం రూ.కోటికి పైగా పెట్టుబడి పెట్టింది. లాభాలు చూపకపోవడంతోపాటు ఇచ్చిన డబ్బు కూడా చెల్లించకపోవడంతో బాధిత కుటుంబం రైల్వే కోడూరులో పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు యత్నించినా పట్టించుకోలేదు. గత ప్రభుత్వంలో వైసీపీ నేతల అండదండలతో కేసులు లేకుండా చేసుకున్నట్లు తెలుస్తోంది. వైసీపీకి చెందిన ఓ ఎంపీ అండదండలున్నట్లు సమాచారం. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో బాధితులు అనంతపురం టూటౌన్‌లో ఫిర్యాదు చేయడంతోపాటు కోర్టుకెళ్లారు. కోర్టు ఆదేశాలతో ఎట్టకేలకు ఈ నెల 14న అనంతపురం టూటౌన్ పోలీసులు.. చింతా మధురవాణి, చింతా రామసుబ్బారెడ్డి అలియాస్ మన్నూరు రమణయ్య దంపతులను అరెస్టు చేశారు. వీరి బాధితులు కడప జిల్లాలో కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

ఆశ చూపి...

బాధితులు, అనంతపురం టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురానికి చెందిన పిడుగు సుబ్బారెడ్డి... కువైట్‌లో దుస్తుల వ్యాపారం చేసేవారు. కడప జిల్లా రైల్వేకోడూరులోని న్యూక్రిష్ణా నగర్‌కు చెందిన చింతా రామసుబ్బారెడ్డి అలియాస్ మన్నూరు రమణయ్య కువైట్‌లో పోలీసు డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్నారు. అలా వారిద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. తన భార్య చింతా మధురవాణి రైల్వేకోడూరులో మధు గ్రూప్స్ పేరుతో ఇంపోర్ట్స్, ఎక్స్‌పోర్ట్స్ బిజినెస్ చేస్తోందని, దీనిలో పెట్టుబడి పెడితే మంచి లాభాలొస్తాయని రామసుబ్బారెడ్డి నమ్మబలికారు. ఈ విషయాన్ని సుబ్బారెడ్డి.. తన కుమార్తెకు చెప్పడంతో తొలుత వారు నమ్మలేదు. అయితే, మధురవాణి అనంతపురం వచ్చి సుబ్బారెడ్డి కుమార్తెతో మాట్లాడి, తన ఆఫీస్‌కు తీసుకెళ్లి చేస్తున్న బిజినెస్ గురించి వివరించి, ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకున్నట్లు సర్టిఫికెట్లు చూపించారు. ఖతార్ దేశానికి రెండు కంటైనర్లలో బియ్యం పంపుతున్నామనీ, పెట్టుబడి పెట్టాలని కోరారు. దీంతో 2024, జూలై 17న ఒప్పందం కింద రూ.25 లక్షలు ఇచ్చారు. అనంతరం కంటైనర్స్ పంపించడానికి రూ.6.94 లక్షలు చెల్లించాలని చెప్పడంతో ఆ మొత్తం కూడా ఇచ్చారు. ఆ తరువాత ఇక ఆమెతో బిజినెస్ చేయకూడదని నిర్ణయించుకున్నారు. డబ్బు ఇవ్వాలని అడిగారు. అదిగో.. ఇదిగో.. అంటూ మధురవాణి కాలయాపన చేశారు. ఇదే సమయంలో బాధితురాలి తండ్రి సుబ్బారెడ్డి అనారోగ్యం బారినపడి వ్యాపారంలో ఇబ్బందులు తలెత్తాయి. దీనిని కూడా మధురవాణి అనుకూలంగా మలచుకుని, 'మీ పిల్లలు డబ్బు అడుగుతున్నారని, మరికొంత ఇస్తేనే మీ సమస్య తీరుస్తాన'ని చెప్పారు. ఆ డబ్బు ఇస్తేనే పెట్టుబడిగా పెట్టిన డబ్బు వస్తుందని భయపెట్టారు. దీంతో ఆమె చెప్పినట్లుగా సుబ్బారెడ్డి మరోసారి ఖతార్‌కు కంటైనర్లు పంపడానికి గతేడాది సెప్టెంబరు 21న రూ.33.76 లక్షలు వారి బ్యాంకు అకౌంట్‌కు పంపారు. కొన్ని రోజులకు మొదట పెట్టిన పెట్టుబడికి సంబంధించి రూ.2 లక్షలు బాధితురాలి భర్త అకౌంట్‌కు పంపారు. తర్వాత ఆయిల్ బిజినెస్ పేరుతోనూ సొమ్ము మధురవాణి సొమ్ము రాబట్టింది. ఇలా రూ1.15 కోట్లకు మోసపోయామనిబాధితులుఫిర్యాదు చేశారు.

వైసీపీ నేతల అండ

వైసీపీ నేతల అండతోనే మధురవాణి దంపతులు టోకరా పెట్టినట్లు తెలుస్తోంది. మాజీ ముఖ్యమంత్రి జగన్ వద్ద కెళ్లి కొన్ని పనులు చేయించుకున్నట్లు సమాచారం. స్థానికంగా ఎంపీ మిథున్‌రెడ్డితో సన్నిహిత సంబంధాల నేపథ్యంలోనే పోలీసు స్టేషన్లలో కేసులు లేకుండా వ్యవహారం నడిపినట్లు తెలిసింది. ఈ కారణంలోనే బాధితులు ఫిర్యాదు కూడా చేయలేకపోయారని తెలిసింది.

ఉద్యోగాల పేరిట కడపలో..

ఉమ్మడి కడప జిల్లాలో మధురవాణి దంపతులు మరెన్నో మోసాలు చేసినట్లు తెలుస్తోంది. ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి కొందరు యువకుల నుంచి డబ్బు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. కొందరు యువతులను కువైట్‌లో ఉద్యోగం పేరుతో పంపి వారిని ట్రాప్ చేసినట్లు సమాచారం. భర్త కువైట్‌లో పోలీసు ఆఫీసర్‌గా ఉండటంతో ఈ పనులు సులువైనట్లు తెలుస్తోంది. అయితే, బాధితులు ఫిర్యాదు చేయడం లేదు. దీనికి ఆ కుటుంబానికి ఉన్న రాజకీయ పలుకుబడేకారణమని సమాచారం.

అమెరికాలో అదరగొట్టిన తెలుగమ్మాయి

- ఫోస్టర్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో టాపర్‌గా శ్రీకావ్య
- 'మాస్టర్ ఆఫ్ సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్'లో డిగ్రీ



అమలాపురం, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణానికి చెందిన చావలి శ్రీకావ్య అమెరికాలో అదరగొట్టారు. వాషింగ్టన్ విశ్వవిద్యాలయానికి చెందిన సియాటిల్‌లోని ఫోస్టర్ స్కూల్ ఆఫ్ బిజినెస్ నుంచి అత్యంత పర్సెంటైల్ గల 20 మంది విద్యార్థుల్లో టాపర్‌గా నిలిచి 'మాస్టర్ ఆఫ్ సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్' డిగ్రీని అందుకున్నారు. స్థానికంగా శనివారం జరిగిన స్నాతకోత్సవంలో డీన్ ఫ్రాంక్‌హజ్ ఆమెకు 'మాస్టర్ ఆఫ్ సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్' డిగ్రీని ప్రదానం చేశారు. అమలాపురానికి చెందిన కోనసీమ సైన్స్ పరిషత్ వ్యవస్థాపకుడు, అధ్యాపకుడు సీవీ సర్వేశ్వరశర్మ దంపతుల కుమారుడు చావలి ఎస్ఎస్ సూర్య కుమార్తే కావ్య. ఆమె ఈ ఘనత సాధించడంతో వారి ఇంట ఆనందానికి అవధుల్లేవు. 1993లో సూర్య-రమాదేవి దంపతులకు జన్మించిన కావ్య ఇప్పటికే నాలుగు పోస్టుగ్రాడ్యుయేట్ డిగ్రీలు సాధించారు. హైదరాబాద్ జేఎన్‌టీయూ నుంచి ఎంటెక్, స్వీడన్‌లోని బ్లెకింజ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి టెలీకమ్యూనికేషన్ టెక్నాలజీలో ఎమ్మెస్, కేరళలోని కోజికోడ్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ మేనేజ్‌మెంట్ నుంచి ఎంబీఏ చేశారు. క్రీడల్లో కూడా ఆమె ప్రతిభ కనబర్చారు. ఎయిర్ రైఫిల్ షూటర్‌గా ఆమె గతంలో జాతీయ స్థాయిలో పలు పతకాలు సాధించారు. అమెజాన్‌లో పనిచేస్తున్న చంద్రశేఖర్ అనే వ్యక్తిని కావ్య వివాహం చేసుకుని ప్రస్తుతం అమెరికాలో స్థిరపడ్డారు. ఆమె తండ్రి సూర్య కూడా ఉద్యోగరీత్యా అక్కడే స్థిరపడ్డారు. కావ్య ఫోస్టర్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో సీటు సంపాదించడమే కాకుండా టాపర్‌గా నిలవడం ఎంతో ఆనందంగా ఉందని ఆమె తాత, సైన్స్ పరిషత్ అధ్యక్షుడు సీవీ సర్వేశ్వరశర్మ అన్నారు.

ఇవేం కోతలు బాబోయ్!

(మొదటి పేజీ తరువాయి)

స్టేషన్ల నుంచి 34.969, ఐపీపీ (సెయిల్, హిందూజా)ల నుంచి 45.101, ప్రైవేట్ విండ్ నుంచి 21.687, ప్రైవేటు సోలార్ నుంచి 16.336 మిలియన్లు ఉండగా, మార్కెట్ నుంచి అదనంగా 12.808 మిలియన్ యూనిట్లు కొనుగోలు చేశారు.

ఒకవైపు అత్యవసర కొనుగోళ్లు.. మరోవైపు జెన్కోలో బ్యాకింగ్ డౌన్

రాష్ట్రంలో ఒకవైపు డిమాండ్ పెరిగి రోజుకు 12.808 మిలియన్ యూనిట్లను కొనుగోలు చేస్తుంటే, మరోవైపు రాయలసీమ థర్మల్ ప్లాంటులో 1.303 మిలియన్ యూనిట్లు, విజయవాడ థర్మల్ స్టేషన్‌లో 0.601, కృష్ణపట్నంలో 0.295.. మొత్తంగా 2.199 మిలియన్ యూనిట్లను పీక్ అవర్‌లో (రాత్రి 7 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు) యూనిట్‌కు సగటున పది రూపాయల చొప్పున కొనుగోలు చేస్తున్నట్లుగా అధికారులు చెబుతున్నారు. అయితే గణాంకాలేవీ బహిర్గతం చేయడం లేదు. గతంలో 2014-19 మధ్య కాలంలో విద్యుత్తు గణాంకాలన్నీ పారదర్శకంగా ఆన్‌లైన్‌లో కనిపించేవి. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వ హయంలో విద్యుత్తు గణాంకాలన్నీ తెరచాటుకు వెళ్లిపోయాయి. ఏపీ జెన్కో విద్యుదుత్పత్తి ప్లాంట్లలో ఉత్పత్తిని గణనీయంగా తగ్గించి బ్యాకింగ్ డౌన్ చేయించి బహిరంగ మార్కెట్లో భారీగా డబ్బు చెల్లించి కరెంటు కొన్నారు. వినియోగదారులపై ఇంధన సర్దుబాటు పేరిట రూ.వేల కోట్లు వసూలు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా ఏపీపీసీసీ, ఏపీ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఏపీఎస్ఎల్‌డీసీ) తీరులో మార్పేమీ రాలేదు. విద్యుత్తు కొనుగోళ్ల సమాచారం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడుతున్నారు. కరెంటు కోతలు అధికారికంగా లేవని, అంతరాయం మాత్రమే ఉందని డిస్కమ్‌లు చెబుతున్నా.. సరఫరా నిలిచిపోవడాన్ని సామాన్యుడు కరెంటు కోతగానే భావిస్తాడు. అయితే ఈ వాదనలకు డిస్కమ్‌లు మాత్రం సాంకేతిక సాకులు చూపుతున్నాయి. ప్రస్తుతం వ్యవసాయ విద్యుత్తు డిమాండ్ అంతంత మాత్రంగానే ఉండటంతో రైతాంగ నుంచి కరెంటు సరఫరాపై పెద్దగా ఆందోళన లేదు. అయితే, ఏరువాక మొదలైనందున మున్ముందు వ్యవసాయ విద్యుత్తు డిమాండ్ పెరిగితే పరిస్థితి ఏమిటన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

జగన్‌కు దిక్కుతోచకే విమర్శలు

- కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికీ రూ.13 వేలు అందిస్తే జగన్‌రెడ్డికి దిక్కుతోచట్లేదని, ఇష్టానుసారం మాట్లాడుతున్నాడని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. మచిలీపట్నంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కుటుంబంలో ఒక్క విద్యార్థికే జగన్ సాయం చేశారని, కూటమి ప్రభుత్వం మాత్రం పిల్లలందరికీ అమలు చేస్తోందన్నారు. రూ.15 వేలలో రూ.2 వేలు జేబులో వేసుకుంటున్నారని వైసీపీ నాయకులు విమర్శించడం హాస్యాస్పదమని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వంలో రూ.2 వేలు కట్ చేసి పాఠశాల అభివృద్ధికి వాడారని, ఇప్పుడు కూడా అదే జరిగిందని తెలిపారు. నాడు మిగిల్చిన రూ.2 వేలు జగన్ జేబులోకి వెళ్లాయా అని ప్రశ్నించారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామన్నారు. విలేకరుల సమావేశంలో మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.